

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 7-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 241

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: విదియ ఉ.11:06 తదుపరి తదియ, నక్షత్రం: రోహిణి రా.12:33 తదుపరి మృగశిర, వర్జ్యం: సా.5:31-6:55, తె.5:33 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8:35-9:20, మ.12:21-1:06, అమృతఘడియలు: రా.9:44-11:08, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:19, సూర్యాస్తమయం: 5:37

గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత్‌కు బడా బ్యాంకులు కావాలి

● ఆర్‌బీఐ, బ్యాంకులతో చర్చలు జరుపుతున్నాం ● ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ వెల్లడి
● బ్యాంకింగ్‌లో మరిన్ని విలీనాలు, ప్రైవేటీకరణకు అవకాశం ● భగ్గుమన్న ఉద్యోగ సంఘాలు



ముంబై: భారత్‌లోనూ ప్రపంచ స్థాయి పెద్ద బ్యాంకుల అవసరం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), సంబంధిత బ్యాంకులతో చర్చిస్తున్నట్టు వెల్లడించారు. ఎస్‌బీఐ 12వ బ్యాంకింగ్ అండ్ ఎకనామిక్ కాంక్లేవ్- 2025 సదస్సులో ఆమె ఈ విషయం చెప్పారు. మన దేశంలో ప్రపంచ స్థాయి పెద్ద బ్యాంకుల ఏర్పాటుపై తుది నిర్ణయం తీసుకునేందుకు చాలా కసరత్తు చేయాల్సి ఉంటుందని సీతారామన్ తెలిపారు. ఇందుకు అవసరమైన సలహాలు, సూచనల కోసం ఆర్‌బీఐ, బ్యాంకులతో చర్చిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ లేదా విలీనాల ద్వారా ప్రభుత్వం ఇందుకు శ్రీకారం చుట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

బడా బ్యాంకులు ఎలా?

అయితే ప్రపంచ స్థాయి పెద్ద బ్యాంకులను మన దేశంలో ఏర్పాటు చేయడం ఎలా? అనే అంశాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించలేదు. దీంతో ప్రస్తుతం ఉన్న 12 ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)ను మరింత కుదించి ఏర్పాటు చేస్తారా? లేక వేరే మార్గమేదైనా ఆలోచిస్తారా? అనే అంశంపై స్పష్టత రావడం లేదు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) వంటి పీఎస్‌బీల ప్రైవేటీకరణకు నీతి ఆయోగ్ నాలుగేళ్ల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉద్యోగ సంఘాల వ్యతిరేకత, ఇతర సమస్యల కారణంగా గత నాలుగేళ్లుగా ఈ విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ఐఓబీ, సీబీఐతో పాటు మరో రెండు పీఎస్‌బీలను ఆర్థికంగా బలంగా ఉన్న ఇతర పీఎస్‌బీల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు వినిపిస్తున్నాయి.

ఎస్‌బీఐ మార్కెట్ క్యాప్ రూ.8.86 లక్షల కోట్లు

మరో ఐదేళ్లలో ప్రపంచంలోని టాప్-10 బ్యాంకుల్లో ఒకటిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇదే సదస్సులో ప్రసంగించిన ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు. గురువారం తమ బ్యాంకు షేర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ 10,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.86 లక్షల కోట్లు) చేరినట్టు ఆయన వెల్లడించారు. కాగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎఫ్‌డీఐ పరిమితిని ప్రస్తుత 20 శాతం నుంచి 49 శాతానికి పెంచే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని ఆయన కోరారు. దీనివల్ల ప్రభుత్వ-ప్రైవేట్ బ్యాంకుల మధ్య మరింత సమతుల్యత ఏర్పడుతుందన్నారు.

ప్రైవేటీకరణతో ముప్పే

పీఎస్‌బీల ప్రైవేటీకరణతో దేశ ప్రయోజనాలకు, ఆర్థిక సమ్మిళితానికి ఎలాంటి ముప్పు లేదని ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. పీఎస్‌బీలను ప్రైవేటీకరించడం ముమ్మాటికీ దేశ, సామాజిక ప్రయోజనాలకు ముప్పని బ్యాంకింగ్ ఉద్యోగులకు సంబంధించిన తొమ్మిది యూనియన్లకు ప్రాతినిధ్యం వహించే యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఒక ప్రకటనలో తెలిపింది. దీనివల్ల ఉద్యోగ భద్రతతో పాటు బ్యాంకుల్లోని ప్రజల సొమ్ముకూ ఎలాంటి భద్రత ఉండదని హెచ్చరించింది. ప్రైవేటీకరణ కంపెనీలకు మేలు చేస్తుందే తప్ప, ప్రజలకు కాదని స్పష్టం చేసింది. ప్రభుత్వాలు బ్యాంకింగ్ రంగాన్ని సామాజిక, రాజ్యాంగ బాధ్యతగా చూడాలే తప్ప, లాభాల కోసం చేసే వ్యాపారంగా చూడకూడదని యూఎఫ్‌బీయూ కోరింది. ఏ పీఎస్‌బీని ప్రైవేటీకరించబోమని ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,21,910 ▲	1,11,750 ▲	1,64,000 ▲
విజయవాడ	1,24,600 ▲	1,16,000 ▼	1,52,600 ▲
విశాఖపట్నం	1,24,510 ▲	1,11,350 ▼	1,64,000 ▲
రాజమండ్రి	1,21,910 ▲	1,11,750 ▲	1,48,000 ▲
ప్రొద్దుటూరు	1,20,400 ▼	1,10,770 ▼	1,51,300 ▲
ముంబై	1,20,670 ▲	1,10,534 ▲	1,48,242 ▲

ప్లాస్టో నుంచి అన్‌బ్రేకబుల్ టేబుల్



హైదరాబాద్: ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్ తన ఉత్పత్తుల పోర్టుఫోలియోను మరింతగా విస్తరించింది. తాజాగా గృహ, వాణిజ్య అవసరాల కోసం అన్‌బ్రేకబుల్ టేబుల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పటిష్ఠమైన, డ్యూరబుల్ ప్లాస్టిక్‌తో సరికొత్త స్టైల్‌తో యూవీ ప్రొటెక్షన్, యాంటీఆక్సిడెంట్ టెక్నాలజీతో ఈ టేబుల్‌ను తయారు చేసినట్లు ప్లాస్టో పేర్కొంది. ఆఫీస్, గృహావసరాలకు చక్కగా సరిపోయే ఈ టేబుల్‌ను పదేళ్ల వారంటీతో అందిస్తున్నట్లు ప్లాస్టో వెల్లడించింది.

● వచ్చే మూడేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని పునరుత్పాదక ఇంధన రంగంలో 1,200 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రకటించింది. రెన్యువబుల్ ఎనర్జీతో పాటు రాష్ట్రంలో ది లీలా హోటల్స్ విస్తరణతో పాటు విశాఖపట్నంలో శాటిలైట్ టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. 2030 నాటికి భారత్‌లో తమ పోర్టుఫోలియోను 10,000 కోట్ల డాలర్లకు చేర్చేందుకు ఈ పెట్టుబడులు దోహదపడతాయని తెలిపింది.



ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	100	విజయవాడ	106
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	97
కర్నూలు	100	నెల్లూరు	102
విశాఖపట్నం	108	అనంతపురం	102
గోదావరి	106		

దాతృత్వంలో నాడార్ మేటి

» గత ఏడాది రూ.2,708 కోట్ల విరాళాలు ఇచ్చిన హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకుడు
» రోజుకు సగటున రూ.7.4 కోట్లు దానం

ఎడెల్‌గివ్-హురున్ దాతల నివేదిక విడుదల

న్యూఢిల్లీ: దానం చేసేందుకు డబ్బుతో పాటు గొప్ప మనసు కూడా ఉండాలి. ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్ దేశంలో అత్యంత దయాగుణం కలిగిన వ్యక్తిగా నిలిచారు. గురువారం విడుదలైన 'ఎడెల్‌గివ్-హురున్ ఇండియా దాతలు 2025' జాబితా ప్రకారం.. గత ఏడాది నాడార్ కుటుంబం శివ్ నాడార్ ఫౌండేషన్ ద్వారా రూ.2,708 కోట్ల విరాళాలిచ్చింది. అంటే, రోజుకు సగటున రూ.7.4 కోట్లు దానం చేసిందీ కుటుంబం. ఎడెల్‌గివ్-హురున్ ఏటా విడుదల చేస్తున్న ఈ జాబితాలో నాడార్ అగ్రస్థానంలో నిలవడం ఐదేళ్లలో ఇది నాలుగో సారి. గడిచిన ఐదేళ్లలో నాడార్ ఫ్యామిలీ మొత్తం రూ.10,122 కోట్లు ప్రధానంగా విద్యా రంగానికి విరాళాలిచ్చింది.

● భారత్‌లో అత్యంత ధనవంతుడైన ముకేశ్ అంబానీ, ఆయన కుటుంబం దాతృత్వం విషయంలో మాత్రం రెండో స్థానంలో నిలిచింది. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా ఈ కుటుంబం రూ.626 కోట్లు దానం చేసింది.

● దేశంలో రెండో అతిపెద్ద ధనవంతుడైన గౌతమ్ అదానీ, కుటుంబం రూ.386 కోట్ల విరాళాలతో ఐదో స్థానంలో ఉంది.

● ఈసారి జాబితాలో మొత్తం 191 మందికి స్థానం లభించింది. అందులో 12 మంది కొత్తవారు. వారి మొత్తం విరాళాలు రూ.10,380 కోట్లు. మూడేళ్ల క్రితంతో పోలిస్తే ఈ విలువ 85 శాతం పెరిగింది. మొత్తం విరాళాల్లో దాదాపు 40 శాతం విద్యా రంగానికి, 9 శాతం హెల్త్‌కేర్ రంగానికి దక్కాయి.

● దేశంలోని టాప్-10 దాతలు మొత్తం రూ.5,834 కోట్ల విరాళాలిచ్చారు. గత ఏడాదితో పోలిస్తే 26 శాతం అధికమిది. అంతేకాదు, లిస్ట్‌లోని అందరి విరాళాల్లో వీరి వాటాయే 56 శాతంగా ఉంది.

● జాబితాలోని టాప్ -25 దాతలు గత మూడేళ్లలో మొత్తం రూ.50,000 కోట్లు దానం చేశారు. అంటే, రోజుకు సగటున రూ.46 కోట్లు ఇచ్చారు.

రెండో రోజూ నష్టాల్లో..

సెన్సెక్స్ 148 పాయింట్లు డౌన్

ముంబై: ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైన ఈక్విటీ సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 148.14 పాయింట్లు కోల్పోయి 83,311.01 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సూచీ 83,846.35 వద్ద గరిష్ఠాన్ని, 83,237.65 వద్ద కనిష్ఠ స్థాయిలను నమోదు చేసింది. నిఫ్టీ 87.95 పాయింట్లు పతనమై 25,509.70 వద్ద క్లోజైంది. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి.

» కాంటినెంటల్ టైర్స్ ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు మరింతగా విస్తరించింది. తిరుపతిలో కొత్త కాంటినెంటల్ ప్రీమియం డ్రైవ్ (సీపీడీ) పేరుతో కొత్త కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ కేంద్రంలో టైర్లతో పాటు వీల్ అలైన్‌మెంట్, బ్యాలెన్సింగ్, నైట్రోజన్ సేవలను అందినుంది. ఈ స్టోర్‌తో మొత్తం స్టోర్ల సంఖ్య 200కి చేరింది. కాగా ప్యాసింజర్, లైట్ ట్రక్స్ వ్యాపార విస్తరణ కోసం భారత్‌లో రూ.100 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు కాంటినెంటల్ టైర్స్ ఇటీవల ప్రకటించింది.

ఎల్‌ఐసీ లాభం రూ.10,053 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.10,053 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.7,621 కోట్లతో పోల్చితే ఇది 32% అధికం. ఇదే కాలంలో మొత్తం ఆదాయం సైతం రూ.2,29,620 కోట్ల నుంచి రూ.2,39,614 కోట్లకు పెరిగింది. మొత్తం ప్రీమియం ఆదాయం సైతం రూ.1,19,901 కోట్ల నుంచి రూ.1,26,479 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయం రూ.2,30,160 కోట్లుగా నమోదైంది. త్రైమాసిక రెన్యువల్ ప్రీమియం రూ.61,910 కోట్ల నుంచి రూ.64,996 కోట్లకు పెరిగింది.

పెరిగిన అపోలో హాస్పిటల్స్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్స్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.477 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 26 శాతం వృద్ధి చెందింది. హెల్త్‌కేర్ సర్వీసులు, రిటైల్, ఫార్మా పంపిణీ విభాగాలు మంచి పనితీరు కనబరచటం కలిసివచ్చిందని పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.5,589 కోట్ల నుంచి రూ.6,304 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో హెల్త్‌కేర్ సర్వీసుల (హాస్పిటల్స్) ఆదాయం 9 శాతం వృద్ధితో రూ.2,903 కోట్ల నుంచి రూ.3,169 కోట్లకు చేరుకుంది.

అమర రాజా లాభంలో 17% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.3,495.07 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.276.49 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 6.7 శాతం పెరగగా లాభం 17.36 శాతం వృద్ధి చెందింది. స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన రూ.3,412.26 కోట్ల ఆదాయంపై రూ.302.40 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సెప్టెంబరు త్రైమాసికంలో 4 వీలర్, టూవీలర్ విభాగాల నుంచి డిమాండ్ ఉండటంతో పాటు ల్యాబ్స్ వ్యాపార పనితీరు మెరుగ్గా ఉండటం కలిసి వచ్చిందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన గౌరినేని పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 5.40 (540%) మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు ప్రకటించింది. డిసెంబరు 5వ తేదీ లోపు ఈ డివిడెండ్‌ను చెల్లించనున్నట్లు తెలిపింది.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 7వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	585
వరంగల్	582	గోదావరి	595
చిత్తూరు	613	విశాఖపట్నం	580
		డజను గుడ్లు రూ. 78	

ఫైనల్ అహ్మదాబాద్‌లో..?

భారత్‌లో ఐదు వేదికలు

● ఐసీసీ కుదించిన జాబితా
● త్వరలో టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది భారత్-శ్రీలంక సంయుక్తంగా నిర్వహించనున్న టీ20 వరల్డ్‌కప్ కోసం ఐసీసీ కుదించిన వేదికల జాబితాను సిద్ధం చేసింది. చేసింది. అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబైల్లో మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. అయితే, ఫైనల్‌కు మాత్రం అహ్మదాబాద్ ఆతిథ్యం ఇవ్వొచ్చు. కాగా, వచ్చే వారం ఐసీసీ షెడ్యూల్‌ను విడుదల చేసే చాన్సులున్నాయి. 20 జట్ల టోర్నీని ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు 8 వేదికల్లో నిర్వహించే అవకాశం ఉంది. పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లకు తటస్థ వేదికగా శ్రీలంకను ఎంపిక చేశారు. కాండీ, కొలంబోతోపాటు మరో వేదికను త్వరలో ఖరారు చేయనున్నారు. ఒక వేళ పాక్ ఫైనల్ చేరితే మాత్రం టైటిల్ పోరును తటస్థ వేదికైన లంకలోనే నిర్వహించాల్సి ఉంటుంది.

జురెల్ శతకం

భారత్ 'ఎ' 255
దక్షిణాఫ్రికా 'ఎ'తో టెస్ట్

బెంగళూరు: ధ్రువ్ జురెల్ (132 నాటౌట్) శతకంతో పోరాడడంతో దక్షిణాఫ్రికా 'ఎ'తో గురువారం ప్రారంభమైన నాలుగు రోజుల రెండో అనధికార టెస్ట్‌లో భారత్ 'ఎ' 255 పరుగులు సాధించింది. పంత్ (24), కుల్దీప్ (20), కేఎల్ రాహుల్ (19) విఫలమయ్యారు. ఊరెన్ 4, మొరేకి, సుబ్రేయిన్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

విశ్వ విజేతలకు టాటా కార్లు

న్యూఢిల్లీ: మహిళల వన్డే వరల్డ్‌కప్ గెలిచిన భారత జట్టుకు టాటా మోటార్స్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. సరికొత్త రూపుతో ఈనెల 25న మార్కెట్లోకి రాబోతున్న తమ సియెరా ఎస్‌యూవీ కార్లను అందించనుంది. ఈ కారు ధర రూ.15-25 లక్షల వరకు ఉండనుంది.

మూడో రౌండ్‌కు ప్రజ్ఞానంద

పనాజీ (గోవా): ఫిడే వరల్డ్‌కప్‌లో ప్రజ్ఞానంద సహా పలువురు భారత జీఎంలు మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన రెండో రౌండ్ టైబ్రేకర్ పోరులో ఆస్ట్రేలియా జీఎం కుయ్యోకరోవ్‌ను ఓడించి ప్రజ్ఞానంద ముందంజ వేశాడు. అలాగే విదిత్ గుజరాతి 12 ఏళ్ల అర్జెంటీనా బాలుడు ఫాస్టినో ఓరోపై నెగ్గాడు. ఇంకా ప్రణవ్, ప్రాణేష్ కూడా తదుపరి రౌండ్‌కు చేరారు.

అండర్-19 వరల్డ్ కప్.. వన్డే ఫార్మాట్‌లోనే

దుబాయ్: అండర్-19 పురుషుల వరల్డ్‌కప్ వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతుందని ఐసీసీ స్పష్టం చేసింది. తాజాగా దుబాయ్‌లో జరుగుతున్న చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (సీఈసీ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. టీ20లకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఈ మెగా టోర్నీ ప్రస్తుత ఫార్మాట్‌ను మార్చాలంటూ పలు అసోసియేట్ మెంబర్స్ డిమాండ్ చేశారు. కానీ శాశ్వత సభ్య దేశాలు మాత్రం వన్డేలకే ఓటేశాయి.

సిరీస్ ఇక పదిలమే..

● 2-1తో ఆధిక్యం ● చెలరేగిన బౌలర్లు
● భారత్ ఘనవిజయం ● ఆసీస్‌తో నాలుగో టీ20



గిల్ (46)



అక్షర్ (2/20)

గోల్డ్‌కోస్ట్: సూర్యకుమార్ నేతృత్వంలోని భారత టీ20 జట్టు ఇప్పటిదాకా సిరీస్‌ను కోల్పోలేదు. అలాగే ఆసీస్ గడ్డపైనా ఈ ఫార్మాట్‌లో అజేయంగా ఉన్న రికార్డుకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. గురువారం ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగో టీ20లో బౌలర్లు విశేషంగా రాణించడంతో భారత జట్టు 48 పరుగుల తేడాతో వరుసగా రెండో విజయం సాధించింది. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో ప్రస్తుతం 2-1తో ఆధిక్యంలో నిలిచింది. తొలి మ్యాచ్ వర్షంతో రద్దయిన విషయం తెలిసిందే. శనివారం బ్రిస్బేన్‌లో చివరి మ్యాచ్ జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 167 పరుగులు చేసింది. గిల్ (39 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 46), అభిషేక్ (21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 28) పర్వాలేదనిపించగా.. చివర్లో అక్షర్ పటేల్ (11 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 21 నాటౌట్) వేగంగా ఆడాడు. పేసర్ ఎలిస్, స్పిన్నర్ జంపాలకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 18.2 ఓవర్లలో 119 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు మార్ష్ (24 బంతుల్లో 4 ఫోర్లతో 30), షార్ట్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25) మాత్రమే రాణించారు. సుందర్‌కు మూడు.. అక్షర్, దూబేలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆల్‌రౌండ్‌షో కనబర్చిన అక్షర్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

స్పిన్‌కు తడబాటు: ఓ మాదిరి ఛేదనను ఆసీస్ మెరుగ్గానే ఆరంభించినా మధ్య ఓవర్లలో భారత స్పిన్నర్లు కట్టడి చేశారు. ఓపెనర్లు మార్ష్, షార్ట్ మాత్రమే కాస్త పోరాడగలిగారు. ఈ జోడీ క్రీజులో ఉన్నంత సేపు ఆసీస్ విజయంపై ఆశతోనే ఉంది. పవర్‌ప్లేలో షార్ట్‌ను అక్షర్ అవుట్ చేయగా, కాసేపటికే వన్‌డౌన్ బ్యాటర్ ఇన్‌గ్లిస్ (12)ను కూడా దెబ్బతీశాడు. మరోవైపు జోరు మీదున్న మార్ష్, టిమ్ డేవిడ్ (14)లను శివమ్ దూబే తన వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో ఆసీస్ ఛేదనపై ప్రభావం చూపింది. ఇక 14వ ఓవర్‌లో ఫిలిప్ (10)ను అర్ష్‌దీప్ అవుట్ చేశాక వికెట్ల పతనం వేగంగా సాగింది. సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడిన హిట్టర్ మ్యాక్స్‌వెల్ (2) కేవలం నాలుగు బంతులే ఆడి వరుణ్ చేతిలో బౌల్డయ్యాడు. అలాగే 17వ ఓవర్‌లో స్టొయినిస్ (17), బార్ట్‌లెట్ (0)లను స్పిన్నర్ సుందర్ వరుస బంతుల్లో అవుట్ చేయడంతో ఆసీస్ కోలుకోలేకపోయింది. 16 పరుగుల తేడాతో చివరి 5 వికెట్లు కోల్పోయిన ఆసీస్ మరో 10 బంతులుండగానే ఓటమిపాలైంది.

ఆకట్టుకున్న గిల్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ ఆశించిన రీతిలో సాగలేదు. పిచ్ బ్యాటింగ్‌కు కష్టంగా మారడంతో ఓపెనర్ అభిషేక్ భారీ షాట్లు ఆడలేకపోయాడు. అటు గిల్ మాత్రం ఈసారి మెరుగైన ఆటతో ఆకట్టుకున్నాడు. ఓ దశలో 121/2 స్కోరుతో పటిష్ఠంగా కనిపించినా.. చివరి ఆరు ఓవర్లలో 46 పరుగులే చేయగలిగింది. ఇన్నింగ్స్ రెండో బంతికే అభిషేక్ ఇచ్చిన క్యాచ్‌ను బార్ట్‌లెట్ వదిలేశాడు. ముఖ్యంగా గిల్ సాధికారికంగా ఆడి నాలుగో ఓవర్‌లో రెండు ఫోర్లు బాదాడు. అటు ఐదో ఓవర్‌లో అభిషేక్ సైతం రెండు ఫోర్లతో 11 రన్స్ రాబట్టడంతో జట్టు పవర్‌ప్లేలో 49 పరుగులతో నిలిచింది. ఇక జంపా ఓవర్‌లో సిక్సర్ బాదిన అభిషేక్ మరో షాట్‌కు వెళ్లి లాంగాన్‌లో డేవిడ్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనూహ్యంగా వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన దూబే (22) ఉన్న కాసేపు వేగంగా ఆడాలని చూసినా.. పేసర్ ఎలిస్‌కు చిక్కాడు. అటు కెప్టెన్ సూర్య 13వ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో జోష్ చూపాడు. అటు తర్వాతి ఓవర్‌లోనే గిల్ కూడా సిక్సర్ బాది హాఫ్ సెంచరీ ఖాయమనిపించాడు. కానీ ఎలిస్ విసిరిన స్లో బాల్‌కు క్లీన్ బౌల్డయ్యాడు. ఆ తర్వాత సూర్య నిష్క్రమించగా, స్పిన్నర్ జంపా ఒకే ఓవర్‌లో తిలక్ (5), జితేశ్ (3)లను పెవిలియన్‌కు చేర్చి షాకిచ్చాడు. అయితే సుందర్ (12) అవుటయ్యాక ఆఖరి ఓవర్‌లో అక్షర్ 4,6తో 14 రన్స్ అందించి జట్టుకు సవాల్ విసిరే స్కోరందించాడు.

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (సి) డేవిడ్ (బి) జంపా 28, గిల్ (బి) ఎలిస్ 46, దూబే (బి) ఎలిస్ 22, సూర్యకుమార్ (సి) డేవిడ్ (బి) బార్ట్‌లెట్ 20, తిలక్ (సి) ఇన్‌గ్లిస్ (బి) జంపా 5, జితేశ్ (ఎల్బీ) జంపా 3, సుందర్ (సి సబ్) కునేమన్ (బి) ఎలిస్ 12, అక్షర్ (నాటౌట్) 21, అర్ష్‌దీప్ (సి) ఫిలిప్ (బి) స్టొయినిస్ 0, వరుణ్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 167/8. వికెట్ల పతనం:** 1-56, 2-88, 3-121, 4-125, 5-131, 6-136, 7-152, 8-164; **బౌలింగ్:** డ్వార్షుస్ 4-0-31-0, బార్ట్‌లెట్ 4-0-26-1, ఎలిస్ 4-0-21-3, స్టొయినిస్ 4-0-41-1, జంపా 4-0-45-3.

ఆస్ట్రేలియా: మార్ష్ (సి) అర్ష్‌దీప్ (బి) దూబే 30, షార్ట్ (ఎల్బీ) అక్షర్ 25, ఇన్‌గ్లిస్ (బి) అక్షర్ 12, డేవిడ్ (సి) సూర్యకుమార్ (బి) దూబే 14, ఫిలిప్ (సి) వరుణ్ (బి) అర్ష్‌దీప్ 10, స్టొయినిస్ (ఎల్బీ) సుందర్ 17, మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ 2, డ్వార్షుస్ (బి) బుమ్రా 5, బార్ట్‌లెట్ (సి అండ్ బి) సుందర్ 0, ఎలిస్ (నాటౌట్) 2, జంపా (సి) గిల్ (బి) సుందర్ 0; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 18.2 ఓవర్లలో 119 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-37, 2-67, 3-70, 4-91, 5-98, 6-103, 7-116, 8-116, 9-118, 119-10; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-22-1, బుమ్రా 4-0-27-1, వరుణ్ 4-0-26-1, అక్షర్ 4-0-20-2, దూబే 2-0-20-2, సుందర్ 1.2-0-3-3.

ఆసీస్ గడ్డపై గతంలో భారత్ ఆడిన నాలుగు టీ20 సిరీస్‌ల్లో రెండు గెలవగా, రెండు సమమయ్యాయి. తాజా సిరీస్‌ను కూడా ఓటమి లేకుండానే ముగించనుంది.

2 స్వదేశంలో జరిగిన టీ20ల్లో ఆసీస్‌కిది రెండో అత్యల్ప స్కోరు (119). గతంలో కివీస్‌పై 111 పరుగులు చేసింది.

నేడు కడపకు శ్రీచరణి

భారీ ర్యాలీ.. సత్కారం



కడప స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భారత విజయంలో కీలక పాత్ర పోషించిన నల్లపురెడ్డి శ్రీచరణి శుక్రవారం సాయంత్రం సొంతజిల్లా కడపకు రానుంది. శ్రీచరణికి ఘన స్వాగతం పలికేందుకు ఆంధ్ర క్రికెట్ సౌజన్యంతో భారీ ఏర్పాట్లు చేసినట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. శ్రీచరణి అద్భుతమైన స్పిన్ బౌలర్ రూపంలో భారత క్రికెట్‌కు దొరికిన ఆణిముత్యమని కొనియాడారు. దాదాపు ఐదు సంవత్సరాలు కడపలో శిక్షణ పొందిన ఆమె అత్యున్నత శిఖరాలను అధిరోహించడం గర్వకారణమన్నారు. ఆమె ప్రస్థానంలో తమ జిల్లా సంఘంతోపాటు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కృషి ఎంతో ఉన్నదన్నారు. సాయంత్రం 4.30 గంటలకు కడప చేరుకున్న అనంతరం స్థానిక హెడ్ పోస్ట్‌ఆఫీసు నుంచి , 7 రోడ్లు, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, యర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్ మార్గ్ వరకూ భారీ ర్యాలీ ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం 6.30 గంటలకు రిమ్స్ సమీపంలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో సత్కారం ఉంటుందన్నారు.



యువతరానికి మీరు ఆదర్శం

విశ్వవిజేతలకు రాష్ట్రపతి ముర్ము ప్రశంస

న్యూఢిల్లీ: మహిళల వన్డే వరల్డ్ కప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గురువారం రాష్ట్రపతి భవన్‌లో కలిసింది. మెగా టోర్నమెంట్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరచిందని ఈ సందర్భంగా రాష్ట్రపతి కొనియాడారు. ట్రోఫీతో హర్మన్ సేన చరిత్ర సృష్టించడంతో పాటు యువతరానికి ఆదర్శంగా నిలిచిందని ముర్ము ప్రశంసించారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ ట్రోఫీని కెప్టెన్ హర్మన్ రాష్ట్రపతికి అందజేయడంతోపాటు జట్టు సభ్యులు సంతకాలు చేసిన జెర్సీని ఆమెకు ప్రదానం చేసింది.

వేలానికి దీప్తి, వోల్వార్ట్



● మంధాన, బ్రంట్, గార్డ్‌నర్‌కు రూ. 3.5 కోట్లు
● వదిలేసిన జాబితాలో హీలీ, లానింగ్, శ్రీచరణి, అరుంధతి
● డబ్ల్యూపీఎల్ రిటైన్ జాబితా విడుదల

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మెగా వేలానికి ముందు సంచలనాలు చోటు చేసుకొన్నాయి. ప్రపంచకప్ స్టార్లు దీప్తి శర్మను యూపీ వారియర్స్, లారా వోల్వార్ట్‌ను గుజరాత్ జెయింట్స్ వదిలేయగా.. ముంబై ఆల్‌రౌండర్ నాట్ స్కివర్ బ్రంట్, బెంగళూరు కెప్టెన్ స్మృతి మంధాన, గుజరాత్ జెయింట్స్ ఆల్‌రౌండర్ ఆష్లే గార్డ్‌నర్‌ను గరిష్ఠ ధర రూ. 3.5 కోట్లకు ఆయా ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకున్నాయి. రిటైన్ జాబితాను డబ్ల్యూపీఎల్ గురువారం విడుదల చేసింది. ముంబై తన తొలి ప్రాధాన్యతగా ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ స్కివర్ బ్రంట్‌ను ఎంచుకోగా.. కెప్టెన్ హర్మన్‌ను రెండో ప్రాధాన్యతగా పేర్కొంది. కెప్టెన్ మెగ్ లానింగ్, శ్రీచరణి, అరుంధతిని ఢిల్లీ వదిలేసింది. డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఐదుగురు చొప్పున ప్లేయర్లను రిటైన్ చేసుకొన్నాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు నలుగురిని, గుజరాత్ జెయింట్స్ ఇద్దరిని అట్టిపెట్టుకోగా.. యూపీ వారియర్స్ కేవలం అన్‌క్యాప్డ్ శ్వేత షెహ్రావత్‌ను మాత్రమే రూ. 50 లక్షలకు రిటైన్ చేసుకొంది.



www.andhrajyothy.com
గుంటూరు సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శుక్రవారం | 7-11-2025
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సురేశ్ రైనా, ధవన్‌ల ఆస్తులు జప్తు

ఇద్దరి ఆస్తుల విలువ రూ.11.14 కోట్లు

రైనా మ్యూచువల్ ఫండ్స్ రూ.6.64 కోట్లు

శిఖర్ ధవన్ స్థిరాస్తులు రూ.4.50 కోట్లు

బెట్టింగ్ సైట్ ప్రమోషన్ కేసులో ఈడీ చర్య

10



మద్యం అమ్మకాలు డౌన్

బెల్టు షాపులపై ఉక్కుపాదం

లైసెన్సీ దుకాణాలకే విక్రయాలు పరిమితం

అక్టోబరులో తగ్గిన మద్యం విక్రయాలు

సెప్టెంబరు కన్నా రూ.99 కోట్లు తక్కువ

గతేడాది అక్టోబరుతో పోలిస్తే

ఏకంగా 430 కోట్లు తగ్గిన అమ్మకాలు

కొన్ని జిల్లాల్లో 25 శాతం పైగా తగ్గుదల

నాటుసారా, నాన్‌డ్యూటీ, మత్తుపదార్థాలు

ఏమైనా ఉన్నాయేమోననే అనుమానాలు

"మద్యం విక్రయాలు భారీగా తగ్గాయి. బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపుతుండటంతో... అమ్మకాలు అధికారిక దుకాణాలకే పరిమితమయ్యాయి. విక్రయాలు తగ్గడానికి ఇదే కారణమని భావిస్తున్నారు. అయితే... ఐదు జిల్లాల్లో ఏకంగా 25 శాతం పడిపోయాయి. దీనికి కారణాలపై ఎక్సైజ్ శాఖలో విశ్లేషణ జరుగుతోంది."

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

పెరగడమే తప్ప తగ్గడం తెలియని మద్యం విక్రయాలు ఈసారి భారీగా తగ్గాయి. ఈ ఏడాది సెప్టెంబరులో రూ. 2,517 కోట్ల మద్యం విక్రయాలు జరగగా... అక్టోబరులో 2,418 కోట్లకు పరిమితమయ్యాయి. అంటే, రూ.99 కోట్ల మేర అమ్మకాలు తగ్గాయి. బెల్టు షాపులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. అనధికారికంగా ఎక్కడ మద్యం విక్రయిస్తున్నా నిఘా పెట్టి చర్యలు తీసుకుంటోంది. విక్రయాలు తగ్గడానికి కారణం ఇదే అని భావిస్తున్నారు. ఇక... గత ఏడాది అక్టోబరుతో పోల్చితే, ఈసారిఏకంగా రూ. 430 కోట్లు తగ్గడం గమనార్హం. కాగా గతేడాది అక్టోబరులోనే నూతన మద్యం షాపుల

మిగతా 12వ పేజీలో...

అన్నీ నేనే చేశా!

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది నేనే

కరోనాలోనూ 17 మెడికల్ కాలేజీలు తెచ్చా

గూగుల్ డేటా సెంటర్ నేనే తెచ్చా

భోగాపురం ఎయిర్‌పోర్టు నావల్లే

వైసీపీ విద్యార్థి విభాగం భేటీలో జగన్

11





డేటా ఆధారిత పాలనపై నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు అనగాని, లోకేశ్, అనిత, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్

1 విజన్ 1 డైరెక్షన్

"ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకోకుండా మౌన ప్రేక్షకుడిలా మిగిలితే సమాజానికి అన్యాయం చేస్తున్నట్లే!"
- సీఎం చంద్రబాబు

ఇదే ప్రభుత్వ విధానం: చంద్రబాబు

ప్రతి నియోజకవర్గానికీ విజన్ ప్లాన్

సచివాలయాలు విజన్ యూనిట్లుగా పనిచేయాలి

వీటిని మరింత సమర్థంగా వినియోగించాలి

ఆన్‌లైన్, వాట్సాప్ సేవలు విస్తృతం కావాలి

ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరిగే బాధ తప్పించాలి

ఫైల్ క్లియరెన్స్‌లో జాప్యం చేయవద్దు

సుపరిపాలన అందిద్దాం.. శాఖలకు రేటింగ్ ఇస్తాం

మంత్రుల పనితీరు మెరుగుపడాలి

అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

'డేటా ఆధారిత పాలన'పై సదస్సులో సీఎం నిర్దేశం

"మనం ఉపయోగించుకున్నంతగా టెక్నాలజీని ఏ రాష్ట్రమూ ఉపయోగించడం లేదు. సింగిల్ టీమ్, సింగిల్ థీమ్, సింగిల్ అప్రోచ్‌తో పనిచేద్దాం. యంత్రాంగం ఎలాంటి రాజీ లేకుండా పనిచేయాలి. అంతా బాధ్యతగా పని చేయాల్సిందే. నిర్లక్ష్యానికి, అలసత్వానికి అవకాశమివ్వొద్దు."
- సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'వన్ విజన్- వన్ డైరెక్షన్' అనేదే రాష్ట్ర ప్రభుత్వ విధానమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక నుంచి గ్రామ/వార్డు సచివాలయాలు విజన్ యూనిట్లుగా పని చేయాలని నిర్దేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో 'డేటా ఆధారిత పాలన'పై సదస్సు జరిగింది. దీనికి మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులు హాజరవగా.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. డేటా ఆధారంగా పాలన ఏ విధంగా చేపట్టాలి.. సత్వర నిర్ణయాలు ఏ విధంగా తీసుకోవాలి.. డేటా ఆధారిత గవర్నెన్స్ ద్వారా ప్రజలకు ఎలా మెరుగైన సేవలు అందించవచ్చనే అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఏ హోదాలో

మిగతా 12వ పేజీలో...



ఇదేం పిచ్చి?

దేవుడా మనం ఎలాంటి ప్రపంచంలో బతుకుతున్నాం!

10

హరియాణాలో 22 ఓటర్ ఐడీల్లో తన ఫొటో వాడడంపై బ్రెజిల్ మోడల్ స్పందన

రాహుల్ ప్రెస్‌మీట్‌లో ప్రస్తావించడంతో ఆమె ఆచూకీ కోసం తెగ వెతికిన నెటిజన్లు



పట్నాలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల బారులు

తొలి దశలో 64.66% ఓటింగ్

బిహార్ చరిత్రలో తొలిసారి భారీ పోలింగ్

10

18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో ఓటు హక్కు వినియోగించుకున్న 3.75 కోట్ల మంది

షుగర్ పరీక్ష ఇంకా సులువు!

కొత్త పరికరాన్ని రూపొందించి, పేటెంట్ పొందిన ఐఐటీ మద్రాస్ శాస్త్రవేత్తలు

10

కన్నీటి సుడి.. గండి



7


చెరువు నీరు ముంచెత్తడంతో కొట్టుకుపోతున్న పశువులు

55 పశువులు మృతి, మరో 800 గల్లంతు

కూలిన మూడు ఇళ్లు, 90 విద్యుత్ స్తంభాలు

నీటిలో కొట్టుకుపోయిన సామాన్లు, వాహనాలు

తిరుపతి జిల్లా కలత్తూరు దళితవాడలో విధ్వంసం



అదానీకి బ్రేకులు!

న్యాయచిక్కుల్లో బీచ్‌శాండ్ కాంట్రాక్ట్

డెవలపర్‌గా అల్లూవియల్ హెవీ మినరల్స్.. అదానీ కంపెనీకి 90% వాటా

చట్టంలో 'డెవలపర్' లేదన్న వాదన తెరపైకి.. ప్రస్తుతం హైకోర్టులో కేసు విచారణ

ఎండీసీకి 10 శాతం వాటాపైనే కాంట్రాక్టు భవితవ్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బీచ్‌శాండ్ మైనింగ్ వ్యవహారం మరోసారి న్యాయచిక్కుల్లో పడింది. టెండర్ వ్యవహారం నిలిచిపోయింది. అదానీ గ్రూప్‌నకు చెందిన అల్లూవియల్ హెవీ మినరల్స్, ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)ల మధ్య ఒప్పందం కుదిరినా అది ముందుకు సాగలేని పరిస్థితి నెలకొంది. కేంద్ర మైనింగ్ చట్టం, మార్గదర్శకాలకు విరుద్ధంగా డెవలపర్ అనే పాత్రను తెరపైకి తెచ్చి అదానీ గ్రూప్‌నకు లబ్ధి చేకూర్చేందుకు టెండర్ కట్టబెట్టారని, వెంటనే ఈ టెండర్‌ను రద్దు చేయాలని గత నెలలో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. బీచ్‌శాండ్ ప్రాజెక్టులో డెవలపర్‌గా ఉన్న అదానీ గ్రూప్ కంపెనీకి 90 శాతం, లీజుదారు అయిన ఏపీఎండీసీకి 10 శాతం వాటాను ఖరారు చేయడం పట్ల న్యాయచిక్కులు ఉత్పన్నమయ్యాయి. వాటాలపై ఇంకా అగ్రిమెంట్ కాలేదని సర్కారు ఓవైపు హైకోర్టుకు నివేదించింది. కానీ ఇటీవల ప్రభుత్వ స్థాయిలో

మిగతా 12వ పేజీలో...

నీచ పోస్టుల భాస్కర్‌రెడ్డికి సంకెళ్లు



సీఎం సతీమణి సహా పలువురిపై బూతు పోస్టులు

తండ్రి చనిపోవడంతో లండన్ నుంచి రాక.. అంత్యక్రియలు పూర్తి

11

చెకప్ కోసం విజయవాడ కామినేని ఆసుపత్రికి రాక

అదుపులోకి తీసుకున్న పోలీసులు

న్యూయార్క్ ప్రజలు ఫ్లోరిడాకు పారిపోవాల్సిందే!



డెమొక్రాట్లు ఓ కమ్యూనిస్టును కూర్చోబెట్టారు

అమెరికాను క్యూబా, వెనిజువెలా మార్గాలని యత్నం

న్యూయార్క్‌లో ఆర్థిక, సామాజిక విపత్తు తప్పదు

కమ్యూనిజమా, కామన్‌సెన్సా? ఏది కావాలో తేల్చుకోవాలి

మమ్దానీ చాలా ఆగ్రహంగా ప్రసంగించారు

10

నా పట్ల మర్యాదగా ఉంటే మంచిది: ట్రంప్ హెచ్చరిక



కేంద్రంపై మళ్లీ సీజేఐ ఆగ్రహం



నేటి విచారణ వాయిదా వేయండి

ఏజీ తరఫున ఏఎస్‌జీ అభ్యర్థన


కుదరదన్న సీజేఐ జస్టిస్ గవాయ్

'ట్రైబ్యునళ్ల సంస్కరణల' కేసులో తుది వాదనలు వింటాం

సోమవారం ఏజీ రాకపోతే కేసును ముగిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 6: ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను వాయిదా వేయాలన్న కేంద్ర ప్రభుత్వ అభ్యర్థనపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది అసమంజసమని, ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఒకవేళ ఈ నెల 24 తర్వాత కేసు విచారణ కోరుకుంటున్నారా? అని నిలదీసింది. ఈ నెల 3న

మిగతా 10వ పేజీలో...



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ


'ఆమె ఎవరు?'

సుప్రసిద్ధ బాలీవుడ్ మిస్టరీ థ్రిల్లర్ చిత్రం 'వో కౌన్ థీ?' తరహాలో, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ బుధవారం ఒక మహిళ చిత్రాన్ని చూపిస్తూ, ఎన్నికల సంఘాన్ని 'యే కౌన్ హై?' అని ప్రశ్నించారు. హర్యానాలో పాతికలక్షల దొంగ ఓట్లు ఉన్నాయన్న తన ఆరోపణలకు నిలువెత్తు నిదర్శనంగా ఆయన ఈ మహిళ చిత్రాన్ని ప్రయోగించారు. హర్యానా ఓటర్ల సంఖ్య రెండుకోట్లు కనుక, అందులో పాతికలక్షలు, అంటే, పన్నెండున్నర శాతం నకిలీ, చెల్లని, బల్క్ ఓట్ల ద్వారా బీజేపీ అడ్డదారిలో అధికారాన్ని చేజిక్కించుకుందని రాహుల్ ఆరోపణ. ఎన్నికల సంఘాన్నీ, భారతీయ జనతాపార్టీనీ ఒకేగాటన కడుతూ, చేయిచేయీ కలిపి ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్నాయంటూ రాహుల్ చేస్తున్న ఓట్‌చోరీ యుద్ధం ఈ తాజా ఆరోపణలతో తీవ్ర స్థాయికి చేరింది.

బిహార్ తొలివిడత పోలింగ్‌కు ముందురోజున, గత ఏడాది తాము బీజేపీ చేతిలో ఓడిన హర్యానా రాష్ట్రాన్ని రాహుల్ తెరమీదకు తెచ్చారు. గత ఏడాది హర్యానాలో తాము ఎలా మోసపోయిందీ తెలియచెప్పి, బిహారీలను హెచ్చరించడం రాహుల్ ఉద్దేశం కావచ్చు. కర్ణాటకలో అలంద్, మహదేవ్‌పుర అసెంబ్లీ స్థానాల్లోనూ దొంగఓట్ల సృష్టి జరిగిందని ఇటీవల ఆరోపించిన ఆయన, ఇప్పుడు కట్టలకొద్దీ కాగితాలను, వందలాది స్లైడ్లనూ ప్రదర్శిస్తూ, హర్యానాలో ప్రతీ ఎనిమిది మంది ఓటర్లలో ఒకరు నకిలీ అని విస్పష్టంగా చెబుతున్నారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ హర్యానాలో కాంగ్రెస్ ఘనవిజయాన్ని సూచించిన సంగతినీ ఆయన గుర్తుచేశారు. 'ఆమె ఎవరు?' అన్న ఆ ప్రశ్న రాహుల్ ఆరోపణలకు ఎంతో బలం చేకూర్చింది. హర్యానాలో 22చోట్ల ఓటువేసిందీ మహిళ అంటూ బ్రెజిలియన్ మోడల్ లారీసా నేరి ఫోటో చూపించారాయన. ఎనిమిదేళ్ళ క్రితం ఫోటోను ఇంటర్నెట్‌నుంచి తీసి, ఆ ఒక్క చిత్రంతోనే పలు చిత్రాలు చేశారు. స్వీటీ, సరస్వతి, రష్మి, విమల, సీమ ఇత్యాది పేర్లు, వేర్వేరు వయసులతో నకిలీ ఓట్లను సృష్టించారు. ఈ తరహా ఫేక్ ఫోటోలతో లక్షకుపైగా ఓట్లు తయారుచేశారని, తప్పుడు చిరునామాలతో మరో లక్ష ఓట్లున్నాయని, రెండు బూత్‌లతో రెండు వందలకుపైగా ఓట్లు ఒకే ఫోటోతో ఉన్న ఘటనలు సైతం అనేకం అంటున్నారు ఆయన. డూప్లికేట్ ఓటర్లను గుర్తించే సాఫ్ట్‌వేర్ తన దగ్గర ఉన్నా ఈసీ దానిని బీజేపీ కోసం వాడలేదన్న విమర్శ ఘాటైనది. బీజేపీ పాలిత యూపీలో ఓటువేసిన ఆ పార్టీ కార్యకర్తలు వేలాది మంది హర్యానాలోనూ వేశారనీ, గత ఏడాది అక్టోబర్ ఎన్నికలకు ముందు పెద్దసంఖ్యలో ఈ రాష్ట్రంలో ఓటర్లను చేర్చడమే కాక, ముప్పై ఐదులక్షల ఓట్లను ఆఖరునిముషంలో తొలగించారన్నది పెద్ద ఆరోపణ. 'మా వాళ్ళు ఎంతో ముందుగా పోలింగ్ జరగబోయే రాష్ట్రంలో స్థిరపడి, ఓటర్ జాబితాలో చేరిపోవడం అన్నిచోట్లా జరుగుతోంది' అంటూ కేరళ బీజేపీ ఉపాధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను రాహుల్ ప్రదర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సాయంత్రం ఐదుగంటల తరువాత, క్యూలో మిగిలిపోయిన ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, పోలింగ్ మట్టుకు ఆఖరునిముషంలో అత్యధికంగా జరిగిందని రాహుల్ గతంలో ఆరోపిస్తూ, ఎన్నికల సంఘం నుంచి డిజిటల్ రికార్డులు, బూత్‌స్థాయి సీసీటీవీ వీడియోలు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. తన అభ్యర్థనను కాదనడమే కాక, పోలింగ్ జరిగిన నలభై ఐదురోజుల్లో వీడియోలు ధ్వంసం చేయాలని ఈసీ నిర్ణయించడం తన తప్పులు కప్పిపుచ్చుకోవడానికేనని రాహుల్ ఆరోపణ.

ఒక భారీ విదేశీ కుట్రలో పావుగా మారి, దేశం పరువు ప్రతిష్ఠలను దిగజార్చే లక్ష్యంతో రాహుల్ ఈ ఆరోపణలు చేస్తున్నారనీ, బిహార్‌లో ఓటమి ఖాయమని తెలిసిపోవడంతో హర్యానాను ముందుకు తెచ్చారంటూ బీజేపీ విమర్శలు చేస్తోంది. ఎన్నికల సంఘాన్ని వేలెత్తి చూపవద్దంటోంది. కానీ, రాహుల్ విమర్శలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం మీద ఉంది. ఓటర్ల జాబితా మీద ఒక్క అప్పీలు కూడా దాఖలు కాలేదని ఈసీ ఈ విమర్శలను తేలికగా తీసి పారేస్తోంది కానీ, హర్యానా ఓటర్ జాబితాలో తప్పిదాలు డూప్లికేట్ ఓట్లకు పరిమితం కాలేదనీ, అవి పొరపాట్ల స్థాయిని దాటి జరిగాయని సంఘం గుర్తించాలి. అప్పుడే ఎందుకు చెప్పలేదు, ఫిర్యాదు చేయలేదన్న ప్రశ్నలు సబబుగా కనిపిస్తున్నప్పటికీ, అప్పీలు చేయలేదనో, అడగలేదనో వదిలివేయగలిగే చిన్నచిన్న తప్పులేమీ కావు ఇవి.

నితీశ్‌ను కాదనలేని బీజేపీ





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

'బిహార్‌కి మజ్‌బూరి హై, నితీశ్‌కుమార్ జరూరి హై' (బిహార్ నిస్సహాయంగా ఉన్నది, నితీశ్‌కుమార్ నాయకత్వం అవసరం)... ఈ ఆకర్షణీయ నినాదాన్ని నేను మొట్టమొదట 2017లో భారతీయ జనతా పార్టీ కార్యాలయం వెలుపల విన్నాను. అనూహ్యంగా విన్న ఉద్ఘోష అది. లాలూప్రసాద్ యాదవ్‌తో ఉన్న రాజకీయ అనుబంధాన్ని తెగతెంపులు చేసుకుని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీలో మళ్లీ చేరేందుకు నితీశ్ నిర్ణయించుకున్న సందర్భమది. బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగేందుకే నితీశ్ పార్టీ మారారని మరి చెప్పనవసరం లేదు. మోదీతో ఉన్న పాతస్నేహాన్ని మళ్లీ చిగురింపచేసుకునేందుకే ఆయన ఆ నిర్ణయం తీసుకోలేదు. రాజకీయ సౌలభ్యం కోసమే ఆయన మళ్లీ మోదీతో చేయి కలిపారు. ఇది జరిగి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఆ పరిస్థితిలో మార్పు ఏమీ లేదు. సరే బీజేపీకి నితీశ్‌బాబు పట్ల ప్రత్యేక ప్రేమ ఏమీ లేదు. 2013లో ప్రధానమంత్రి పదవికి అవసరమైన అర్హతలు నరేంద్ర మోదీకి లేనేలేవని తొట్టతొలుత నిరసన తెలిపిన నేత నితీశ్‌కుమార్. ఈ విషయాన్ని బీజేపీ మరచిపోయి ఉండదు. అయితే బిహార్‌లో ఎన్డీఏకు సమర్థంగా నేతృత్వం వహించగల నాయకుడు మరొకరు లేరన్న వాస్తవమూ బీజేపీకి బాగా తెలుసు. నితీశ్‌కు ప్రత్యామ్నాయంగా మరెవ్వరూ లేనందునే బీజేపీ ఆయనను ముఖ్యమంత్రిగా కొనసాగనిస్తోంది. వృద్ధాప్యం పైబడిన నేత నితీశ్. వయసు పొద్దు వాలిపోయిన వేళ ఆరోగ్యం సైతం ఆయనకు దూరంగా ఉంటోంది. ఇటువంటి పరిస్థితుల్లో మోదీయే సర్వం అయిన ఢిల్లీ దర్బార్‌కు విధేయుడుగా ఉండడమే మేలు అని నితీశ్ నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయంతో ఆయన నిశ్చింతగా ఉన్నారు.

బిహార్ రాజకీయాలలో షేక్స్పియర్ విషాద నాటకం తరహాలో ఒక నాటకం సుదీర్ఘకాలంగా ప్రదర్శితమవుతోంది. మండల్ ఉద్యమంతో ఈ విషాద ప్రహసనం ప్రారంభమయింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు ఆ సుదీర్ఘ నాటకంలో చివరి అంకంగా చెప్పవచ్చు. మూడున్నర దశాబ్దాల క్రితం మండల్ ఉద్యమంతో ప్రభవించిన నాయకద్వయం లాలూప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్. 'బ్రదర్స్ బిహారీ'గా సుప్రసిద్ధమయ్యారు. అయితే పరస్పరం పూర్తిగా భిన్నమైనవారు. తొలి జనప్రియ నాయకుడుగా అధికార అందలాలు ఎక్కిన లాలూ ప్రసాద్ యాదవ్ ఇప్పుడు శారీరకంగా బలహీనుడు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేకపోతున్న అనారోగ్య గ్రస్తుడు. పార్టీ బాధ్యతలను పూర్తిగా కుమారుడు తేజస్వి యాదవ్‌కు అప్పగించారు. తేజస్వి నవతరం నాయకుడు. అయితే తండ్రిలో ఉన్న జన సమ్మోహన శక్తి ఈ యువనేతలో కానరాదు. 1970 దశకంలో జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో జరిగిన విద్యార్థి యువజన ఉద్యమం నుంచి ప్రభవించిన నాగరీక నాయకుడు నితీశ్‌కుమార్. ఈయనా ఇప్పుడు వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. శరీరాని కంటే మానసిక సామర్థ్యాలను కుంగదీస్తున్న అనారోగ్యమది. భారతీయ జనతా పార్టీకి నరేంద్ర మోదీయే సర్వోన్నత నాయకుడు. మోదీ మాటే తుది మాట. అయితే సమస్త బిహార్ ప్రజలను సమరీతిలో ఆకట్టుకోగల సమర్థ నాయకత్వం బిహార్‌లో బీజేపీకి లేదు. భారత జాతీయ కాంగ్రెస్ శక్తియుక్తులను కాలం హరించివేసింది. ఇప్పుడు ఈ పార్టీ దాదాపు అచేతన స్థితిలో ఉన్నది. ఇక యువ నాయకుడు ప్రశాంత్ కిశోర్ బిహారీలను విశేషంగా ఆకట్టుకుంటున్నారు, సందేహం లేదు. అయితే కులమే నిర్ణయాత్మక అంశంగా ఉన్న బిహార్ రాజకీయాలలో ఈ యువనేత జయపతాక ఎగురవేయగలడా? సంప్రదాయ అధికార నిర్మాణాలు, సామాజిక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఈ కొత్త నేత బిహార్ సమాజంలో మౌలిక మార్పులు తీసుకువస్తానని వాగ్దానం చేస్తున్నారు. బిహార్ ఓటర్లలో అత్యధికులు సైతం మౌలిక మార్పులు కోరుకుంటున్నారు. మరి ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలోని జన్ సురాజ్ పార్టీకి వారు ఓటు వేస్తారా?

ఇప్పుడు మళ్లీ నితీశ్‌కుమార్ విషయానికి వద్దాం. బిహార్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయడంలో నితీశ్ రికార్డు సృష్టించారు. ఇప్పటికి మొత్తం తొమ్మిదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. రాజకీయ అథ్లెటిక్స్‌లో ఒలింపిక్ స్వర్ణపతకాన్ని అందుకోవడానికి ఆయన అందరికంటే బాగా ముందంజలో ఉన్నారు మరి. అనేక పరిమితులు ఉన్నప్పటికీ బిహార్‌కు ఆయన నాయకత్వం తప్పనిసరి అని పలువురు, ముఖ్యంగా బీజేపీ భావిస్తోంది. ఐదు సంవత్సరాల క్రితం కొత్త తరం బిహారీ రాజకీయ నాయకుడు చిరాగ్ పాశ్వాన్‌ను ప్రోత్సహించడం ద్వారా నితీశ్ స్థాయిని తగ్గించేందుకు బీజేపీ ప్రయత్నించింది నితీశ్ ప్రాధాన్యాన్ని తగ్గించడం ద్వారా జనతాదళ్ (యునైటెడ్) పార్టీ ఓటర్లను తనవైపు తిప్పుకోవాలన్నది బీజేపీ ఎత్తుగడ. ఈ వ్యూహం దాదాపుగా ఫలించింది. గత శాసనసభ ఎన్నికల్లో జనతాదళ్(యు) కేవలం 43 సీట్లు మాత్రమే కైవసం చేసుకోగా బీజేపీ 74 నియోజకవర్గాలలో జయపతాక నెగురవేసింది. బీజేపీ, జనతాదళ్(యు) మధ్య అధికార సమతౌల్యత జాతీయ రాజకీయ పక్షానికే అనుకూలంగా మారింది. అయినప్పటికీ నితీశ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేందుకు బీజేపీ సంకోచించింది. తమ సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేసేందుకు సుముఖత చూపలేదు. నితీశ్‌కుమార్ అపరచాణక్యుడు. బీజేపీ ఎత్తుగడలను అర్థం చేసుకున్నారు. ఆ పార్టీతో పొత్తును కొనసాగించడం ప్రమాదకరమని భావించారు. మహారాష్ట్రలో శివసేనను నిలువునా చీల్చివేసిన రీతిలో బిహార్‌లో తన పార్టీని బీజేపీ చీల్చకుండా ఉంటుందా అని నితీశ్ ఆలోచించారు. సంభావ్య పర్యవసానాల గురించి భయపడ్డారు. 2022లో బీజేపీతో తెగతెంపులు చేసుకుని ప్రతిపక్ష కూటమి 'ఇండియా'లో చేరారు. అయితే జాతీయ స్థాయిలో అగ్రగామి నాయకుడుగా ఎదగాలన్న తన ఆకాంక్ష నెరవేరేందుకు ఇండియా కూటమి సహకరించదనే భావన ఆయన మనసును తొలిచివేసింది. దీంతో గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఒక శుభ దినాన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో చేరారు. ప్రజా జీవితంలో నైతిక విలువలకు నిబద్ధమైన నేతగా పేరుపొందిన నితీశ్‌కుమార్ ఇప్పుడు తన రాజకీయ మనుగడను కాపాడుకోవడంపైనే దృష్టి పెట్టారు. సైద్ధాంతిక విశ్వాసాల స్థానంలో అవకాశవాద రాజకీయాలు ప్రబలిపోయాయి.

ఒకప్పుడు 'నయా' బిహార్‌కు సగర్వంగా సారథ్యం వహించిన నితీశ్‌కుమార్ ఇప్పుడు బీజేపీ 'చక్రవ్యూహం'లో చిక్కుకున్నారు. పలు ఇతర రాష్ట్రాలలో తమ మిత్రపక్షాలను బీజేపీ శాసిస్తోంది. తన నిర్ణయాలను ఆ పార్టీలపై రుద్దుతోంది. ఆ మిత్రపక్షాల నాయకులను బహిరంగంగా చిన్నబుచ్చుతోంది. అయితే బిహార్‌లో సుదీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా ఉన్న నితీశ్ జోలికి ఏ విధంగానూ పోయేందుకు బీజేపీ సాహసించడంలేదు. బహిరంగంగాను, అంతర్గతంగాను సీనియర్ నాయకుడుగా ఆయన్ని గౌరవిస్తోంది. ఇతర హిందీ రాష్ట్రాలలో వలే బిహార్‌లో విశ్వసనీయమైన వెనుకబడినవర్గాల నాయకత్వాన్ని పెంపొందించుకోవడంలో బీజేపీ బాగా వెనుకబడిపోయింది బిహార్‌లోని బీజేపీ శ్రేణుల్లో పాత కాలం నాటి అగ్రకులాల ఆధిపత్యం ఇప్పటికీ బలీయంగా ఉన్నది. 2015లో బీజేపీ బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో సొంతంగా అన్ని స్థానాలకూ పోటీ చేసింది. మోదీ హవా ఉధృతంగా ఉన్న ఆ కాలంలో కూడా బీజేపీ చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించలేకపోయింది. లాలూ–నితీశ్‌ల సంయుక్త నాయకత్వం బీజేపీ పురోగతిని పూర్తిగా నియంత్రించింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో సొంతంగా మెజారిటీ సాధించలేకపోవడంతో నితీశ్ కుమార్‌ను బీజేపీ ఏమీ చేయలేకపోతోంది. సంకీర్ణ రాజకీయ ధర్మాన్ని అనుసరిస్తోంది. తనకు మద్దతునిచ్చిన ప్రతి పార్టీ పట్ల సానుకూల వైఖరితో వ్యవహరించడాన్ని బీజేపీ అలవరచుకున్నది. 2029 సార్వత్రిక ఎన్నికలకు ఇంకా వ్యవధి ఉన్నప్పటికీ ప్రస్తుత దశలో నితీశ్‌ను తొలగించడం తమ భవిష్యత్తుకు శ్రేయస్కరం కాదని బీజేపీ భావిస్తోంది.

నితీశ్‌కుమార్ ప్రాభవ ప్రభావాలను ఎంతగా తగ్గించినప్పటికీ ఆయన గెలుచుకోగల ఓట్ల వాటా చాలా అత్యధికంగా ఉంటుందన్న వాస్తవాన్ని బీజేపీ అర్థం చేసుకున్నది. పోటీ కూటమి రాజకీయాలు ప్రబలంగా ఉండే బిహార్ లాంటి రాష్ట్రంలో స్వల్పస్థాయి ఓట్ల వాటా సైతం అంతిమ విజయంలో నిర్ణయాత్మక పాత్ర వహిస్తుంది. 2020 అసెంబ్లీ ఎన్నికలలో జనతాదళ్ ఓట్ల వాటా 15 శాతంగా ఉన్నది. నితీశ్ మళ్లీ అధికారానికి రావడానికి ఇది విశేషంగా తోడ్పడింది. 2005 నుంచి ప్రతి ఎన్నికల్లోను రెండు వర్గాలు నితీశ్‌కు పూర్తి మద్దతునిస్తున్నాయి. మహిళలు, బాగా వెనుకబడిన కులాలవారు నితీశ్‌కు ఎటువంటి మినహాయింపు లేని మద్దతునిస్తున్నారు. మహిళా ఓటర్ల శక్తిని జాతీయ రాజకీయ పక్షాలు కనుగొనక ముందే నితీశ్‌కుమార్ మహిళా ఓటర్ల ఆదరాభిమానాలను ఇతోధికంగా చూరగొన్నారు. మృదుభాషి, అంతర్ముఖుడు అయిన నితీశ్ తన ప్రత్యర్థిగా మారిన స్నేహితుడు, పల్లెటూరి మనిషిలా వ్యవహరించే లాలూప్రసాద్‌కు పూర్తిగా భిన్నమైన వ్యక్తి. ఈ కారణంగానే మహిళా ఓటర్లను నితీశ్ ఆకట్టుకున్నారు. అచంచలమైన కుల సంబంధిత విధేయతలతో పాటు మహిళా ఓటర్ల మద్దతు నితీశ్ విజయాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి 2005లో నితీశ్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చదువుకుంటున్న బాలికలు అందరికీ ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. ఆనాడు లబ్ధి పొందిన బాలికలు ఇప్పుడు వయోజన ఓటర్లుగా ఉన్నారు. ఆ మహిళా ఓటర్లే నితీశ్ నాయకత్వానికి, అధికార ప్రాభవానికి వెన్నుదన్నుగా ఉన్నారనడం సత్యదూరం కాదు.

ఈ కారణంగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నితీశ్‌ను తన పక్షాన ఉంచుకునేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. తనను వ్యతిరేకించిన వారిని క్షమించే అలవాటు లేని మోదీ, ఒకప్పుడు నితీశ్ తనను తీవ్రంగా వ్యతిరేకించారన్న వాస్తవాన్ని పూర్తిగా విస్మరించారు. బిహార్‌లో బీజేపీ ఎదుగుదలకు నితీశ్‌తో పొత్తు తప్పనిసరి అని ప్రధానమంత్రి గ్రహించారు. అయితే జనతాదళ్(యు)లోకి బీజేపీ శ్రేణులు క్రమంగా చొరబడుతున్న దృష్ట్యా సమీప భవిష్యత్తులో బిహార్‌లో కూడా ఏక్‌నాథ్ షిండే లాంటి తిరుగుబాటు సంభవించే అవకాశం లేకపోలేదు. అయినా ప్రస్తుతానికి మాత్రం బీజేపీ ఎన్నికల విజయాలకు నితీశ్‌కుమార్ ఆవశ్యకత అమితంగా ఉన్నది. ఆయనను 'మార్గదర్శక్' విశ్రాంత జీవితంలోకి పంపే యోచన బీజేపీ చేయబోదనే చెప్పవచ్చు.

> మహిళా ఓటర్లు మాత్రమే కాకుండా బాగా వెనుకబడిన కులాల వారూ నితీశ్‌కుమార్‌కే పూర్తి మద్దతునిస్తున్నారు. బిహార్‌లో పార్టీ ఎదుగుదలకు, ఎన్నికల విజయాలకు నితీశ్‌ను తమ పక్షాన నిలుపుకోవలసిన ఆవశ్యకత అమితంగా ఉన్నందునే ఆయనను 'మార్గదర్శక్' విశ్రాంత జీవితంలోకి పంపే యోచన బీజేపీ చేయదు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

కోరి తెచ్చుకున్న చావులా ఇవి?

ఈ దేశంలో అనేకచోట్ల, అనేక సందర్భాల్లో జరిగే తొక్కిసలాటల్లో కేవలం పేదలే మరణిస్తున్నారు. ఆ తొక్కిసలాటలు కూడా పేదల మానసిక ఆవరణ చుట్టూ ఉన్న దారిద్ర్యం, అభద్రత, అజ్ఞానం, అసహాయత, ఉపాధి లేమి వంటి కారణాలే కాక, 'పక్కవాడిని తొక్కేసయినా దక్కించుకోవటమే విజయానికి మెట్లు' అన్న భావనలు పెంచి, పోషించే వ్యవస్థలూ దొంతర్లుగా పేరుకుపోయినందునే ఇవి జరుగుతున్నాయి. 'పుట్టినవాడు గిట్టకమాన'దన్న గీతాచార్యుడూ గిట్టక తప్పలేదు. కాకపోతే చావును కోరితెచ్చుకోరెవ్వరూ. యే ఉద్దేశంతో రాసేడోగానీ 'చావు కూడా పెళ్లిలాంటిదే' అని ఓ సినిమా కవి రాసేడు. చాలా చావులు పెళ్లిలాంటివి కానేకావు, చచ్చేచావులే. ఏ ధర్మాత్ముడో విసిరే చిల్లర నాణేలకోసం ఎగబడి, ఎగ ఊపిరొదిలిన చావులు, ఏ స్వాములోరి పాదధూళి కోసమో, పోటీపడి చచ్చే చావులు, ఏ అభిమాన నటుడి సినిమా కోసమో కొనప్రాణం కొట్టుకుచచ్చిన చావులు. ఆలయ ప్రహరీలు విరిగిపడి ఒరిగిన చావులు, పుణ్యస్నానాల చావులు, పుష్కరాల చావులు... కోరి తెచ్చుకున్న చావులా ఇవి? భవంతుల నిర్మాణంలో కూలిన బతుకుల చావులు, నెత్తుటితో తడిసే రోడ్ల మీది చావులు, రోగాల, రొప్పుల చావులు, ఆసుపత్రి చావులు, ఆఖరికి కర్కోటక కారాగారాల దిక్కులేని చావులు... కోరి తెచ్చుకున్న చావులేనా ఇవి? దేశానికిపుడు 'చావులమదుం' అన్న పేరు సరిపోతుంది (విశాఖపట్నంలో ఓ స్థలానికి చావులమదుం అన్న పేరుంది).

నిన్న, మొన్న శ్రీకాకుళం జిల్లా, కాశీబుగ్గలో కొందరు భక్తుల చావు నన్ను కలవరపెడుతోంది. ఒరిస్సా పండా ఎవరో నిర్మించిన వేంకటేశ్వరాలయంలో భక్తుల తొక్కిసలాట జరగటం, పదిమంది దాకా మరణించటం... మనసును కలచివేస్తోంది. దేవాలయంలో కార్తీకమాసంలో తొలి దినాన పూజలు చేస్తే పరలోకంలో సుఖంగా జీవిస్తారన్న ప్రచారం కంటే, ఇహలోకంలో కలిగే ఇబ్బందుల నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి రక్షిస్తాడన్న నమ్మకం జనాల్లో బాగా ఉంది. వాళ్లకి రేపెప్పుడో లేదా మరణానంతరమో కలిగే ప్రయోజనమ్మీద ఏ నమ్మకమూ, ఆశా లేదు. ఉన్నదల్లా ఇప్పుడే, ఇక్కడే ప్రయోజనం కావాలి. అలా నమ్మించగలిగే సామాజిక వాతావరణం నిండి వున్నదిపుడు!

అవసరమైన జాగ్రత్తలు తీసుకోకపోవటమే కాశీబుగ్గ ప్రమాదానికి కారణమా? నేరమెవరిది? ఈ ప్రశ్నలేవో వేసుకోవచ్చు. నేరమెవరిమీదనో నెట్టేయవచ్చు. నిజానికి ఈ దేశంలో బాధితులే నేరస్థులు. జైలు నిర్మాణంలో శ్రమించిన శ్రామికులే జైలుపాలవుతారు గానీ, జైలు నిర్మాణాన్ని చేయించినవారు జైలుపాలు కావడం జరగలేదు. ఇక్కడ కూడా చనిపోయిన వారిమీదనే నేరం నెట్టేయవచ్చు. లేదా ప్రతిపక్ష రాజకీయులమీద తోసేయవచ్చు. ఇంకా మించిపోతే నాస్తికులకు నేరం అంటగట్టవచ్చు. వీటన్నిటి కంటే... నన్ను వేధించేది వేరొకటి. గత, వర్తమానాల విశ్లేషణేదో అవసరమన్పిస్తోంది.



> చాలా చావులు పెళ్లిలాంటివి కానేకావు, చచ్చేచావులే. ఏ ధర్మాత్ముడో విసిరే చిల్లర నాణేలకోసం ఎగబడి, ఎగ ఊపిరొదిలిన చావులు, ఏ స్వాములోరి పాదధూళి కోసమో, పోటీపడి చచ్చే చావులు, ఏ అభిమాన నటుడి సినిమా కోసమో కొనప్రాణం కొట్టుకుచచ్చిన చావులు. నాడు ప్రజలను చైతన్యవంతం చేసిన సుబ్బారావు పాణిగ్రాహి గుర్తొస్తున్నాడిప్పుడు. ఆయన పోరాటమంతా కేవలం కథగానే మిగిలిపోయిందా?!

ఒకానొక ఆలయ పూజారిగా వచ్చి, ఒకానొక ఊరిని, ఊరి పరిసరాలనూ, జిల్లానూ, రాష్ట్రాన్నీ తన అపూర్వకళా ప్రతిభతో ప్రభావితం చేసిన (ఒరియా బ్రాహ్మడయిన) సుబ్బారావు పాణిగ్రాహి గుర్తుకొస్తున్నాడిప్పుడు. జీవితాలను చక్కదిద్దుకోవడం తమ చేతుల్లోనే వుంటుందని, కార్యాచరణను బోధించి, 'చేతులు జోడించి దేవుణ్ణి మొక్కటం కాదు, పిడికిలి బిగించి పోరాడ'మని నేర్పినవాడు పాణిగ్రాహి. ఆ ఊరి ప్రజలు ప్రేమగా 'పూజారిబాపు' అని పాణిగ్రాహిని పిలుచుకునేవారు. ప్రజలను చైతన్యవంతం చేయడం, సంఘటితం చేయడం, జీవితాల ఉన్నతికి ఉద్యమింపచేయడం పూజారిగా పాణిగ్రాహి కార్యకలాపాలు. కొన్నాళ్లకు ఆలయంలోని మూలవిరాట్టులకు బదులుగా మార్క్సిస్టు మూలపురుషుల ఫొటోలను పెట్టడం, ప్రజలను పోరుబాట నడపడం... వీరోచిత ఘటనలు! ఇవి కేవలం కథలుగా మాత్రమే మిగిలాయా? అన్న వేదన. కాశీబుగ్గలో కానీ, కళింగాంధ్రలో కానీ జనాలు చావుతో సాము చేసి బతుకుతారు. భవంతుల నిర్మాణంలోనో, రోడ్ల ప్రమాదాల్లోనో, రోగాల అసుపత్రుల్లోనో అలవిగానపుడు చనిపోయారే తప్పా, చావుతో పోరాడినోళ్లే పోరాటంలో చనిపోయినోళ్లుగావచ్చు. నాడు అశోకుడితో యుద్ధం చేసి కొందరు కళింగులు మరణిస్తే, నేడు కార్పొరేట్ కర్మాగారాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి మరికొందరు మరణించారు. పుణ్యస్నానాల్లోనో, ఆలయ పూజల్లోనో తొక్కిసలాడి చనిపోలేదిలా. సింహాచలంలో కూడా ప్రహరీగోడ కూలి, జనాల మీద పడి చనిపోయేరు తప్పా, తొక్కిసలాటలో కాదు. ఇంతటి మూఢభక్తి కళింగ జనాల్లో కూడా నిండివుందా? కేవలం మూఢభక్తి అని నిర్ధారిద్దామా? ఆ జనాల జీవన సంక్షోభ స్థితికి వారు వెదుకుతున్న ఊరట మార్గమేమోనని ఆలోచిద్దామా? పాణిగ్రాహి గానీ, అతని బాట గానీ జనాల మనసుల్లోంచి మాసిపోయిందనుకుందామా? ఏ భూమిని యే కర్మాగారం నొల్లేస్తాదో, యే ఇంటిని యే ఎనిమిదో, తొమ్మిదో లైన్ల రోడ్డు మింగేస్తదో, యే ఊరిని యే విమానాశ్రయం ఆక్రమించేస్తాదో, యే అడవిని, కొండని, సముద్రాన్ని... సమస్తాన్ని ఏ శక్తులు చప్పరించేస్తాయో..! నిత్యగండాల సుడిగుండంలా వుందికదా కళింగం? ఓట్లేసి, గెలిపించిన నేతలంతా సామంతరాజులే తప్పా, చక్రవర్తుల (కార్పొరేట్ల) ఆజ్ఞల పాలన తప్పా, ప్రజల ఆలనా పాలనా చూడకపోవటం, శత్రువే శ్రేయోభిలాషిగా నటించడం, అక్కరకు రాని కంపెనీల రాక, అక్కరకొచ్చే ఫ్యాక్టరీల మూత, ప్రమాదాల పరవాడలు... కళింగాంధ్రను కలవరపరుస్తున్నవేమో? కలవరంలో 'పరమాత్ముడొకడు కలడో, లేడో'నన్న ప్రశ్నకు జవాబు వెదుకులాట ఈ చావులనుకుందామా? అన్నీ ప్రశ్నలే! ప్రశ్న భూమి కళింగాంధ్ర ప్రశ్న కావడమే చిత్రం!

• అట్టాడ అప్పల్నాయుడు
ఉత్తరాంధ్ర రచయితల, కళాకారుల వేదిక (ఉరకవే) అధ్యక్షులు

స్వాతంత్ర్యోద్యమ మహామంత్రం

వందేమాతరం గీతం విరచితమై 150 సంవత్సరాలు పూర్తయిన శుభ సందర్భంగా 2025 నవంబర్ 7 నుంచి సంవత్సరం పాటు ఉత్సవాలు జరుపుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సంకల్పాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అక్టోబర్ నెల 'మన్ కీ బాత్'లో పునరుద్ఘాటించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో పాటు పలు ఇతర సంస్థలూ 'వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవం'ను జరుపుకుంటున్నాయి.


జూన్ 23, 1757న బెంగాల్‌లోని ప్లాసీ మైదానంలో నవాబ్ సిరాజ్–ఉద్–దౌలా, లార్డ్ క్లైవ్‌ల మధ్య జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారి చేతిలో భారత్ ఓటమి చవిచూసింది. ఆ విధంగా భారత స్వాతంత్ర్య సూర్యుడు అస్తమించాడు. ఈ పరాజయం అనంతరం దేశంలోని మిగిలిన ప్రాంతాలు కూడా బ్రిటిష్ వారి వశమైపోయాయి. ఆంగ్లేయుల అకృత్యాలను చూసి, సాహిత్యం ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలని బెంగాల్ ప్రాజ్ఞుడు బంకించంద్ర ఛటర్జీ (1838–1894) సంకల్పించి, అనేక వ్యాసాలు, నవలలు రచించారు. వీటిలో శ్రీకృష్ణ చరిత్ర, దుర్గేశ్ నందిని, రాజసింహ, చంద్రశేఖర్ వంటి కావ్యాలు ప్రఖ్యాతిగాంచాయి. సన్యాసుల తిరుగుబాటు నేపథ్యంగా ప్రసిద్ధి చెందిన రచన 'ఆనందమఠం' వాటిలో ఒకటి. ఈ నవలలోనే జాతీయ గీతం వందేమాతరం ఆవిర్భవించింది. భారతమాతను ప్రస్తుతిస్తూ సన్యాసులు పాడుకున్న గీతమే వందేమాతరం.

1875 నవంబర్ 7న భారతీయ కాలగణన ప్రకారం, కార్తీకమాసం శుక్ల పక్ష నవమి నాడు వందేమాతరం గీతం విరచితమైంది. ఆ రోజు అక్షయ నవమి కావడం వల్ల జగద్ధాత్రి పూజ కూడా ప్రజలు జరుపుకుంటారు. 1896లో కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ మొదటి సారి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఇది మల్హార్ రాగంలో స్వరపరచబడింది. 1896 తర్వాత, కాంగ్రెస్ సమావేశాలలో వందేమాతరం పాడడం ఒక సంప్రదాయంగా మారింది.

బెంగాల్ నుంచి ఉద్భవించిన స్వాతంత్ర్య ఉద్యమాన్ని విభజించడానికి, అక్టోబర్ 16, 1905న ఆంగ్లేయులు వంగ–భంగ (బెంగాల్ విభజన) పథకాన్ని అమలుచేశారు. బెంగాల్ ప్రభావాన్ని తగ్గించడం, బెంగాలీ విప్లవకారుల ప్రభావాన్ని తగ్గించడం, హిందూ–ముస్లింల మధ్య విభజన సృష్టించడం ఈ వంగ–భంగ పథకం ఉద్దేశ్యాలు. దూరదృష్టి గల నాయకులు విభజనకు ముందే 1905 ఆగస్టు 7న కలకత్తా టౌన్ హాల్లో ఒక సభను ఏర్పాటు చేసారు. ఆ సభకు హాజరైన ప్రతి వ్యక్తీ ఒక్క 'వందేమాతరం' అనే పదాన్ని మాత్రమే నినదించారు. అక్టోబర్ 16న నిర్వహించిన 'నేషనల్ బ్లాక్ డే' సందర్భంగా, ఆనంద్ మోహన్ బసు, సురేంద్రనాథ్ బెనర్జీ నాయకత్వంలో, కలకత్తాలోని సెంట్రల్ మైదాన్‌లో 50వేల మంది ప్రజలు 3.5 కిలోమీటర్ల మేర 'వందేమాతరం' అని నినదిస్తూ, చెప్పులు లేకుండా నడిచారు.

మహాకవి సుబ్రమణ్య భారతి తమిళ భాషలోకి, మహాత్మాగాంధీ గుజరాతీలోకి వందేమాతర గీతాన్ని అనువదించగా తెలుగు, కన్నడ, మలయాళం, ఉర్దూ భాషలలోకి కూడా ఈ గీతం అనువదితమయింది. నాగపూర్‌లోని నీల్ సిటీ పాఠశాల తనిఖీకి వచ్చిన ఆంగ్లేయ అధికారికి సంఘ్ వ్యవస్థాపకుడు డా. హెడ్గేవార్ వందేమాతరంతో స్వాగతం పలికారు. 1947 ఆగస్టు 15న, శ్రీమతి సుచేతా కృపాలాని వందేమాతరం గీతాన్ని ఆలపించారు. సర్దార్ పటేల్ కోరిక మేరకు ఆలిండియా రేడియోలో పూర్తి వందేమాతరాన్ని ప్రసిద్ధ సంగీతకారుడు ఓంకారనాథ్ ఠాకూర్ ఆలపించారు.

○ ఎన్. మధుకర్
బీజేపీ సంస్థాగత కార్యదర్శి, ఏపీ



జాతీయోద్యమ చైతన్య జీవనాడి

> పరాధీన భారత జాతిని స్వాతంత్ర్య సాధనకు జాగృతం చేసిన చైతన్య గీతిక 'వందేమాతరం'. 150 సంవత్సరాలుగా మన సమష్టి జీవనంలో అంతర్భాగంగా ఉన్న ఈ అజరామర గీతాన్ని బెంగాలీ కవి బంకించంద్ర ఛటర్జీ రచించారు.

వందేమాతరం నినాదం లేని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఊహించలేం. ఆనాడు బ్రిటిష్ వారు వెయ్యి ఫిరంగులు ఎత్తి పెడితే మన భారతీయులు వందేమాతరం నినాదంతో 1000 ఫిరంగులకు మించిన భయాన్ని బ్రిటిష్ వారిలో పుట్టించారు. 'వందేమాతరం' అని పసిపిల్లల నుంచి వృద్ధుల దాకా నినదించారు. అంత గొప్ప స్ఫూర్తిని, ఉద్యమకాంక్షను రగిలించిన ఆ శక్తిమంతమైన గీతమే మన జాతీయ గీతం అయినది. నర నరాన దేశభక్తిని నింపిన వందేమాతర గీతంలో భారతదేశ గొప్పతనం తెలుస్తుంది. బ్రిటిష్ వారి మెడలు వంచిన సమరఘోషే వందేమాతరం.

మన జాతీయ గీతం వందేమాతరం. దీన్ని 1875 నవంబరు 7న బంకించంద్ర ఛటర్జీ రాశారు. బ్రిటిష్ కొలువులో.. భారతీయ ఆత్మతో పనిచేసిన ఛటర్జీ (1838–94) బెంగాలీ కవి, వ్యాస రచయిత, సంపాదకుడు. ఆయన రాసిన 'ఆనంద్ మఠ్' అనే నవల నుంచి ఈ అజరామర వందేమాతరం గీతాన్ని సంగ్రహించారు. ఈ గీతం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సమరశంఖంగా పనిచేసింది.

వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని నేడు దేశ ప్రజలంతా జరుపుకుంటున్నారు. నవంబర్ 7న ఒక నిర్ణీత సమయంలో దేశ ప్రజలందరూ ఈ గీతాలాపన చేయాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది.

'ఆనంద్ మఠ్' నవల 1882లో ప్రచురితమైంది. 1884 ఏప్రిల్ 8న బంకించంద్ర ఛటర్జీ మరణించాక, 1896లో రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరకల్పన చేసి జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఆలపించారు. అక్కడి నుంచి వందేమాతరం అందరి నోళ్లలో నినాదంగా మారింది. 1905లో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్‌ను విభజించడంతో ప్రజ్వరిల్లిన ఆందోళన వందేమాతర ఉద్యమంగా పరిణమించింది. ఇది బ్రిటిష్ వారికి శత్రు నినాదంగా మారిపోయింది. భారతదేశ చరిత్రలో వందేమాతర ఉద్యమం ఒక నూతన శకానికి నాంది పలికింది.

బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతర గీతం స్వాతంత్ర్య పోరాటంలో ఉద్యమకారులకు ఎనలేని స్ఫూర్తినిచ్చింది. వందేమాతర ఉద్యమం బెంగాల్‌కు మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తమైంది. మొదట్లో ఈ ఉద్యమం సురేంద్రనాథ్ బెనర్జీ వంటి మితవాదుల నేతృత్వంలో జరిగినా క్రమంగా అతివాద, తీవ్రప్రభావ నాయకత్వానికి మరలింది. ఈ ఉద్యమాన్ని బెంగాల్ నుంచి దేశవ్యాప్తంగా ప్రచారం చేయడంలో బిపిన్ చంద్రపాల్ ప్రముఖ పాత్ర పోషించారు. మద్రాస్, ఆంధ్ర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. బెంగాల్‌లో బిపిల్ చంద్రపాల్, అరవింద ఘోష్; బరిసాల్‌లో అశ్వనీకుమార్; దత్త పంజాబ్, ఉత్తర భారత్‌లలో లాలా లజపతిరాయ్, అజిత్ సింగ్, హన్స్‌రాజ్; పశ్చిమ భారత్ (పూనా, ముంబయి)లో తిలక్, పరంజపే, మద్రాస్‌లలో చిదంబరం పిళ్లై, సుబ్రహ్మణ్య అయ్యర్, ఆనందాచార్యులు, టి.ఎం. నాయర్; ఆంధ్రలో గాడిచర్ల, పట్టాభి, అయ్యదేవర; ఢిల్లీ & జమ్మూలలో సయ్యద్ హైదర్ రాజా; యునైటెడ్ ప్రావిన్స్‌లలో మదన్‌మోహన్ మాలవ్యా, మోతీలాల్ నెహ్రూ; బెనారస్‌లో సుందర్‌లాల్ మొదలైనవారు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఈ దేశభక్తులు అందరూ వందేమాతరంలో స్వాతంత్ర్య కాంక్షను చూశారు కానీ.. మతం కోణం చూడలేదు. ఈ గీతం భారతీయులలో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక, 1950 జనవరి 24న రాజ్యాంగ సభ 'వందేమాతరం' గీతాన్ని 'జనగణమన'తో సమానంగా గౌరవిస్తూ జాతీయ గీతంగా అధికారికంగా స్వీకరించింది. భారత స్వాతంత్రోద్యమంలో వివిధ దశలలో జరిగిన ఉద్యమాలలో సామాన్యులు, స్వాతంత్ర్యోద్యమ కారులు, తెల్లవాళ్ల చేతుల్లో బానిస జీవితాన్ని కొనసాగించిన ప్రతి భారతీయుడి చైతన్యంలో వందేమాతరం జీవనాడి అయింది.

■ నర్సింగు కోటయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, నల్గొండ

(వందేమాతర గీతానికి 150 ఏళ్లు)



నేటి నుంచి బాలల పండుగ
● వీవీఐటీయూ బాలోత్సవ్‌కు సర్వం సిద్ధం
● వేడుకలకు వర్సిటీ ప్రాంగణంలో 32 వేదికలు 6

ఆప్కో వస్త్ర నిల్వలతో నూతన డిజైన్లు
మంగళగిరిలో ఆప్కో గోదాం తనిఖీ చేసిన మంత్రి సవిత


పసుపు ధరలు పైపైకి...
నాలుగు నెలల్లో క్వింటాల్‌కు రూ.4 వేలు పెరుగుదల

అమరావతి ఓఆర్ఆర్‌కు తొలిఅడుగు

భూసేకరణకు ఎన్‌హెచ్‌ఏఐ శ్రీకారం

- పల్నాడు జిల్లాలో రెండు మండలాలకు గెజిట్
- తుది దశలో మిగిలిన 3 జిల్లాల గెజిట్ రూపకల్పన
- మొత్తం 23 మండలాలు.. 97 గ్రామాల్లో భూసేకరణ

అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణానికి సంబంధించి తొలిఅడుగు పడింది. ఓఆర్ఆర్ నిర్మాణంలో అత్యంత కీలకమైన భూసేకరణ ప్రక్రియకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో భూసేకరణను పల్నాడు జిల్లా నుంచి మొదలుపెట్టింది. ఓఆర్ఆర్ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాల్లో 23 మండలాలు, 97 గ్రామాల గుండా వెళ్తుండగా తొలుత పల్నాడు జిల్లాలో భూసేకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు వీలుగా గెజిట్ నోటిఫికేషన్(3ఏ) జారీ చేసింది. అమరావతి, పెదకూరపాడు మండలాల్లోని 9 గ్రామాల మీదగా నిర్మాణం జరిగే ఓఆర్ఆర్ కోసం భూముల వివరాలను సేకరించారు. ఓఆర్ఆర్ పరిధి లోకి వచ్చే భూముల సర్వేనెంబర్లు, భూయజమానుల వివరాలను తెలుపుతూ నోటిఫికేషన్ జారీ చేశారు. అమరావతి ఓఆర్ఆర్ 6 వరుసలతో 190 కి.మీ. నిర్మించనున్నారు.



ఈస్ట్‌కు బదులు లింకురోడ్లు

ఓఆర్ఆర్‌కు అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం విజయవాడ ఈస్ట్ బైపాస్‌కు నో చెప్పింది. రాజధాని అమరావతి, గుంటూరు, విజయవాడ మధ్య రాకపోకలకు అత్యంత కీలకమైన ఈ బైపాస్‌కు ప్రత్యామ్నాయంగా ఓఆర్ఆర్, ఎన్‌హెచ్-16ను అనుసంధానం చేస్తూ రెండు లింకు రోడ్లకు ఆమోదం తెలిపింది. తెనాలి సమీపంలోని నందివెలుగు వద్ద ఓఆర్ఆర్ నుంచి చెన్నై- కోల్‌కతా హైవేలోని వెస్ట్ బైపాస్ విలీన ప్రాంతం కాజ వరకూ 17.5 కి.మీ మేర లింకు రోడ్డును నిర్మించనున్నారు. నారాకోడూరు నుంచి బుడంపాడు వద్ద ఎన్‌హెచ్-16ను అనుసంధానిస్తూ 5.200కి.మీ. మేర మరో లింక్‌రోడ్డు నిర్మించనున్నారు.

రెవెన్యూ గ్రామం	సేకరించే భూమి ఎకరాల్లో
లింగాపురం	97.68
ధరణికోట	468.19
మూసాపురం	26.18
పాటిబండ్ల	185.806
జలాల్‌పురం	132.489
కంభంపాడు	41.48
తాళ్లూరు	69.92
లింగంగుంట్ల	1.3
బలుసుపాడు	150.31

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి సంబంధించి ఓఆర్ఆర్ నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. జిల్లాలవారీగా భూసేకరణకు ఎన్‌హెచ్‌ఏఐ గెజిట్లు ప్రచురిస్తోంది. తొలుత పల్నాడు జిల్లాలోని రెండు మండలాల పరిధిలోని గ్రామాలకు సంబంధించి గెజిట్ ప్రచురించింది. ఓఆర్ఆర్ ప్రాజెక్టు భూసేకరణ చేయనున్నామని, ఆయా సర్వే (మిగతా 4వ పేజీలో)

దాహార్తి.. దరిచేరకుండా

తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం


- పథకాల విస్తరణకు రూ.501.07 కోట్లు టెండర్ పిలిచిన పబ్లిక్ హెల్త్ శాఖ
- జీఎంసీ 10 విలీన గ్రామాలకూ విస్తరణ
- పిడుగురాళ్ల, మాచర్లకు బుగ్గవాగు నుంచి తాగునీరు



(తెనాలి, ఆంధ్రజ్యోతి)

పట్టణాలకు మహర్దశ పట్టనుంది. గుంటూరు కార్పొరేషన్, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీల్లో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. పుష్కలంగా తాగు నీటిని అందించేందుకు ఉన్న పథకాలను విస్తరించనున్నారు. ఇందుకు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ నిధి (యూఐడీఎఫ్) నుంచి రూ.501.07 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ పనులు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ టెండర్లు పిలిచింది. ఈ ప్రాజెక్టు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) ద్వారా నిర్వహిస్తున్నారు. రానున్న 30 ఏళ్ల తాగు నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకొని పథకాలను అభివృద్ధి చేస్తారు.

గుంటూరు కార్పొరేషన్‌లో తాగు నీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రూ 214.06 కోట్ల వ్యయంతో రక్షిత మంచి నీటి పథకాన్ని విస్తరించనున్నారు. కార్పొరేషన్‌లో విలీనమైన 10 గ్రామాల్లో నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. గ్రామాలను కలుపుతూ ప్రధాన పైపు లైన్ నిర్మిస్తారు. దీని నుంచి డిస్ట్రిబ్యూషన్ లైన్‌లు ఏర్పాటు చేశారు. నీటిని శుద్ధి చేసేందుకు 53 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను నిర్మించనున్నారు. శుద్ధి చేసిన నీటిని పైపు లైన్ ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకులకు సరఫరా చేస్తారు. ఇందుకోసం 10 ఓవర్ హెడ్ ట్యాంక్(ఓహెచ్‌ఎస్‌ఆర్)లు నిర్మిస్తారు. ఈ ట్యాంకుల నుంచి ఇళ్లకు కొత్తగా నిర్మించనున్న పైపులైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తారు.



బుగ్గవాగు నుంచి నీటి విడుదల (పాత చిత్రం)

మాచర్ల మునిసిపాల్టీ..

మాచర్ల మునిసిపాల్టీలో ఉన్న తాగు నీటి పథకాన్ని విస్తరించనున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా నీటి సరఫరాను పెంచనున్నారు. ప్రస్తుతం మాచర్లలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం నీటి పథకం విస్తరణకు రూ.109.34 కోట్ల నిధులు విడుదల చేసింది. ప్రస్తుతం క్వారీ పిట్‌ను నీటి నిల్వ చెరువుగా వినియోగిస్తున్నారు. ఈ చెరువులో నీటి నిల్వ సరిపోక ప్రజలు తాగునీటి వెతలను (మిగతా 4వ పేజీలో)

మొంథాతో.. రూ.800 కోట్ల నష్టం

◆ అంచనాలను కలెక్టరేట్‌కు నివేదించిన అధికారులు

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ జిల్లాకు రూ.800 కోట్లు నష్టం కలిగించింది. ఈ మేరకు శాఖల వారీగా అధికారులు కలెక్టరేట్‌కు నివేదించారు. కొద్ది రోజుల్లో సమగ్ర నివేదికని ప్రభుత్వానికి పంపనున్నట్లు కలెక్టరేట్‌వర్గాలు తెలిపాయి. ఎక్కువగా విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, పోల్స్‌కి నష్టం జరిగింది. 2162 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ తేల్చింది. ప్రధానంగా వరి పంట ఎక్కువగా తుఫాను ప్రభావానికి గురైంది. ఉద్యాన పంటలు 239.5 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. 23 ఇళ్లు నేల కొరగగా ఓ ఇంటి ప్రహరి కూలింది. 10 గొర్రెలు/మేకలు, 4 గేదెలు చనిపోయాయి. వాగులు రోడ్లపైకి ఉప్పొంగడంతో 20 ఆర్‌అండ్‌బీ రోడ్లు 50 కిలోమీటర్ల పొడవునా కొట్టుకుపోయాయి. మున్సి పాలిటీల్లో 452 వీధిలైట్లు, 17.081 కిలోమీటర్ల రోడ్లు, 8 కల్వర్టులకు నష్టం కలిగింది. ప్రాథమిక, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో నాలుగు చోట్ల లీకేజీలను గుర్తించారు. 33 కేవీ ఫీడర్లు 12, 11 కేవీ ఫీడర్లు 42, సబ్‌స్టేషన్లు 25, 11 కేవీ స్తంభాలు 55, ఎల్‌టీ స్తంభాలు 70, 11 కేవీ కండక్టర్ 8.35 కిలోమీటర్ల పొడవునా దెబ్బతిన్నాయి. నీటిపారుదల శాఖకు చెందిన 15 చెరువులు/చెక్‌డ్యాంలు, మేజర్ ఇరిగేషన్‌కు చెందిన కాల్వలు, వాగులకు 132 చోట్ల గండ్లు పడ్డాయి.

ఖాకీలపై ఎస్పీ కన్నెర్ర

- ఎస్ఐ సహా నలుగురిపై వేటు
- పోలీస్‌స్టేషన్లలో పంచాయితీలపై ఆగ్రహం

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గాడితప్పిన ఖాకీలపై ఎస్పీ వకుల్ జిందాల్ కన్నెర్ర చేశారు. నగరంపాలెం, పెదకాకాని పోలీస్‌స్టేషన్లలో అవినీతిపై నివేదికల ఆధారంగా నగరంపాలెం ఎస్ఐ సలాం, హెడ్ కానిస్టేబుల్ రమేష్, బీ సురేష్‌కుమార్, హోంగార్డు హరీష్‌లను సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్ ఉత్తర్వులు పోలీస్ శాఖలో కలకలం రేపాయి. నగరం నడిబొడ్డున, కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు, మరోవైపు ఆయా అధికారుల క్యాంపు కార్యాలయాల పరిధిలోని నగరం పాలెం స్టేషన్ పంచాయితీలకు వేదికగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో నజీర్‌బేగ్ నగరంపాలెం సీఐగా పనిచేసిన సమయంలో కొందరు పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వచ్చాయి. స్టేషన్‌లోనే ఎస్ఐ సలాం, హెడ్‌కానిస్టేబుల్ రమేష్ పంచాయితీలు చేయించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా గతంలో వేటు పడిన కానిస్టేబుల్ గఫార్ కంప్యూటర్ ఆపరేటర్ ముసుగులో స్టేషన్లో కార్యక్రమాలు నడిపించాడు. నిందితులపై లాఠీ ప్రయోగించాడు. డ్రైవర్‌గా పని చేసే ప్రైవేటు వ్యక్తి డేనియల్ కూడా స్టేషన్లో పోలీస్ తరహాలో పంచాయితీలు చేశాడు. ఈ క్రమంలో ఆయా ఘటనలపై ఇటీవల బదిలీ అయినా నగరంపాలెం సీఐ కిశోర్ విచారణ జరిపి నివేదిక ఇవ్వడంతో ఎస్పీ వారిపై చర్యలు తీసుకున్నారు. పెదకాకాని స్టేషన్లో కానిస్టేబుల్ బీ సురేష్‌కుమార్, హోంగార్డు హరీష్ బహిరంగంగా మద్యపానం చేసే వారిని పట్టుకుని రూ.3 వేలు తీసుకుని వారిని వదిలేసినట్లు తేలడంతో ఎస్పీ చర్యలు తీసుకున్నారు.

మరికొన్ని పోలీస్‌స్టేషన్లలోనూ..

జిల్లాలోని మరికొన్ని పోలీస్‌స్టేషన్లలో కూడా పెద్దఎత్తున పంచాయితీలు జరుగుతున్నాయని, అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా ఆరోపణలుపై ఎస్పీ జిందాల్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. త్వరలో మరికొందరి పై వేటు పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

సంక్షేమంలో సంక్షోభం

- విద్యార్థులను పట్టించుకోని అధికారులు
- ఓ విద్యార్థిని అదృశ్యం..
- నెలరోజుల తర్వాత గుర్తింపు

గుంటూరు(విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లోని విద్యార్థుల సంక్షేమం, వారి అభ్యున్నతి కోసం పాటుపడాల్సిన సాంఘిక సంక్షేమ శాఖలో నిర్లక్ష్యం, కీచులాటలతో విద్యార్థులు గురించి పట్టించుకునే వారే లేరు. భద్రతా సమస్యలు, మెస్‌బిల్లుల వివాదాలు, వేధింపులు సంక్షేమ శాఖలో నెలకొన్న పరిస్థితికి అద్దం పడుతోంది. కళాశాల వసతిగృహాల్లో ఏమి జరుగుతుందో ఎవరికి అర్థం కాని పరిస్థితి నెలకొంది. హెచ్‌డబ్ల్యూలు ఉదయం, సాయంత్రం వచ్చి కొద్దిసేపు కాలక్షేపం చేయడం తప్ప విద్యార్థుల గురించి పట్టించుకోవడంలేదని ఆరోపణలున్నాయి. కలెక్టర్ బంగ్లా సమీపంలోని వసతిగృహంలో ఓ విద్యార్థిని గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన మరువక ముందే. అదే హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని నెల క్రితం అదృశ్యమైంది. నెల రోజుల తర్వాత ఆమె జాడ కనుక్కొని గుట్టు చప్పుడు కాకుండా హాస్టల్‌కు తీసుకొచ్చారు. విద్యార్థిని తీసుకెళ్లిన వ్యక్తిపై కనీసం కేసు కూడా నమోదు చేయలేదని సమాచారం. రమేష్ హాస్పిటల్ సమీపంలోని ఓ హాస్టల్ విద్యార్థులు అన్న క్యాంటీన్లో భోజనం చేస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఇక్కడ హెచ్‌డబ్ల్యూవోను తాడికొండ బదిలీ చేశారు. ఇక్కడికి కొత్తగా వచ్చిన హెచ్‌డబ్ల్యూవోకు



సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయం

బదిలీ అయిన హెచ్‌డబ్ల్యూవో రికార్డులు ఇవ్వకుండా చుక్కలు చూపించాడు. ఇక్కడ నుంచి దాదాపు 20 క్వింటాళ్ల బియ్యాన్ని బదిలీ అయిన హాస్టల్‌కు తరలించినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. బియ్యం లేకపోవడంతో వంట సిబ్బంది వార్డెన్‌కు సహకరించడంలేదు. దీంతో విద్యార్థులకు రెండు రోజులు భోజనం సక్రమంగా అందలేదు. దీంతో నూతన హెచ్‌డబ్ల్యూవో బాధ్యతలు స్వీకరించిన వారం రోజుల్లోనే సస్పెండ్ చేశారు. ఇది అక్రమ సస్పెన్షన్ అంటూ సదరు హెచ్‌డబ్ల్యూవో కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. తాజాగా హాస్టల్ బాధ్యతను నెల రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్న మరొక హెచ్‌డబ్ల్యూవోకి అప్పగించారు.

వసూళ్లు.. వేధింపులు

బీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న సమీకృత హాస్టల్, కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మరో హాస్టల్ నుంచి కూరగాయలు, ఇతర నిత్యావసరాలు ప్రతిరోజు ఓ ద్వితీయ శ్రేణి అధికారి ఇంటికి తరలిపోతున్నట్లు సమాచారం. సరుకుల తరలింపులో జాప్యం జరిగితే సదరు అధికారి అగ్గి మీద గుగ్గిలం అవుతారని ప్రచారం ఉంది. ఉన్నతాధికారులకు ప్రతీ హాస్టల్ నుంచి నెల వారీగా నగదు సమర్పించుకోవాల్సి ఉంటుందన్న ఆరోపణలున్నాయి. లేనిపక్షంలో మెస్ బిల్లులకు కొర్రీలు వేస్తున్నట్లు హెచ్‌డబ్ల్యూవోలు వాపోతున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థుల మెస్ బిల్లులో పర్సంటేజ్ అడుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రోటోకాల్ ఖర్చు పేరుతో నెలకు రూ.1000 నుంచి రూ.2000 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఓ ద్వితీయ శ్రేణి మహిళా అధికారి ఉద్యోగుల్ని తీవ్ర స్థాయిలో బెదిరిస్తున్నట్లు సమాచారం. సిబ్బంది, హెచ్‌డబ్ల్యూ ఫోన్ సంభాషణలను రికార్డ్ చేసి రాష్ట్రస్థాయిలో అధికారులకు పంపి వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అమరావతి రోడ్డులో నివాసం ఉండే రాష్ట్ర స్థాయి సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఇంట్లో హాస్టల్ సిబ్బంది అనధికారికంగా పనిచేస్తున్నట్లు సమాచారం.

లక్ష్యం మేరకు పూర్తి చేయాలి

● సచివాలయ పనుల పరిశీలనలో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్



రాజధానిలో ఐకానిక్ టవర్ల పనులను పరిశీలస్తున్న అడిషనల్ కమిషనర్ భార్గవతేజ

తుళ్లూరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజారాజధాని అమరావతిలో నిర్మాణంలో ఉన్న సచివాలయ ఐకానిక్ టవర్ల పనులను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవతేజ తెలిపారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని సచివాలయ ఐకానిక్ టవర్ల రాఫ్ట్ ఫౌండేషన్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. పనుల పురోగతిని చీఫ్ ఇంజినీర్ ఎం.వీ.రావు, అడిషనల్ కమిషనర్‌కి వివరించారు. టవర్ల వద్ద వినియోగిస్తున్న మెటీరియల్‌ను పరిశీలించి పలు కీలక సూచనలు చేశారు. కార్మికుల భద్రతకు చేపట్టాల్సిన అంశాలను సమీక్షించారు. ఈ నెల 10న పనుల పరిశీలనకు రానున్న చెన్నై ఐఐటీ మద్రాస్ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ల బృందం సూచనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు.

దూసుకొచ్చి.. దుర్మరణం...

- లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం
- బాపట్లలో గుంటూరు యువకులు ఇద్దరు మృతి
- సూర్యలంకకు వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రమాదం



షేక్‌రిజ్వాన్ యశ్వంత్

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేగం ఇద్దరు యువకులను బలితీసుకుంది. బైక్‌పై దూసుకు వచ్చి బాపట్ల గడియార స్తంభం సెంటర్‌లో ఓ లారీని ఢీ కొట్టటంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. గుంటూరు కొరిటెపాడుకు చెందిన ఏడుగురు యువకులు మూడు ద్విచక్ర వాహనాలపై సూర్యలంకకు వచ్చారు. బీచ్‌లోకి పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో వారు తిరిగి అవే బైక్‌లపై బాపట్ల వైపు బయల్దేరారు. ఈ క్రమంలో బాపట్ల గడియార స్తంభం వద్ద కర్లపాలెం వైపు కర్రలలోడ్‌తో వెళుతున్న లారీని బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆ బైక్‌పై ఉన్న షేక్.రిజ్వాన్(18), చింతల యశ్వంత్ ఉరఫ్ నాని(21) అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక వస్తున్న స్నేహితులు వీరిని కాపాడేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. నాని గుంటూరులో ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తుండగా, రిజ్వాన్ గుంటూరులో ఐటీఐ చదువుతున్నాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాలను బాటప్ల ఏరియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. లారీని అదుపులోకి తీసుకున్నారు. లారీని ఢీకొని యువకులు దుర్మరణం పాలైన సీసీ పుటేజ్ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

వ్యభిచార గృహాలపై ఆకస్మిక దాడులు..

నరసరావుపేట లీగల్, యడ్లపాడు, తెనాలి క్రైం నవంబరు6(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డులో వ్యభిచార స్థావరంపై గురువారం మొదటి పట్టణ పోలీసులు ఎస్పీ ఆదేశాల మేరకు.. ఆకస్మికంగా దాడి చేశారు. ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ షేక్ ఫిరోజ్ నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్‌ఐ శివరామకృష్ణ

ఆన్‌లైన్ వ్యభిచారం గుట్టురట్టు..

యడ్లపాడు పరిధిలో ఆన్‌లైన్ వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ సుబ్బనాయుడు విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. యడ్లపాడు గ్రామానికి చెందిన దేవి అనే మహిళ గుంటూరు, విజయవాడకు చెందిన యువతుల ఫొటోలను.. విటులకు పంపించి యడ్లపాడులోని తన నివాసంలో వ్యభిచారం చేయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. సోమవారం రాత్రి ఒక యువతిని, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణలో నిర్వాహకురాలు పసుమర్రు గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు గుర్తించామన్నారు. బుధవారం ఉదయం దేవిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలిలో ఇద్దరు యువతులు..

తెనాలి క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెనాలి నాజరుపేటలోని ఓ ఇంటిలో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు దాడి చేశారు. విజయవాడ, గుంటూరుకు చెందిన ఇద్దరు యువతులను, ఇద్దరు విటులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి నుంచి 4 సెల్ ఫోన్లు రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు.

అర్హత లేకున్నా డైట్‌లో అధ్యాపక పరీక్షకు

● చివరి నిమిషంలో అడ్డుకున్న పల్నాడు డీఈవో

గుంటూరు(విద్య), నవంబరు6(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్, బోయపాలెం)లో గురువారం ఆంగ్ల అధ్యాపక పోస్టుకు జరిగిన రాత పరీక్షలో హైడ్రామా చోటుచేసుకుంది. ఇక్కడ ఆంగ్ల అధ్యాపక పోస్టును (డిప్యూటేషన్ ద్వారా) భర్తీ చేయడానికి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో బీఈడీ 55శాతానికి పైగా మార్కులు ఉన్న ముగ్గురు స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు వచ్చాయి. వారికి హాల్ టిక్కెట్లు కూడా జారీ అయ్యాయి. గురువారం ఉదయం 9 గంటలకు రాతపరీక్ష నిర్వహించడానికి కళాశాల ప్రిన్సిపల్ సన్నాహాలు చేస్తున్న తరుణంలో తాను కూడా పరీక్ష రాస్తానని నూజెండ్ల మండలంలోని ఒక ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు డైట్‌కు వచ్చింది. అయితే రాత పరీక్షకు ఆమెకు అర్హత లేదు. పైగా పరీక్షకు దరఖాస్తు కూడా చేయలేదు. అయినా హాల్‌టికెట్ ఎలా తెచ్చుకుందో తెలియక సిబ్బంది..పల్నాడు డీఈవో చంద్రకళ దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే ఆమె స్పందించి విచారణ చేయడంతో పల్నాడులో పనిచేసే ఓ అధికారి సిఫార్సుతో హాల్ టికెట్ తెచ్చుకున్నట్లు తేలింది. దొడ్డిదారిన హాల్ టికెట్ తెచ్చుకున్న ఉపాధ్యాయురాలిని పరీక్షకు అనుతించ లేదని, అర్హులైన ముగ్గురికి పరీక్ష నిర్వహించాలని డీఈఓ ఆదేశాలు జారీ చేశారు. అక్రమ మార్గంలో హాల్‌టికెట్ తెచ్చుకున్న ఉపాధ్యాయురాలపై అంతర్గత విచారణకు ఆదేశించడంతోపాటు ఆమెకు సహకరించిన వారిపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేశారు.

రైతు ఖాతా నుంచి రూ.3.84 లక్షలు మాయం

వెల్దుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.3.84 లక్షలు మాయం చేశారు. దీనిపై బాధిత రైతు గురువారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు కథనం మేరకు.. మండలంలోని మండాదికి చెందిన రైతు పాతకోటి సైదారెడ్డికి మాచర్ల పట్టణంలోని కెనరా బ్యాంకులో ఖాతా ఉంది. సైబర్ నేరగాళ్లు రెండు రోజుల క్రితం అతని ఫోన్ హ్యాక్ చేసి, సిగ్నల్ రాకుండా చేశారు. సిగ్నల్ వచ్చిన తర్వాత చూస్తే బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.3.84 లక్షల నగదును కాజేశారంటూ వాపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సమందర్‌వలి తెలిపారు.

కొనసాగుతున్న ఏసీబీ దాడులు

నరసరావుపేట లీగల్, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్త దాడుల్లో భాగంగా రెండవ రోజు గురువారం పట్టణంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు కొనసాగుతున్నాయి. రిజిస్ట్రేషన్ల విధానం, అవినీతి ఆరోపణలపై డాక్యుమెంట్లను సిబ్బంది పొద్దుపోయే వరకు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. శుక్రవారం పూర్తి వివరాలు వెల్లడి అయ్యే అవకాశం ఉంది.

తొమ్మిది ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లిపర, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం, అన్నవరం తదితర గ్రామాల్లో ఇసుక రీచ్‌ల్లో ఎస్‌ఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. కృష్ణా నది నుంచి బిల్లులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయాలనికి తరలించడంతో.. తహసీల్దార్ సిద్ధార్థ ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేలు జరిమాన విధించినట్లు తెలిపారు.

కొలకలూరు విద్యార్థి మృతదేహం లభ్యం

తెనాలి క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొలకలూరులో బుధవారం కొమ్మూరు కాల్వలోకి దూకి గల్లంతైన ఇంజనీరింగ్ విద్యార్థి మృతదేహం లభ్యమైంది. గురువారం సాయంత్రం గుడివాడ యాదవపాలెం వద్ద కాల్వ ఒడ్డుకు శవం కొట్టుకు వచ్చిందని రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న కొలకలూరుకు చెందిన షేక్ ఖాజావలి (20) ఆత్మహత్య కారణాలు వెల్లడి కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఒడ్డుకు చేరిన మృతదేహం

మద్యం మత్తులో లైంగిక వేధింపులు..వ్యక్తి హత్య

పిడుగురాళ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తనతో లైంగిక సంబంధం పెట్టుకోమన్న వ్యక్తిని.. మరో వ్యక్తి తన స్నేహితుడితో కలిసి రాళ్ల కొట్టి చంపేశాడు. ఈ ఘటన గత బుధవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన కొమ్ము సంతోషరావు(37), షేక్ సుభాని లెనిన్‌నగర్ సమీపంలోని పాడుబడిన ఇంట్లో మద్యం సేవించారు. సంతోషరావు సుభానిని తనతో లైంగిక సంబంధం పెట్టుకోమని విసిగించడంతో.. ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో సుభాని తన స్నేహితుడు నూర్ బాషా సైదావలిని ఘటనా స్థలానికి రప్పించాడు. సుభాని, సైదావలి ఇద్దరు సంతోషరావుపై రాళ్లతో దాడి చేయడంతో..అతను మృతి చెందాడు. అనంతరం రక్తపు మరకలతో పిడుగురాళ్లలో సుభాని, సైదావలి కనిపించడంతో గస్తీ తిరుగుతున్న పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. జరిగిన ఘటన తెలుసుకొని కేసునమోదు చేశారు.

నేడు 'చలపతి'లో మెగా జాబ్ మేళా

గుంటూరు(విద్య), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు లామ్‌లోని చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా పరిసర ప్రాంతాల్లోని పది, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, బీఫార్మశీ పూర్తిచేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం అల్లూరి వెంకట్ (89195 08017)ను సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా కొమ్మాలపాటి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ జన్మదిన వేడుకలు నరసరావుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని, కేక్ కట్ చేసి కొమ్మాలపాటికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమ్మాలపాటి శ్రీధర్ పార్టీకి అంకితమైన నాయకుడన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యేగా పనిచేసి, ఇప్పుడు జిల్లా అధ్యక్షుడిగా టీడీపీని బలోపేతం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, బులియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, ఎస్సీ సెల్ డైరెక్టర్ సాతులూరి కుమార్, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి హనుమంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, గొట్టిపాటి జనార్దన్‌బాబు, షేక్ మన్నాన్ షరీఫ్, రావర్ల జగ్గారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, గోనుగుంట్ల శ్రీనివాసరావు, కనుమూరి అనంతలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బంగారు దుకాణాలపై బీఐఎస్ అధికారుల దాడులు

గుంటూరు(తూర్పు), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని పట్నంబజారు, లాలాపేట ఇతర ప్రాంతాల్లోని బంగారు దుకాణాల్లో విజయవాడ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. బంగారు ఆభరణాలపై హాల్ మార్కింగ్ లేకుండా విక్రయించడం, బీఐఎస్ గుర్తింపు లేని నకిలీ యంత్రాలతో ఈ ప్రక్రియ చేయడం వంటి ఫిర్యాదులు రావడంతో ఈ దాడులు జరిపారు. దుకాణాల్లోని యంత్రాలపై ఉండే హాల్‌మార్కింగ్ సెంటర్ గుర్తింపు నంబరు, దుకాణదారుని లైసెన్సు, నగలపై బీఐఎస్ చిహ్నం వంటి అంశాలను పరిశీలించారు. కొన్ని దుకాణాల్లో యంత్రాలపై సరైన వివరాలు ముద్రించకపోవడంతో నోటీసులు అందజేశారు. క్లాత్ బజార్‌లోని ఓ దుకాణంలో లేజర్ మార్కింగ్ మిషన్ ద్వారా హాల్ మార్కింగ్‌ని గుర్తించి సీజ్ చేశారు. అనంతరం బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ టి.అర్జున్ మాట్లాడుతూ బంగారం ధర పెరుగుతున్న నేపథ్యంలో జరుగుతున్న మోసాలపై దృష్టి సారించామన్నారు. హాల్ మార్కింగ్‌పై బీఐఎస్ వారి గుర్తింపు తప్పనిసరి అని అన్నారు. బంగారంలో రాగి, ఇతర లోహాల శాతం ఎంత ఉంది.. రుథేనియం, క్యాడ్మియం, ఇరిడియం వంటి నిషేధిత ద్రావణాలు ఏవైనా.. ఉన్నాయా అని పరీక్షించాలన్నారు. ఇవి అన్ని మినహాయించి బంగారం ఎంత ఉంది అని నిర్ధారించి వినియోగదారునికి వివరాలు అందజేయాలని సూచించారు. స్వచ్ఛత 916, దాని కంటే ఎక్కువ శాతం వస్తే 22 క్యారెట్లు, 875 ఉంటే 18 క్యారెట్లు గోల్డ్ అనే పూర్తి సమాచారం రశీదులో పొందుపరచాలని సూచించారు. చాల మంది కేవలం 22 క్యారెట్లు బంగారంకే హాల్ మార్కింగ్ ముద్ర వేస్తారు అనే అపోహలో ఉంటారని, 14, 16, 18 క్యారెట్లు బంగారానికి కూడా హాల్ మార్కింగ్ ముద్రించుకోనే అవకాశం ఉందని తెలిపారు. ఈ తనిఖీలలో అధికారి కె.సాయి కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



దుకాణదారుడికి నోటీసులు అందజేస్తున్న బీఐఎస్ జేడీ అర్జున్

10 నుంచి ఏఎన్‌యూలో ఎన్‌సీసీ ఐడియా, ఇన్నోవేషన్ పోటీలు

ఏఎన్‌యూ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అఖిల భారత ఎన్‌సీసీ ఐడియా అండ్ ఇన్నోవేషన్ పోటీలు-2025 జరగనున్నాయి. ఈ పోటీలకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 340 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరుకానున్నారు. యువతలో ఆవిష్కర ణాత్మక ఆలోచన, సాంకేతిక, వ్యవస్థాపక నైపుణ్యాల అభివృద్ధి ద్వారా ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రోత్సహించడంతో పాటు విక్షిత్ భారత్-2047 లక్ష్యానికి తోడ్పడడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యం. పోటీల ద్వారా క్యాడెట్లు సమాజపరమైన, సాంకేతిక అభివృద్ధికి దోహదపడే వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర తదితరులు ఈ కార్యక్రమాలకు హాజరుకానున్నారు.

నేడు 'వందేమాతరం'పై ఉపన్యాసం

ఏఎన్‌యూలోని చరిత్ర, పురావస్తుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 50 సంవత్సరాల వందేమాతరం సందర్భంగా భారత స్వాతంత్రోద్యమం సమయంలో వందేమాతరం ఉద్యమం అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం జరుగుతుందని విభాగాధిపతి ఆచార్య ఎస్.మురళీమోహన్ గురువారం తెలిపారు. ముఖ్య అతిథిగా వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, గౌరవ అతిథులుగా రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, కీలకోపన్యాసకులుగా కర్నూలులోని క్లస్టర్ విశ్వవిద్యాలయం చరిత్ర అధ్యాపకులు డాక్టర్ బి.ఆర్.ప్రసాద్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాలలోని ఆచార్య హరగోపాల్‌రెడ్డి సెమి నార్ హాలులో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభ మవుతుందన్నారు.

లాంలో నేడు..

ఎన్జీ రంగా 125వ జయంతి

● హాజరు కానున్న సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు

గుంటూరు సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు, దేశం గర్వించదగ్గ రైతు బాంధవులు, ప్రముఖ పార్లమెంట్ సభ్యులు, పద్మవిభూషణ్ ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి వేడుకలు శుక్రవారం గుంటూరు సమీపంలోని లాంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరగనున్నాయి. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొననున్నారు. వర్సిటీలోని కృష్ణ ఆడిటోరియంలో ఏర్పాట్లను ఎన్జీ రంగా ట్రస్ట్ సభ్యులు రామినేని కిశోర్‌బాబు, టి. యుగంధర్, బి.నాగేశ్వర్‌మిత్రా పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమం పర్యవేక్షణకు రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ వీవీ సత్య నారాయణను ఇన్‌చార్జిగా నియమించారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 25,375 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 31,579 క్యూసెక్కుల వరద నీరు గురువారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 25,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 2011 , పశ్చిమ డెల్టాకు 4012, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

సాగర్ నీటి నిల్వ 312.04 టీఎంసీలు

విజయపురిసౌత్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం గురువారం నాటికి 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5087 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,657 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 49,944 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 60,319 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో 44.53 టీఎంసీలు

అచ్చంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 44.53 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 46,300 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. పవర్ జనరేషన్ ద్వారా 12వేలు, లీకుల ద్వారా 400, ఒక గేటు ద్వారా 20,823, మొత్తం 33,223 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

10, 11న వాటర్ షెడ్ మహోత్సవ్

● పాల్గొననున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

గుంటూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణా భివృద్ధి శాఖ వాటర్ షెడ్ - పీఎంకేఎస్‌వై జాతీయ సదస్సు (వాటర్ షెడ్ మహోత్సవ్) రెండు రోజుల పాటు గుంటూరులో జరుగుతుందని రాష్ట్ర వాటర్ షెడ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సంచాలకులు వై.వి.కె.షణ్ముఖకుమార్ గురువార ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ నెల 10న గుంటూరు ఐటీసీ హోటల్లో ప్రారంభ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. 11న గుంటూరు జిల్లాలోని వెంగళాయపాలెం గ్రామ పంచాయతీలో జరుగనున్న కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారని తెలిపారు.



వెంగళాయపాలెం చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ..

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న వెంగళాయపాలెం గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద జరగనున్న జాతీయ వాటర్ షెడ్, అమృత్ సరోవర్ అభివృద్ధి కార్యక్రమం నేపథ్యంలో ఏర్పాట్లను గురు వారం గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్‌బీ సీఐ రాంబాబుతో సమావేశమై బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. పలు సూచనలు జారీ చేశారు. బారికేడ్లు చేసి, భద్రత కల్పించాలన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ బృందం భద్రతకు ప్రాధా న్యమిస్తూ, ప్రొటోకాల్ నిబంధ నలను కచ్చితంగా పాటించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

దాహార్తి దరిచేరకుండా..

(3వ పేజీ తరువాయి)

ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బుగ్గవాగు నుంచి మాచర్ల చెరువుకు నీటి తరలించేందుకు 27 కిలోమీటర్ల పొడవున పైపులైన్ ఏర్పాటు చేస్తారు. బుగ్గవాగులో ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేసి మోటార్ల ద్వారా మాచర్లకు తాగు నీటిని తరలిస్తారు. మునిసిపాల్టీలో గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం ఈ పనులను గాలికి వదిలేసింది. ఈ ట్యాంక్‌తో పాటు పైపు లైన్లను కూడా నిర్మించనున్నారు. ఈ పనులకు టెండర్ నిర్వహించారు.

పిడుగురాళ్ల మునిసిపాల్టీలో...

పిడుగురాళ్ల మునిసిపాల్టీలో ఏళ్ల తరబడి నీటి ఇక్కట్లను పౌరులు ఎదుర్కొంటున్నారు. కృష్ణా నది నుంచి పిడుగురాళ్లకు తాగునీటి తరలించేందుకు గతంలో పైపు లైన్ నిర్మించారు. అయితే పైపు లైన్‌పై తరచూ లీకులు ఏర్పడుతూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. నది నుంచి మోటార్ల ద్వారా నీటిని పంపు చేయడంతో ఈ ఒత్తిడిని పైపులైన్ తట్టుకోలేక పోవడంతో లీకులు ఏర్పడుతున్నాయి. దీంతో కొత్త పైపు లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. గ్రావిటీపై నీటిని తరలించేందుకు బుగ్గవాగు నుంచి 42 కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్ నిర్మాణం జరగనుంది. వాగులో ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేస్తారు. అక్కడే ఓహెచ్‌బీఆర్ నిర్మించి దీనికి బుగ్గవాగు నుంచి నీటిని పంపు చేస్తారు. ఓహెచ్‌బీఆర్ నుంచి పైపులైన్ ద్వారా గ్రావిటీపై పిడుగురాళ్లకు నీటిని తరలించే విధంగా పబ్లిక్ హెల్త్‌శాఖ ప్రాజెక్ట్ డిజైన్ చేసింది. 30 ఎంఎల్‌డీ నీటిని తరలించేందుకు 700 ఎంఎం సామర్థ్యం గల పైపులైన్‌ను నిర్మిస్తారు. గత టీడీపీ ప్రభుత్వంలో మునిసిపాల్టీలో మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టగా.. వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ పనులను కూడా ప్రభుత్వం పట్టాలెక్కిస్తోంది. ట్యాంకులతో పాటు డిస్ట్రిబ్యూషన్ లైన్లు, 14 ఎంఎల్‌డీ నీటి శుద్ధి ప్లాంట్‌కు మరమ్మతులు చేపడుతున్నారు.

అమరావతి ఓఆర్‌ఆర్‌కు.. తొలిఅడుగు

(3వ పేజీ తరువాయి)

నంబర్లలో భూమి అవసరమవుతుందని తెలిపేలా గెజిట్ నోటిఫికేషన్(3ఏ)లో పేర్కొంది. ఒకటి, రెండు రోజుల్లో గెజిట్‌ను రూపంలో పత్రికల్లో ప్రకటించనున్నారు. కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాల్లోనూ ప్రజలకు కాపీలను అందుబాటులోకి తేనున్నారు. అభ్యంతరాలు ఉంటే 21 రోజుల్లో భూసేకరణ అధికారికి తెలియజేస్తే.. పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో రెండు మండలాల్లో 17.230 కి.మీ పొడవున భూమిని సేకరించనున్నారు. ఆయా గ్రామాల్లో ఓఆర్‌ఆర్ పరిధిలోకి వచ్చే భూముల సర్వేనెంబర్లు, భూ యజమానుల వివరాలను తెలుపుతూ నోటిఫికేషన్ జారీచేశారు. మరో రెండు రోజుల్లో అధికారికంగా పత్రికా ప్రకటన ఇవ్వనున్నారు. ఓఆర్‌ఆర్ నిర్మాణంలో గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు అత్యంత కీలకంగా ఉన్నాయి. ఈ జిల్లాల్లో ఎక్కువ మండలాల గుండా ఓఆర్‌ఆర్ వెళుతోంది. ఎక్కువ గ్రామాల నుంచి భూసేకరణ చేయాల్సి ఉంది. పల్నాడు, ఏలూరు జిల్లాల్లో ఒకటి, రెండు మండలాల నుంచే ఓఆర్‌ఆర్ వెళుతుండడంతో గెజిట్ ప్రక్రియ త్వరితగతిన పూర్తయింది. కాగా పల్నాడు జిల్లాలో రెండు మండలాల్లో 990 ఎల్‌పీ నెంబర్లు.. రైతులు వివరాలను గెజిట్‌లో పేర్కొన్నారు. అమరావతి మండలంలోని లింగాపురం, ధరణికోట రెవెన్యూ పరిధిలో దిడుగు, నెమలికల్లు గ్రామాల నుంచి 565.87 ఎకరాలు భూమిని సేకరించనున్నారు. ఇందులో 420.14 ఎకరాలు పట్టా, 0.93 ఎకరాలు ప్రభుత్వ, 144.8 ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నాయి. పెదకూరపాడు మండలంలోని ముస్సాపురం, పాటిబండ్ల, జలాల్‌పురం, కంభంపాడు, తాళ్లూరు, లింగంగుంట్ల, బలుసుపాడు గ్రామాల పరిధిలోని 607.485 ఎకరాలను సేకరించే జాబితాలో చూపించారు. ఇక్కడ 538.1 ఎకరాలు పట్టా, 50.447 ఎకరాలు ప్రభుత్వ, 1.57 ఎకరాలు అసైన్డ్, 17.363 ఎకరాలు ఈనాం భూములు ఉన్నాయి.

కీలకంగా గుంటూరు..

ఓఆర్‌ఆర్‌కు సంబంధించి గుంటూరు జిల్లా అత్యంత కీలకంగా ఉంది. ఈ జిల్లాలో 11 మండలాల్లో భూమిని సేకరించాల్సి ఉంది. ఈ 11 మండలాల్లోని 40 గ్రామాల్లో 67.650 కి.మీ. భూమిని సేకరించాల్సి ఉంది. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అది కూడా తుది దశకు వస్తోంది. మరో వారం పది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని, ఆ వెంటనే గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల అవుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా దీనికి సంబంధించిన గెజిట్‌ను అధికారులు గతంలోనే సిద్ధం చేశారు. అందులో కొన్ని తప్పులు దొర్లడంతో వెనక్కి వచ్చింది. దీన్ని కూడా అధికారులు సిద్ధం చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో 5 మండలాల్లోని 22 గ్రామాల్లో 35.140 కి.మీ. మేర భూసేకరణ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ కూడా వేగంగా కొనసాగుతోంది. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 4 మండలాల్లో 18 గ్రామాల్లో 51.120 కి.మీ మేర భూమిని సేకరించాల్సి ఉంది. ఈ ఐదు జిల్లాల్లో భూసేకరణకు సంబంధించిన గెజిట్ ప్రకటన ఎట్టి పరిస్థితుల్లో నెలాఖరులోగా విడుదల చేస్తామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు.

49,124 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 51,078 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,124 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 13,404 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	15800	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14300	334	10500	15400
273	----	----	నెంబరు. 5	10000	14500
341	10000	16500	273	----	----
4884	----	----	341	10000	16800
సూపర్ 10	----	----	4884	11000	13800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15700	తేజ	10000	15500
షార్క్-1	----	----	బ్యాడిగి	10000	16100
బ్యాడిగి	10500	16500	దేవనూరు డీలక్స్	10500	15500
దేవనూరు డీలక్స్	10000	15300	తాలుకాయలు	5000	8500

నేడు జిల్లా కోర్టులో న్యాయ అవగాహన

గుంటూరు (లీగల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థలో శుక్రవారం న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ నెల తొమ్మిది దిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సాధారణ ప్రజలకు న్యాయ సంబంధిత హక్కులు, లీగల్ సర్వీసుల ద్వారా అందే పథకాలు గురించి వివరిస్తామని తెలిపారు. ఆయా విభాగాల అధికారులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొని ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్‌ఆర్‌ఎం ఘటనపై ఇన్‌చార్జి మంత్రి ఆరా

● క్షుణ్ణంగా విచారించాలని కలెక్టర్‌కు ఆదేశం

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ఘటనపై గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ ఆరా తీశారు. లండన్ పర్యటనలో ఉన్న ఆయన గురువారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో ఫోన్‌లో మాట్లాడారు. ఫుడ్ పాయిజన్‌తో వందలాది మంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. విభిన్న కోణాల్లో క్షుణ్ణంగా విచారణ చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిటీకి మంత్రి దుర్గేష్ ఫోన్ ద్వారా పలు సూచనలు చేశారు.

రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీలకు హేమశ్రీ

గుంటూరు (క్రీడలు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో స్థానిక బండ్లమూడి హనుమాయమ్మ పాఠశాల విద్యార్థిని జి.హేమశ్రీ పాల్గొననున్నది. శ్రీకాకుళంలో ఈ నెల 8 నుంచి ఈ పోటీలు జరగనున్నాయి. హేమశ్రీ అండర్ 14 బాలికల విభాగంలో 80 మీటర్ల హర్డిల్స్ పోటీలకు ఎంపికయింది. ఈ సందర్భంగా హేమశ్రీని ఆమెకు శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని జోస్పిన్‌ను బండ్లమూడి జూనియర్ కళాశాల హైస్కూల్ ప్రిన్సిపాల్ కాకాని సీతారామ చంద్రమూర్తి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.లక్ష్మీ సీత, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు రైల్వేలో సామూహిక వందేమాతరం గీతాలాపన

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్లవుతున్న సందర్భంగా కేంద్రప్రభుత్వం పిలుపు మేరకు రైల్వేలోని అన్ని కార్యాలయాల్లో శుక్రవారం సామూహింగా ఆ పాటను ఆలపించనున్నారు. గుంటూరులోని రైల్ వికాస్‌భవన్‌తో పాటు అన్ని రైల్వేస్టేషన్లు, కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది వందేమాతర గీతాన్ని ఆలపిస్తారు. ఇందుకోసం నిర్ణీత సమయానికి పావు గంట ముందుగానే చేరుకోవాలని ఉన్నతాధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలుండాలి

● జిల్లా అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి డేటా ఆధారిత పాలనపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ విధానంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, అధికారులు హాజరయ్యారు. ఈ సదస్సులో సీఎం మాట్లాడుతూ, దీర్ఘ, మధ్య, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని పౌరులకు అధికారులు సుపరిపాలన అందించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రాధాన్యం కావాలన్నారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకొని సమర్థవంతంగా ఆ విభాగాన్ని వినియోగించుకోవాలని సూచించారు. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందన్నారు. 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయికుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శేషశ్రీ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జేసీ, డీఆర్‌వో

అర్హుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉండాలి

● రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్



రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్నారు. ఓటరు జాబితా పునరుశ్చరణపై గురువారం జిల్లా అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ, ఇంటింటా ఓటర్ల సర్వే విచారణ జరపాలన్నారు. బుక్ కాల్ విత్ బీఎల్‌వో అవకాశాన్ని తీసుకొచ్చామని, తద్వారా ఓటరు జాబితాలో సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజా వలి, డిప్యూటీ కలెక్టర్‌లు విజయలక్ష్మి, గంగరాజు పాల్గొన్నారు.

● సామాజిక రుగ్మతలను రూపుమాపుదాం

సమన్వయంతో పనిచేసి జిల్లాలో సామాజిక రుగ్మతలను రూపుమాపుదామని స్వచ్ఛంద సంస్థలకు కలెక్టర్ అన్సారియా పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్‌జీవోలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వచ్ఛంద సంస్థలు జిల్లాలో వివిధ రంగాల్లో చేస్తున్న కృషిని ఆమె కొనియాడారు. ఇదే స్ఫూర్తితో సామాజిక రుగ్మతలైన బాల్య వివాహాలను, బాలకార్మిక వ్యవస్థను అరికట్టాల్సిన అవసరముందని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు సామాజిక రుగ్మతలపై సమరం సాగించి జిల్లాను ఆదర్శంగా తీర్చిద్దడంలో భాగమవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యూ.చెన్నయ్య, ముఖ్య ప్రణాళిక అధికారి శేషశ్రీ, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గా బాయి, రెడ్ క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ పి.రామచంద్ర రాజు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితానికి ఎనర్జీ ప్లాంట్లు దోహదం

● తమిళనాడు మున్సిపల్ డైరెక్టర్ మధుసూదనరెడ్డి

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరాల్లో డంపింగ్ యార్డులు లేకుండా చేసి, పర్యావరణ హితానికి వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు దోహదపడతాయని తమిళనాడు మునిసిపల్ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) పి.మధుసూదన్ రెడ్డి అన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్టడీ టూర్‌లో భాగంగా తమిళనాడు మున్సిపల్ విభాగం నుంచి డీఎంఏ మధుసూదన్, మధురై కార్పొరేషన్ కమిషనర్ చిత్ర విజయన్, హోసూర్ కార్పొరేషన్ ఈఈ విక్టర్ జ్ఞానరాజ్, ఏఈ (డీఎంఏ) రవి చంద్రన్ గుంటూరు వచ్చారు. గురువారం వారు నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్, గుంటూరు నగరంలోని ఎంఆర్ఎఫ్, వెట్, విండ్రో, వర్మి కంపోస్ట్ యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత ప్లాంట్ సామర్థ్యం, పనితీరును గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లాంట్ ఆవరణలో డీఎంఏ బృందం, నగర కమిషనర్ మొక్కలు నాటారు. పర్యటనలో ఎస్ఈ (ఇంచార్జి) సుందర్ రామిరెడ్డి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, జిందాల్ ప్లాంట్ ఏపీ ప్రెసిడెంట్ ఎంవీ చారి బృందం పాల్గొన్నారు.



నాయుడుపేటలోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న తమిళనాడు డీఎంఏ మధుసూదన్‌రెడ్డి, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

హాస్టళ్లలో ఈ-కేవైసీ క్యాంపులు



అరండల్‌పేట బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు సిటిజన్ ఈ-కేవైసీ చేయిస్తున్న డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్ ఉన్న సిటిజన్ ఈ-కేవైసీని పూర్తి చేసేందుకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ హాస్టళ్లలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు. గుంటూరు నగరంలోని పలు వసతి గృహాల్లో గురువారం ఈ-కేవైసీ క్యాంపులు నిర్వహించారు. అరండల్‌పేటలోని బీసీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు సిటిజన్ ఈ-కేవైసీతో పాటు, మ్యాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్ నిర్వహించారు. ఈ వసతి గృహంలోని 120 మంది విద్యార్థినులకు, అదే విధంగా బాలుర వసతి గృహంలోని 70 మంది విద్యార్థులకు ఈ-కేవైసీ పూర్తి చేసినట్లు డిప్యూటీ సీఈవో కృష్ణ తెలిపారు. ఈ-కేవైసీతో పాటు, మ్యాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్‌కు జిల్లాలో సుమారు 75 వేల మంది విద్యార్థులు పెండింగ్‌లో ఉన్నందున వసతి గృహాలకు వెళ్లి క్యాంపులు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ దీనసుధ, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు



మాట్లాడుతున్న డీవైఈవో పద్మ

గుంటూరు (విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఇంటర్ విద్యార్థులకు జిల్లాస్థాయిలో వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు గురువారం నిర్వహించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోటీలను డీవైఈవో జె.పద్మ ప్రారంభించారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థుల మధ్య పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. పోటీలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల (గుంటూరు), ప్రభుత్వ జూనియర్ కళాశాల (పెనుమాక), బీఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాల (తాడికొండ), సీకే జూనియర్ కళాశాల (మంగళగిరి), ప్రభుత్వ జూనియర్ కళాశాల (సిరిపురం), సెయింట్ జోసెఫ్ (నల్లపాడు) విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ నెల 26న విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు డీవైఈవో పద్మ వెల్లడించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాదేవి, అధ్యాపకులు సొపాటి రమేశ్ బాబు, డి.శివనాగరాజు, వై.సునీతారాణి, మాధవీలత, స్వరూపరాణి, చావ రామారావు, మాధవి, కె.సంజీవరావు, షేక్ మస్తాన్‌వలి తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

ఐఎంఏలో యువ వైద్యులు క్రియాశీలకంగా ఉండాలి

● ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిశోర్ పిలుపు

గుంటూరు మెడికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలోని అల్లోపతి వైద్యుల అతిపెద్ద జాతీయ సంఘమైన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)లో యువ వైద్యులు సభ్యులుగా చేరి క్రియాశీలకంగా వ్యవహరించాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిశోర్ పిలుపునిచ్చారు. కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని జీఎంఏ హాల్లో ఐఎంఏ గుంటూరుశాఖ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నందకిశోర్ 2025-26 ఏడాదికి ఐఎంఏ గుంటూరుశాఖ నూతన కార్యవర్గానికి ఎన్నికైన అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ మోపర్తి శివప్రసాద్, కార్యదర్శి డాక్టర్ బి.సాయికృష్ణ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ చిలకల శ్రీనివాసరెడ్డి, మరో 25 మంది కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం డాక్టర్ సుబ్బారాయుడు నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన అధ్యక్షుడు డాక్టర్ సేవకుమార్‌కు ఐఎంఏ మెడల్ అందించి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం వైద్య వృత్తి అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటునట్లు తెలిపారు. రాష్ట్ర ఐఎంఏ సహకారంతో ఈ సమస్యల పరిష్కారానికి తాము కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ డాక్టర్ ఎన్.అప్పారావు, ఫ్యామిలీ సెక్యూరిటీ స్కీమ్ చైర్మన్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు నాగళ్ళ కిశోర్, జీఎంఏ అధ్యక్షుడు యలమంచిలి సంజయ్, కార్యదర్శి జి.రాజేశ్, సీనియర్ వైద్యుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఎం.ఫణి కుమార్, మద్దినేని జగదీశ్, కె.కళాధర్, రవిబాబు, ఎన్.శేషయ్య, ఎస్.అమర్నాథ్, అమర లింగేశ్వరరావు, సీహెచ్ రాధికా రాణి, జి.బాబురావు, ఐవీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు పునర్నిర్మాణం చేసిన జీఎంఏ హాల్‌ను డాక్టర్ నందకిశోర్ ప్రారంభించారు.



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నందకిశోర్

యువత రక్తదానానికి ముందుకు రావాలి

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు (విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆమె పేర్కొన్నారు. గురువారం లక్ష్మీపురంలోని శ్రీచైతన్య ఐకాన్ క్యాంపస్‌లో సంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి 78వ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే మాధవి ప్రారంభించి ప్రసంగించారు. విద్యాసంస్థలు చదువుతోపాటు సమాజానికి ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీయం ఈమని దుర్గాప్రసాద్, డీన్ కిశోర్, చంద్రశేఖర్, సురేశ్, ఆంజనేయులు, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. నీడ్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో తలసేమియాతో బాధపడే వారి కోసం ఈ శిబిరాన్ని నిర్వహించారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

సచివాలయ వ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

● ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని జాకీర్ హుస్సేన్ నగర్ 9వ సచివాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. అటెండెన్స్ రిజిస్టర్, వివిధ సెక్రటరీల రిజిస్టర్ల నిర్వహణ పరిశీలించారు. సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సచివాలయ సిబ్బందికి క్రమశిక్షణ, సమయపాలన కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించబోమని స్పష్టం చేశారు.



సచివాలయంలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఆసక్తికరంగా జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు

గుంటూరు (తూర్పు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు, పురుషుల విభాగాల్లో స్థానిక బీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు గురువారం ఆసక్తికరంగా సాగాయి. తొలుత పోటీలను డీఎస్‌డీవో అఫ్రోజ్‌ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చైర్మన్ క్రిస్టోఫర్, ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు మాట్లాడుతూ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు డాక్టర్ స్వర్ణలత పాల్గొని విజేతలకు పతకాలు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కేల్ ఇండియా కోచ్ చిరంజీవి, బీఆర్ స్టేడియం ఫెన్సింగ్ కోచ్ సంగీత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో అఫ్రోజ్ ఖాన్

వైభవంగా శ్రీ పుష్పయాగం

గుంటూరు (తూర్పు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గురువారం శ్రీవారికి పుష్పయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. కొండబోలు శివరామప్రసాద్, ఉమాశంకర్ దంపతుల సౌజన్యంతో వేదపండితులు వివిధ రకాల 500 కేజీల పుష్పాలతో యాగం నిర్వహించారు. సాహితీవేత్త నారాయణం ప్రసాదాచార్యులు కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భక్తుల అధిక సంఖ్యలో పుష్పయాగంలో పాల్గొన్నారు.



స్వామి వారికి పుష్పయాగం చేస్తున్న వేద పండితులు

కదిలే బొమ్మల కొలువు



ద్విచక్ర వాహనంపై రంగు రంగుల బొమ్మల కొలువేంటి అని అనుకుంటున్నారా.. ఈ వ్యక్తి నిత్యం తన వాహనంపై బొమ్మలు పెట్టుకొని విక్రయించడానికి వెళ్తాడు. ఇందులో దేవుళ్ల బొమ్మలతోపాటు అనేక బొమ్మలుంటాయి. ఇంట్లో షోకేసుల్లో పెట్టుకునేందుకు వీలుగా వీటిని అందంగా తయారు చేసి విక్రయిస్తుంటాడు.

- గుంటూరు, ఆంధ్రజ్యోతి

రోడ్డుపైనున్న వృద్ధ మహిళ ఆశ్రమానికి తరలింపు

తెనాలి అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాలాజీరావుపేటలో రహదారి మార్జిన్‌పై ఉంటున్న వృద్ధ మహిళను తహసీల్దార్ గోపాలకృష్ణ ఆశ్రమానికి తరలించారు. ఆరేడు నెలలుగా ఓ మహిళ రోడ్డు వెంటే ఉండటాన్ని స్థానికులు గుర్తించి ఆమె గురించిన వివరాలపై ప్రశ్నించినా ఏమీ చెప్పలేకపోతోంది. తహసీల్దార్‌కు సమాచారం అందించడంతో ఆయన సిబ్బందితో మానసిక స్థితి సరిగా లేకపోవడం గుర్తించి పొన్నూరులోని కరుణా నిలయం ఆశ్రమానికి తరలిస్తున్నట్లు తహసీల్దార్ చెప్పారు.

మరణించిన బాలుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం

పెదకాకాని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాల్వలోపడి మరణించిన బాలుడి తల్లిదండ్రులకు ప్రభుత్వం అందించిన ఎక్స్‌గ్రేషియా చెక్కును ఎమ్మెల్యే నరేంద్రకుమార్ గురువారం అందజేశారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామం విజయ్ భాస్కర్ నగర్ ఏరియాకు చెందిన 8వ తరగతి విద్యార్థి నేలపాటి భరత్ (14) వరదల సమయంలో ప్రమాదవశాత్తూ కాల్వలో పడి మరణించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రభుత్వం తరపునుంచి వచ్చిన ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెక్కును భరత్ తల్లిదండ్రులు నేలపాటి సురేబాబు, నేలపాటి ఈశ్వరు రాణిలకు అందించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏ ఆపద వచ్చిన ఆదుకుంటూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్ మండల పార్టీ అధ్యక్షుడు మురళి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

అయ్యప్ప దీక్ష కఠినమైన ఆధ్యాత్మిక వ్రతం

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు (తూర్పు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష ఒక కఠినమైన ఆధ్యాత్మిక వ్రతమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. గుంటూరు రూరల్ మండలం నల్లపాడు శ్రీనివాస కాలనీ శ్రీ ధర్మ శాస్త్ర దేవస్థానంలో గురువారం శ్రీరామ్ వర్క్ అండ్ సప్లై వెంగళయపాలెం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు సద్ది కార్యక్రమం జరిగింది. పూజా కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ, అయ్యప్ప దీక్ష ద్వారా క్రమశిక్షణ, ఓర్పు, త్యాగం వంటి గుణాలను పెంపొందించుకోవచ్చని అన్నారు. మంచి క్రమశిక్షణ, దైవభక్తి, ఆధ్యాత్మికత అలవడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కల్లూరి శ్రీనివాసరావు, కల్లూరి అవినాష్, వెంకటేశ్వరరావు, కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



స్వాములకు హరతిని అందజేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజినేయులు

అధరగొడుతున్నాయి..

● కొండెక్కిన కూరగాయల ధరలు ● వర్షాలతో ఒక్కసారిగా పెరుగుదల

గుంటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల జోరు వర్షాల ప్రభావం కూరగాయల ధరలపైన పడింది. పది రోజుల వ్యవధిలోనే ధరలు పెట్టింపవడం సామాన్యులకు వణుకు పుట్టిస్తున్నాయి. బెండ, దొండ కాయల ధరలు కేజీ గతంలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.60కు చేరుకొన్నాయి. ఇక క్యారెట్ రూ.100కు చేరుకుంది. ఇక వంకాయ ధర రూ. 40 నుంచి రూ. 80కి జంప్ అయ్యింది. ఇక పెద్ద చిక్కుళ్లు ధర కన్నీళ్లొస్తున్నాయి. కేజీ రూ. 120 అంటే సామాన్యులు నోరెళ్ల బెట్టాల్సి వస్తోంది. బంగాళదుంప, పచ్చి మిర్చి సాధారణంగానే రూ.40ల నుంచి రూ. 50లకు విక్రయిస్తున్నారు. ఒక ములక్కాయ ఒకటి రూ. 20 చెబుతున్నారు. టమాటా ధరలు కాస్త దిగి వచ్చాయి. మొన్నటి వరకు కిలో రూ.70 నుంచి రూ.80ల వరకు విక్రయించిన వ్యాపారులు ప్రస్తుతం రూ.40కి అమ్ముతున్నారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని కూరగాయల వ్యాపారి రాపోలు మల్లికార్జునరావు తెలిపారు. పెద్ద మార్కెట్లలలోనే.. ధరలు ఇలా ఉంటే ఇక చిల్లర దుకాణాల్లో కూరగాయల ధరలు మరింత అధరగొడుతున్నాయి. కేజీ రూ. 60 ఉన్న బెండ, దొండ కాయలను అరకేజీనే రూ.50వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. వరుసగా జోరు వర్షాల ప్రభావంతో రైతు బజారుల్లోనూ కూరగాయల ధరలు కొంత మేర పెరిగాయి. వంకాయ ధర కిలో రూ.50 పైనే విక్రయిస్తున్నారు. బెండ, దొండ కాయలు కిలో రూ.40లపైనే ధర పలుకుతున్నాయి. క్యారెట్ రూ.80పైనే విక్రయిస్తున్నారు. గోరుచి క్కుడు ధర రూ.50 పైనే ఉంది. ఇక మిగతా కూరగాయల ధరలు సాధారణ ధరలతోనే విక్రయాలు జరుగుతున్నాయి.



నేటి నుంచి బాలల పండుగ

- వీవీఐటీయూ బాలోత్సవ్‌కు సర్వం సిద్ధం
- వేడుకలకు వర్సిటీ ప్రాంగణంలో 32 వేదికలు



బాలోత్సవంలో పాల్గొనేందుకు తరలివస్తున్న విద్యార్థులు

పెదకాకాని, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వీవీఐటీయూ బాలోత్సవ్-2025కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణం సిద్ధమైంది. ప్రఖ్యాతిగాంచిన బాలోత్సవ్ వేడుకలు శుక్రవారంనుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 650 పాఠశాలల నుంచి 13 వేల మంది విద్యార్థులు ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారు. 20 అంశాలు, 61 విభాగాల్లో పోటీలు నిర్వహించేందుకు వీవీ ఐటీయూ ప్రాంగణంలో 32 వేదికలను ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాలు, దూరప్రాంతాల నుంచి వచ్చే వి ద్యార్థులకు మార్గనిర్దేశం కోసం గుంటూరు, విజయవాడ బ స్టాండు, రైల్వేస్టేషన్లలో సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి.. యూనివర్సిటీకి చెందిన బస్సుల ద్వారా బాలోత్సవ్ ప్రాంగణానికి తరలించనున్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ల సమాచారం కోసం డాక్టర్ పుట్టా నాగేశ్వరరావు 9949001586 నంబరుకు సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

విద్యార్థుల వసతి కోసం..

వసతి కోసం ఇప్పటి వరకు 1,900 మంది బాలురు, 2,800 మంది బాలికలు నమోదు చేసుకోగా అదనంగా 1,500 మందికి వసతి కల్పించేందుకు.. బాలోత్సవ కమిటీ సన్నద్ధంగా ఉంది. వసతిని వినియోగించుకునే విద్యార్థులు దిండు, దుప్పట్లు, జనరల్ మెడిసిన్స్ తమ వెంట తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. వసతి కోసం 73862 25336 నంబరుకు సంప్రదించాల్సిందిగా సూచించారు. గుంటూరు, కృష్ణా జిల్లాల విద్యార్థుల కోసం వర్సిటీ బస్సులు 43 రూట్లలో అందుబాటులో ఉంచారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచిత వసతి, భోజనం సౌకర్యాలను కల్పించనున్నారు. ఆయా రంగాల్లో నిష్ణాతులైన నిపుణులను న్యాయనిర్ణేతలుగా నియమించి, పోటీలలో పాల్గొనే విద్యార్థులకు తగు సూచనలు అందించడం జరుగుతుంది. బాలోత్సవ్ ప్రాంగణంలో వర్సిటీకి చెందిన స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో 600 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవలను అందించనున్నారు. 180 మంది ఎన్‌సీసీ విద్యార్థులు రక్షణ, భద్రత కోసం కేటాయించారు. ప్రాథమిక చికిత్స అందించేందుకు.. పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ క్యాంపును నిర్వహించనుంది. గుంటూరు కిమ్స్, శ్రేష్ఠ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రం, ఆధునిక అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. విజేతలకు బహుమతులుగా కొండపల్లి విశిష్ట జోడు ఎడ్ల బొమ్మలను అందించనున్నట్లు వర్సిటీ ప్రో చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ వెల్లడించారు.



ఆప్కో వస్త్ర నిల్వలతో నూతన డిజైన్లు

- ఫ్రాగ్‌లు, రెడీమెడ్ చీరలు, పంచెలు, క్యారీబ్యాగ్‌ల తయారీ
- స్టాక్ అమ్మకాలతోపాటు మహిళలకు ఉపాధి
- మంగళగిరిలో ఆప్కో గోదాం తనిఖీ చేసిన మంత్రి సవిత



మంగళగిరి ఆప్కో గోదాములోని స్టాకును పరిశీలిస్తున్న మంత్రి సవిత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి సిసోడియా

మంగళగిరి సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆప్కో గోదాముల్లోని చేనేత వస్త్ర నిల్వలతో నూతన డిజైన్లను అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామ పరిధిలోని ఆప్కో గోదాంను గురువారం చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములోని స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూ.15 కోట్ల విలువైన వస్త్ర నిల్వలు ఉన్నాయని ఆప్కో మేనేజర్ మనోజ్‌కుమార్ తెలిపారు. 96 ఆప్కో షోరూంలకు గాను 93 షోరూంల నుంచి రూ.13.48 కోట్లకు పైగా స్టాక్ వెనక్కి తెప్పించామని, మిగిలిన మూడు షోరూంల నుంచి త్వరలోనే స్టాకు రానుందని చెప్పారు. వస్త్ర నిల్వలను పరిశీలించిన మంత్రి సవిత ఆయా వస్త్రాలను గ్రేడింగ్ చేసి విభజించాలని, డ్యామేజీలేని వస్త్రాలను రీసేల్‌కు పంపించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక రిబేటుపై విక్రయించాలని సూచించారు. అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ గోదాముల్లోని వస్త్ర నిల్వలతో ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా చిన్నారుల ఫ్రాగ్‌లు, రెడీమెడ్ చీరలు, పంచెలు, క్యారీ బ్యాగులు తయారు చేస్తున్నామని చెప్పారు. తద్వారా స్టాకును విక్రయించడంతోపాటు చేనేత మహిళలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఇందుకోసం కొందరు డిజైనర్లను నియమించామని, వారితో మహిళలకు రెడీమేడ్ దుస్తులు, క్యారీబ్యాగుల తయారీలో శిక్షణ అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆప్కో గోదాములు, షోరూముల్లో ఉన్న స్టాకును వీలైనంత త్వరగా విక్రయాలు జరపాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. రాజకీయ ఉనికి కోసమే జగన్ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ రైతులు, బీసీల గురించి జగన్ ఆలోచన చేయలేదని, తుఫాను బాధితులను పరామర్శించిన దాఖలాలు లేవని విమర్శించారు. బీసీలను తీవ్రంగా వేధించిన వ్యక్తి జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అసమర్థ పాలనను విమర్శించినందుకు ఎంతో మంది బీసీ నేతలపై తప్పుడు కేసులు బనాయించి, జైల్లో అక్రమంగా బంధించారని ఆరోపించారు. కల్తీ మద్యం కేసులో జోగి రమేష్ అరెస్టుతో జగన్‌కు బీసీలు గుర్తుకొచ్చారని, బీసీ కార్డుతో జగన్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాడని, ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని మంత్రి సవిత అన్నారు.

వీరాంజనేయునికి 38 కేజీల వెండి ఆభరణాలు

- బహూకరించిన దాత శరవణ నరేంద్రకుమార్
- ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ద్వారా ఆలయానికి అందజేత

పొన్నూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన వీరాంజనేయస్వామి ఆలయానికి గుంటూరుకు చెందిన ఓ భక్తుడు 38 కేజీల వెండి ఆభరణాలను గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ హాజరయ్యారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా గుంటూరుకి చెందిన దాత శరవణ నరేంద్రకుమార్ 38.282 కేజీల వెండి ఆభరణాలను దేవాలయ అధికారులకు అందజేశారు. ఇందులో స్వామికి 8.244 కేజీల హారం, 3.497 కేజీల నాన్‌తాడు, నామం, కళ్లు, యజ్ఞోపవీతం, 4.778 కేజీల తమల పాకులు, 5.388 కేజీల మకరతోరణం, ఉత్సవమూర్తి కిరీటాలు, గంట, 3.243 కేజీల సీతారాముల విగ్రహాలు ఉన్నాయి. అనంతరం ఎమ్మెల్యే నరేంద్రకుమార్.. దాత శరవణ నరేంద్రకుమార్, జయలక్ష్మి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయం విశిష్ట ప్రాశస్త్యం కలిగి ఉందన్నారు. ఎందరో దాతలు సమకూర్చిన విరాళాలను ఆలయ అభివృద్ధికి వినియోగించేందుకు పాటుపడినట్లు తెలిపారు.ఆలయానికి ఇప్పటికే ఆదాయం పెరిగిందని మరింత ఆదాయం పెరిగేలా నూతన పాలకవర్గం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ జీఎంఎస్ గుప్తా, ఈవో గద్దె వెంకట అమర్‌నాథ్, మాజీ చైర్మన్ చీమకుర్తి నాగభూషణరావు, కూటమి పార్టీల నాయకులు, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



గుంటూరు భక్తుడు శ్రీ వీరాంజనేయ స్వామికి సమర్పించిన వెండి ఆభరణాలు



ఎమ్మెల్యే నరేంద్ర సమక్షంలో దేవాదాయ శాఖ అధికారులకు ఆభరణాలు అప్పగిస్తున్న భక్తుడు నరేంద్ర కుమార్

త్వరలో కౌశలం పరీక్షలు

- అన్ని కంపెనీలకు ఒకే ప్రశ్న పత్రం
- ఆన్‌లైన్ ద్వారా ఇంటి పన్ను వసూలు
- డీఎల్‌పీఓ పద్మ



వేమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం ప్రవేశ పెట్టిన వర్క్ ఫ్రం హోం (కౌశలం) విధానాన్ని అమలు చేసేందుకు త్వరలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించనుందని రేపల్లె డివిజన్ పంచాయతీరాజ్ శాఖ అధికారి పద్మ తెలిపారు. గురువారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. రేపల్లె డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో 175 గ్రామ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం 29,024 మంది నిరుద్యోగ యువత ఉండగా.. వర్క్ ఫ్రం హోమ్ సర్వే ఆధారంగా 17,861 మంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. ఉద్యోగం చేస్తూ రిజిస్టర్ చేయించుకునేందుకు 340 మంది నిరాకరించారని, 1,131 మంది సర్వేలో తమ పేర్లను పొందుపరిచేందుకు ఆమోదం తెలపలేదని వెల్లడించారు. 14 మంది మృతి చెందగా.. 9,678 మంది అందుబాటులో లేని కారణంగా సర్వే జాబితాలో వారిని చేర్చలేకపోయామన్నారు. ఇటీవల కాలంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 3,759 మంది పేర్లనూ ఆన్‌లైన్‌లో పొందుపరిచామని వివరించారు. రిజిస్టర్ అయిన వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా త్వరలో పరీక్ష నిర్వహిస్తుందని, అన్ని కంపెనీలకు చెందిన ఒకే పరీక్ష పేపర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పేపర్‌ను అన్ని కంపెనీలకు పంపి ప్రభుత్వమే వాటిని ఫైనల్ చేస్తుందన్నారు. ప్రభుత్వం పరీక్ష తేదీ ప్రకటించిన అనంతరం.. ఆన్‌లైన్ పాస్‌వర్డ్ లాగిన్ చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దాని ద్వారా పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఇంకా ఎవరైనా ఆసక్తి ఉంటే.. పేర్లు రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు.

ఆన్‌లైన్ విధానంలో ఇంటి పన్ను

స్వర్ణ పంచాయతీ టైటిల్‌పై పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఇంటి పన్ను వసూలు విధానాన్ని ఏడాది నుంచి అమలులోకి తీసుకు రావడం జరిగిందని డీఎల్‌పీఓ తెలిపారు. డివిజన్‌లోని 175 పంచాయతీల్లో ఈ విధానం నూరుశాతం అమలు చేసేందుకు ఇంటి యజమాని పేరు, మొబైల్ నంబర్‌కు నంబర్లకు అనుసంధానం చేస్తూ వార్డుల వరుస క్రమంలో ఆన్‌లైన్ చేశామన్నారు. డిమాండ్ నోటీసులను కూడా మొబైల్ నంబర్లకు పంపుతున్నామని చెప్పారు. డివిజన్‌లో 1,24,152 గృహాలు ఉన్నాయన్నారు. పాత బకాయి రూ.1.09 కోట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి వసూలు చేయాల్సిన రూ.8 కోట్లు వెరశి రూ.9.09 కోట్లకు రూ.20 లక్షల పన్ను మాత్రమే వసూలు చేయడం జరిగిందన్నారు.

పసుపు ధరలు పైపైకి...

- నాలుగు నెలల్లో క్వింటాల్‌కు రూ.4వేలు పెరుగుదల

దుగ్గిరాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పసుపు ధర అనూహ్యంగా రెండు రోజుల్లో వ్యవధిలో క్వింటాకు రూ.2 వేలు పెరిగింది. బంగారం కంటే వేగంగా వారంలో రూ.4 వేల పెరుగుదల నమోదైంది. గత శుక్రవారం జరిగిన వేలంలో క్వింటా గరిష్ఠ ధర రూ.12,500 వరకు పలకగా సోమవారం ఒక్కసారిగా రూ. 13,900కు పెరిగింది. గురువారం తక్కువ సంఖ్యలో విక్రయాలు జరిగినప్పటికీ క్వింటా రూ.12,500 లెక్కన కొనుగోళ్లు జరిగాయి. రెండేళ్ల క్రితం రూ.14 వేలుగా ఉన్న పసుపు ధర క్రమేపీ.. క్షీణిస్తూ, గరిష్ఠంగా రూ.9వేలు, కనిష్ఠంగా రూ.7 వేలకు దిగజారింది. వ్యాపారులు సైతం నష్టాల బాటపట్టారు. రైతులు ఒక దశలో ఎకరాకు రూ.75వేల వరకు నష్టపోయారు. వరుసగా వరదలు, తుఫాన్‌లతో సతమతమైన పసుపు రైతుకు పెరుగుతున్న పసుపు ధరలు ఒకింత ఊరటనిస్తున్నాయి.

దెబ్బతిన్న పసుపు పంట

ఏడాదిలో ఒక పర్యాయమైనా వస్తున్న వరద లంక గ్రామాల్లో పసుపు దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ వచ్చాయి. దీంతో రైతులు పసుపు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లడంతో సాగువిస్తీర్ణం కూడా తగ్గింది. ధరలు పూర్తిగా పతనం కావడంతో.. దుగ్గిరాల యార్డుకు అధికంగా పసుపు తీసుకు వచ్చే కొల్లూరు, కొల్లిపర, దుగ్గి రాల మండలాల పరిధిలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఏటికేడు ధర పెరు గుతుందని రైతు ఎదురు చూసినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరికి కోల్డ్ స్టోరేజీలు, గోదాముల్లో రైతులు, వ్యాపారులు నిల్వ ఉంచిన పసుపును క్వింటాల్‌కు రూ.4 వేలు నష్టానికి కూడా తెగనమ్ముకోవాల్సి వచ్చింది. పంటపై రుణాలు తీసుకున్న రైతులకు నోటీసులు రావడంతో సగం ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది.

తగ్గిన దిగుబడి..పెరిగిన ధర

ఆగస్టులో క్వింటాల్ రూ.8 వేలున్న పసుపు ధర రెండు నెలల్లో రూ.6వేలు పెరిగి రూ.13 వేలకు చేరువకావడంతో 2010 నాటి పూర్వవైభవం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వర్షాలకు పసుపు పంట చాలాచోట్ల దెబ్బతినడంతో 2026 ఏప్రిల్ సీజన్‌కి.. ఎగుమతి అవసరాలకు సరిపడా పసుపు దిగుబడి మార్కెట్‌కు వచ్చే అవకాశం లేనందునే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.



పసుపు కొమ్ములు, కాయను గ్రేడింగ్ చేస్తున్న మహిళా హమాలీలు

బెల్ట్ షాపులు లేకుండా నిర్మూలించాలి

- అధికారులను ఆదేశించిన ఎక్సైజ్ శాఖ గుంటూరు డీసీ శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పల్నాడు జిల్లాలలో మద్యం బెల్టు షాపులు లేకుండా నిర్మూలించాలని ఎక్సైజ్ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఎక్సైజ్ శాఖ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే శ్రీనివాసులు మాట్లాడుతూ వైన్ షాపులు, బార్లు నిబంధనలు పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమయానికి షాపులు మూయడం, సమయ పాలన పాటించే విధంగా చూడాలన్నారు. మద్యం దుకాణాలలో ఎటువంటి వైలేషన్ లేకుండా చూడాలని ఆదేశించారు. అన్ని మద్యం సీసాలను స్కానింగ్ చేసి మాత్రమే అమ్మవలసిందిగా సూచించారు. కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు జిల్లాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.


రాజ్‌భవన్ నిర్మాణానికి టెండర్లు

- నమూనా విడుదల చేసిన ఏపీసీఆర్‌డీఏ
- రూ. 162.40 కోట్ల అంచనావిలువతో నోటిఫికేషన్
- 12 నెలల్లో నిర్మాణానికి గడువు విధింపు

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో గవర్నర్ నివాసం (రాజ్‌భవన్) నిర్మాణానికి ఏపీసీఆర్‌డీఏ వేగం పెంచింది. తాజాగా డిజైన్, లేఅవుట్‌ని విడుదల చేస్తూ టెండర్ నోటిఫికేషన్‌ని విడుదల చేసింది. సువిశాలంగా నిర్మించబోయే రాజ్‌భవన్‌కు రూ. 162.40 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేసి టెండర్లు పిలిచింది. 12 నెలల (ఏడాది) వ్యవధిలోనే పనిని పూర్తి చేయాలన్న షరతుని విధించింది. స్పెషల్ క్లాస్ సివిల్ రిజిస్ట్రేషన్ సంస్థలకే టెండర్లలో పాల్గొనే అర్హత కల్పించింది. మూడు నెల్లో టెండర్ల ప్రక్రియని ఖరారు చేసి ఏజెన్సీని ఎంపిక చేసిన తర్వాత పనులను ప్రారంభింప చేయనుంది. దీంతో అటు ప్రైవేటు, ఇటు ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు రాజధానిలో వేగవంతంగా అడుగులు పడుతున్నాయి.

ఏ రాష్ట్రంలోనైనా రాజ్‌భవన్ తలమానికంగా ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో రాజ్ భవన్ ఉండేది. రాష్ట్రం విడిపోయాక విజయవాడలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అక్కడి నుంచే ఇప్పటివరకు నియామకం పొందిన గవర్నర్లు కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. అయితే అమరావతి రాజధానిలో శాశ్వత రాజ్‌భ వన్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గవర్నర్ మ్యాన్షన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ ఆఫీసు, రెండు అతిథిగృహాలు, ఆరు ఆఫీసర్ క్వార్టర్లు, 10 సీనియర్ స్టాఫ్ క్వార్టర్లు, 12 జూనియర్ స్టాఫ్ క్వార్టర్స్, 40 సపోర్టింగ్ సిబ్బంది నివాసాలు, 20 బరాక్స్, 144 బరాక్ వసతి, సరిహద్దు ప్రహరీగోడ, నాలుగు సెంట్రీ పోస్టులు వంటివి ఈ రాజ్‌భవన్‌లో నిర్మించనున్నారు. గ్రాండ్ లాన్ కూడా పచ్చదనం కోసం ఏర్పాటు చేస్తారు. సువిశాలమైన పార్కింగ్ స్థలాలు అభివృద్ధి చేస్తారు. అంతర్గత రోడ్లు కూడా విశాలంగా నిర్మిస్తారు.

ఈ రాజ్‌భవన్ దేశంలోని ఇతర రాష్ట్రాల గవర్నర్ల నివాసాలను తలదన్నేలా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీనికి సంబంధించిన లేఅవుట్, డిజైన్(ఫ్రంట్, బ్యాక్ ఎలివేషన్)లను టెండర్ నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. రాజ్‌భవన్ నిర్మాణం పూర్తి అయితే అమరావతి రాజధానికి కొత్త సొబగులను అద్దుతుంది. గవర్నమెంట్ కాంప్లెక్స్‌కు సమీపంలోనే దీనిని నిర్మిస్తారని అధికారవర్గాలు తెలిపాయి.



రాజ్‌భవన్ నమూనా

శబరిమల యాత్రకు ప్రత్యేక రైళ్లు

- నేటి ఉదయం 8 గంటల నుంచి బుకింగ్ ప్రారంభం

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు, జనవరి నెలల్లో శబరిమల యాత్రకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం గుంటూరు మీదగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లన్నింటికి శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభమవుతాయన్నారు.

- 07103 మచిలీపట్నం - కొల్లం స్పెషల్ డిసెంబరు 5, 12, 19, జనవరి 9, 16 తేదీల్లో(శుక్రవారం) ఉదయం 11 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.15కి గుంటూరు, 2.58కి నరసరావుపేటకు చేరుకుంటుంది.
- 07104 కొల్లం - మచిలీపట్నం స్పెషల్ డిసెంబరు 7, 14, 21, జనవరి 11, 18 తేదీల్లో(ఆదివారం) వేకువ జామున 2.30 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 7.03కి నరసరావుపేట, 8.05కి గుంటూరు, మధ్యాహ్నం 12.30కి మచిలీపట్నం చేరుకొంటుంది.
- 07107 చర్లపల్లి - కొల్లం స్పెషల్ నవంబరు 17వ తేదీ నుంచి జనవరి 19 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి 2.47కి నడికుడి, 3.08కి పిడుగురాళ్ల, 3.37కి సత్తెనపల్లి, 5.20కి గుంటూరు, 6.50కి తెనాలి చేరుకుటుంది.
- 07108 కొల్లం - చర్లపల్లి స్పెషల్ ఈ నెల 19 నుంచి జనవరి 21 వరకు ప్రతి బుధవారం వేకువజామున 2.30 గంటలకు బయలుదేరి గురువారం వేకువజామున 3.57కి గుంటూరు, 5.12కి సత్తెనపల్లి, 5.38కి పిడుగురాళ్ల 6.01కి నడికుడి, ఉదయం 10.30కి చర్లపల్లి చేరుకొంటుంది.

ఇవేకాకుండా తెనాలి, బాపట్ల, చీరాల మార్గంలో 07101 మచిలీపట్నం - కొల్లం నవంబరు 14 నుంచి జనవరి 2వ తేదీ వరకు ప్రతి శుక్రవారం, 07102 కొల్లం - మచిలీపట్నం స్పెషల్ నవంబరు 16 నుంచి జనవరి 4వ తేదీ వరకు ప్రతి ఆదివారం ప్రయాణిస్తాయి. నవంబరు 16 నుంచి జనవరి 18 వరకు ప్రతి ఆదివారం 07105 నరసపూర్ - కొల్లం, నవంబరు 18 నుంచి జనవరి 20 వరకు ప్రతి మంగళవారం 07106 కొల్లం - నరసపూర్ స్పెషల్స్ కూడా తెనాలి, బాపట్ల, చీరాల మీదగా ప్రయాణిస్తాయి.



జస్టిస్ రవినాథ్ తిల్హరికి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో మూర్తి

చిన్న వెంకన్న సేవలో జస్టిస్ రవినాథ్ తిల్హరి

ద్వారకాతిరుమల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో కొలువైన చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి గురువారం రాత్రి దర్శించారు. కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీవీఐటీయూ నేటి నుంచి బాలోత్సవ్

పెదకాకాని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీయూ బాలోత్సవ్ 2025 సాంస్కృతిక ఉత్సవాలకు గుంటూరు సమీపంలోని నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నొలిజికల్ యూనివర్సిటీ ప్రాంగణం సిద్ధమైంది. శుక్రవారం నుంచి మూడు రోజులు జరిగే వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు తరలివస్తున్నారు. బాలోత్సవ్‌లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 650 పాఠశాలల నుంచి 13000 మంది విద్యార్థులు ఇప్పటికే నమోదు చేసుకున్నారు. 20 అంశాలు, 61 విభాగాలలో పోటీలు నిర్వహించేందుకు 32 వేదికలను ఏర్పాటు చేశారు.

అంగ ప్రదక్షిణ టోకెన్ల లక్కీడిప్‌కు స్వస్తి

- 'ముందు దరఖాస్తు చేసుకున్న వారికి ముందు' విధానంలో కేటాయింపు

తిరుమల, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి అంగ ప్రదక్షిణ (పొర్లుదండాలు) టోకెన్ల జారీలో లక్కీడిప్ పద్ధతికి టీటీడీ స్వస్తి పలుకుతోంది. ఆన్‌లైన్‌లో ముందుగా దరఖాస్తు చేసుకున్నవారికి ముందుగా (ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్) కేటాయించే పద్ధతిని ఇక నుంచి అనుసరిస్తారు. ప్రస్తుతం జనవరి నెలదాకా అంగప్రదక్షిణ టోకెన్లు కేటాయించేశారు. ఫిబ్రవరి కోటా నుంచి కొత్త విధానం అవలంబిస్తారు.

అవిభక్త కవల పాములు!



ఇవి నాగజెర్రి రకానికి చెందిన అవిభక్త కవల పాములు. ఈ రెండు పాములకు కలిపి ఒకే తోక ఉంది. గురువారం ఉదయం శ్రీకాకుళం జిల్లా పలాస సమీప అంబుసోలి గ్రామంలో ఇవి కనిపించాయి. వీటిలో ఒక పాము రోడ్డు దాటుతుండగా.. మరొకటి దాన్ని అనుసరి స్తోంది. స్థానికులు వీటిని మెల్లగా పొదల్లోకి పంపించారు. పాముల్లో అవిభక్త కవలలు ఉండటం చాలా అరుదు అని పశుసంవర్ధకశాఖ సంచాలకుడు డాక్టర్ మట్ట రవికృష్ణ చెప్పారు. ఒక పిండంలో రెండు పాములు ఉన్నప్పుడు ఇలాంటివి జరుగుతుంటాయన్నారు. -ఆంధ్రజ్యోతి, పలాస



నీళ్లన్నీ పోవడంతో ఖాళీ అయిన రాయలచెరువు



రాయలచెరువు కట్టతెగడంతో కళత్తూరు దళితవాడలో మిద్దెలపైకి ఎక్కిన జనం

కన్నీటి సుడి.. గండి

55 పశువులు మృతి, మరో 800 గల్లంతు.. కూలిన మూడు ఇళ్లు, 90 విద్యుత్ స్తంభాలు

- గంటన్నరపాటు పది అడుగుల ఎత్తున ప్రవాహం
- నీటిలో కొట్టుకుపోయిన సామగ్రి, వాహనాలు
- తిరుపతి జిల్లా కళత్తూరు దళితవాడలో విధ్వంసం
- అరగంట ముందు హెచ్చరికలతో తప్పిన ప్రాణనష్టం
- సర్వస్వం కోల్పోయిన దళిత కుటుంబాలు

తిరుపతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం ఓఊరు రాయలచెరువుకు గండి పడి అపార ఆస్తినష్టం సంభవించింది. అరగంట ముందు అందిన హెచ్చరికలతో ప్రాణనష్టం మాత్రం తప్పింది. దూసుకొచ్చిన జలప్రవాహానికి కళత్తూరు దళితవాడవాసులు సర్వస్వం కోల్పోయారు. గురువారం ఉదయం గంటన్నర పాటు పది అడుగుల ఎత్తున కొనసాగిన నీటి ప్రవాహానికి ఇళ్లలోని ధాన్యం సహా వస్తువులు, పశువులు, వాహనాలు కొట్టుకుపోయాయి. మూడు ఇళ్లు, సుమారు 90 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. 55 పశువులు మృతి చెందాయి. మరో 800కు పైగా పశువులు ప్రవాహంలో గల్లంతయ్యాయి. ఇళ్లలోనూ, వీధుల్లోనూ బురద, కొట్టుకొచ్చిన ముళ్లకంపలు, పశువుల కళేబరాలతో ఊరంతా బీభత్సంగా మారింది.

'మొంథా' సమయంలోనే చెరువుకట్ట బలహీనం!

158 ఎకరాల విస్తీర్ణం, 1,123 ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ చెరువు ఇటీవలి మొంథా తుఫాను సమయంలో పూర్తిగా నిండింది. ఆ సమయంలోనే చెరువు కట్ట బలహీనపడింది. నాడు కట్టపై బొగడ(రంధ్రం) పడగా గ్రామస్తులు, అధికారులు పూడ్చివేశారు. గురువారం తెల్లవారుజామున 6.30 గంటల సమయంలో చెరువు కట్టపై మళ్లీ బొగడ పడింది. రైతులు గుర్తించి సర్పంచ్‌కు, దిగువన ఉన్న గ్రామాలకు సమాచారం అందించారు. ఉదయం 7.20 గంటలకు కట్ట తెగిపోయింది. దీంతో అక్కడున్న వారు దిగువన నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తొలి గ్రామం కళత్తూరు దళితవాడ వాసులను ఫోన్ల ద్వారా అప్రమత్తం చేశారు. సామాన్లు, పశువుల కోసం చూడొద్దని, తక్షణం ప్రాణాలు కాపాడుకోవాలని హెచ్చరించారు. చెరువులో 88 అడుగుల ఎత్తు వరకూ నిల్వ వున్న 0.008 టీఎంసీల నీరు ఒక్కసారిగా వెలుపలికి ప్రవహించి కళత్తూరు దళితవాడను ముంచెత్తింది. అప్పటికే గ్రామస్థులు కొందరు ఎత్తైన ప్రదేశాలకు పారిపోగా మరికొందరు ఇళ్ల పైకి చేరుకున్నారు. ఉదయం 8 నుంచి 9.30 గంటల దాకా పది అడుగుల ఎత్తున ఉధృతంగా సాగిన నీటి ప్రవాహం.. తర్వాత తగ్గినప్పటికీ మరో అరగంట పాటు కొనసాగింది. గంటన్నర పాటు గ్రామస్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. చాలామంది రెండంతస్తుల సచివాలయ భవనంపైకి చేరుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. ప్రవాహ ఉధృతికి ఇళ్లలోని సామాన్లతోపాటు 413 గేదెలు, 421 పాడి ఆవులు, 121 కోళ్లు, పలు ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. రెండు పూరి గుడిసెలు, ఒక రేకుల ఇల్లు కూలిపోయాయి. ట్రాక్టర్లు, ఆటోలు, కాంక్రీట్ మిల్లర్లు తదితరాలు కూడా నీటి ఉధృతికి కొంత దూరం కొట్టుకుపోయాయి. పలు ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు 90కి పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. 26 ఆవులు, 16 గేదెలు, 13 మేకలు మృతి చెందాయి. చెరువు కింద వరి పొలాలు, సంపంగి తోటలు నీట మునగగా కళత్తూరు దళితవాడ పరిసరాల్లో పంటపొలాలన్నీ ఇసుక మేట వేశాయి. గ్రామస్థులు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. ఇళ్ల నిండా బురద పేరుకుపోయింది. వీధుల్లో ఎక్కడ చూసినా కూలిన ప్రహరీలు, విద్యుత్ స్తంభాలు, ప్రవాహానికి కొట్టుకొచ్చిన చెత్త, ముళ్ల కంపలు, పాడి పశువుల కళేబరాలు దర్శనమిస్తున్నాయి.



చెరువు నీరు ముంచెత్తడంతో చనిపోయిన పశువులు



ఇళ్లలోకి చేరిన చెరువు నీరు

అప్రమత్తం చేసినా ఆస్తినష్టం..

ఏ అర్ధరాత్రో చెరువు కట్ట తెగిఉంటే భారీగా జననష్టం సంభవించేది. ఉదయం కావడంతో రైతులు గమనించి అప్రమత్తం చేయడంతో ప్రాణనష్టం తప్పింది. ఇటీవలి తుఫాను సమయంలోనూ బొగడ పడడం, దాన్ని పూడ్చివేయడం వంటి ఘటనలతో వారు కట్ట తెగిపోతుందని ఊహించలేదు. దీంతో వస్తువులు, పశువులు, వాహనాలను వారు భద్రపరుచుకోలేదు. ఆస్తి నష్టం సంభవించింది. విజయవాడలో ఉన్న కలెక్టర్ వెంకటేశ్వర్ ఫోన్ ద్వారా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి గ్రామానికి పంపించారు. ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, వివిధ శాఖల అధికారులు మధ్యాహ్నం 12 గంటలకు దళితవాడ చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కలెక్టర్ కూడా హుటాహుటిన బయలుదేరి సాయంత్రానికి కళత్తూరు దళితవాడ చేరుకు సహాయక చర్యలను పర్యవేక్షించారు. చెరువు నీరంతా కాళంగి నదిలోకి చేరుతోంది. నదీ పరీవాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. రిజర్వాయర్ నిండితే గేట్లు తెరిచి నీటిని దిగువకు వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పరకామణి కేసులో సీఐడీ విచారణ ముమ్మరం

- తిరుమలలో పోలీసులు, విజిలెన్స్ అధికారులతో చర్చ
- పరకామణి, కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన
- వచ్చే నెల 2లోపు కోర్టుకు నివేదిక: డీజీ అయ్యన్నార్



తిరుమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీ కేసులో సీఐడీ అధికారుల బృందం తిరుమలలో విచారణ చేపట్టింది. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్, లీగల్ అడ్వైజర్ లక్ష్మణ్‌రావు, ఎస్పీ గంగాధరంతో కలిసి గురువారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. పోలీసులు, విజిలెన్స్ అధికారులతో మరోసారి కేసు గురించి చర్చించారు. హుండీ కానుకలు లెక్కించే పరకామణి భవనానికి చేరుకుని కానుకల విభజన, లెక్కింపు, నమోదు ప్రక్రియలను పరిశీలించారు. పరకామణిలోకి ఎంట్రీ, ఎగ్జిట్‌లను చూశారు. భద్రతా తనిఖీలు ఎలా చేస్తున్నారు? ఎవరికైనా మినహాయింపులు ఉంటాయా? ఎంత సమయం పరకామణిలో ఉండొచ్చు? వంటి అంశాలపై ఆరా తీశారు. అక్కడున్న సీసీ కెమెరాల పనితీరు, ఆ ఫుటేజ్‌ను పరిశీలించే పరకామణి కంట్రోల్ రూమ్‌నూ పరిశీలించారు. అక్కడ్నుంచి తిరుమలలోని పీఏసీ-4లో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకున్నారు. అక్కడ వీడియో వాల్‌పై వివిధ ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల లైవ్ ఫుటేజ్‌ను చూశారు. అలాగే పరకామణి కేసుకు సంబంధించి ప్రస్తుతమున్న వీడియో ఫుటేజ్‌కు అదనంగా ఏవైనా ఆధారాలున్నాయా అనే కోణంలో విచారించారు. కోర్టు ఆదేశాల మేరకు సీఐడీ అధికారులకు ఇప్పటికే విధులు కేటాయించామని డీజీ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. ఇందులో భాగంగానే హుండీ కానుకల లెక్కింపు పరకామణి భవనంతో పాటు సీసీ కెమెరాల ఫుటేజ్ ఉండే కమాండ్ సెంటర్‌ను పరిశీలించామన్నారు. సీసీటీవీ ఫుటేజ్‌ను మిగతా సభ్యులతో కలిసి సుదీర్ఘంగా విశ్లేషించామని తెలిపారు. మరికొన్ని ఆధారాలు, రికార్డులు సేకరిస్తున్నామని, డిసెంబరు 2 లోపు నివేదిక తయారు చేసి కోర్టుకు అందజేస్తామని చెప్పారు. ఇప్పటివరకు నిందితులను ఎవరినైనా గుర్తించారా అనే ప్రశ్నకు.. ఆధారాలన్నీ సేకరిస్తున్నామని, ఆధారం ఉంటేనే నిందితుడిగా రికార్డు చేస్తామని తెలిపారు. సీఐడీ బృందంతో పాటు విజిలెన్స్ వీఎస్వోలు రాంకుమార్, సురేంద్ర, డీఎస్పీ విజయ్‌శేఖర్ తదితరులు ఉన్నారు.

అనంతలో నేటి నుంచి రెవెన్యూ క్రీడోత్సవాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 7వ రెవెన్యూ క్రీడోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్నామని ఏపీ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 27 జట్లు 31 క్రీడాంశాల్లో పోటీ పడతాయని చెప్పారు. ఆర్డీటీ స్టేడియానికి గురువారం చేరుకున్న 27 జట్ల క్రీడాకారులతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం ఏర్పాట్లను బొప్పరాజు పరిశీలించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరగనున్నాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు హాజరవుతారని.. ముగింపు కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరవుతారని బొప్పరాజు తెలిపారు.

టీజీవీ కళాక్షేత్రానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

- ఒకే సంవత్సరంలో మూడుసార్లు లభించడంపై టీజీ వెంకటేశ్ హర్షం



టీజీ వెంకటేశ్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రం, మెడల్ అందజేస్తున్న ఆ సంస్థ ప్రతినిధి

కర్నూలు కల్చరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో కళలను, కళాకారులను ప్రోత్సహిస్తూ నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరారుతున్న టీజీవీ కళాక్షేత్రానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించడం అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఒకే ఏడాదిలో వరుసగా మూడుసార్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు కావడంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి.. గురువారం కర్నూలులోని టీజీ కార్యాలయంలో టీజీ వెంకటేశ్‌కు రికార్డు పత్రం, మెడల్ అందజేసి సత్కరించారు. ఈ ఘనత వెనుక కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య కృషి ఎంతో ఉందని టీజీ వెంకటేశ్ ఆయన్ను అభినందించారు.

తనయుడి చేతిలో తండ్రి హత్య

- చెల్లెలి వివాహ విషయమై వివాదం, చాకుతో గొంతు కోసి హత్య

రాజానగరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చెల్లెలి వివాహ విషయంలో వాగ్వాదం తలెత్తి ఓ యువకుడు తండ్రిని హత్య చేశాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న వడిశెల అప్పారావు(47)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె ప్రశాంతికి ధవళేశ్వరానికి చెందిన వ్యక్తితో పెళ్లి సంబంధం తీసుకురాగా, అతనికి ఆమె దగ్గరైంది. అయితే కట్నం ఎక్కువ అడుగుతుండడంతో తన దగ్గర అంత డబ్బు లేదని, మరో సంబంధం చూద్దామని కుటుంబ సభ్యులతో కొద్ది రోజులుగా చెబుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ప్రశాంతి ఇంటికి ఆలస్యంగా రావడంతో అప్పారావు ఆమెను దూషించాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న తండ్రిని సాయికుమార్ అడ్డుకున్నాడు. గొడవ పెద్దదై తండ్రిని గెంటివేయడంతో అతని తల గోడకు బలంగా తగులుకుని కింద పడిపోయాడు. కాయగూరలు కోసే చాకుతో తండ్రి పీక కోసి పరారయ్యాడు. ఈ విషయాన్ని ప్రశాంతి సమీపంలో ఉంటున్న మేనత్తకు ఫోన్‌లో సమాచారం అందించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి రైతుల్ని ఆదుకోవాలి

- కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రికి అచ్చెన్నాయుడు లేఖ

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి రైతుల్ని ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు గురువారం కేంద్ర టెక్స్ టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు అచ్చెన్నాయుడు లేఖ రాశారు. 'ఏపీలో 2025-26 ఖరీఫ్‌లో 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగవ్వగా, సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేశాం. కానీ మొంథా తుఫాన్ వల్ల పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. రాష్ట్ర ప్రభుత్వ సీఎం యాప్, ఆధార్ ఆధారిత ఈ-పంట వ్యవస్థ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టాం. అయితే రైతుల సౌలభ్యం కోసం కాపాస్ కిసాన్ యాప్ నుంచి సీఎం యాప్‌కు రైతు వివరాలు రియల్ టైమ్‌లో సమన్వయం అయ్యేలా చూడాలి. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తేమ శాతం 12 నుంచి 18 శాతం వరకు ఉన్న పత్తిని కూడా అనుపాత తగ్గింపులతో కొనుగోలు చేయాలి. ఈ వర్షాలకు తడిసిన, రంగుమారిన పత్తిని కూడా తగిన ధర తగ్గింపులతో కొనుగోలు చేయాలి. విపత్తుతో నష్టపోయిన రైతుల్ని ఆదుకోవడంతో కేంద్రం తక్షణ సహకారం అందించాలని' అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో తనిఖీలు

- 300 మంది విద్యార్థులకు అస్వస్థతపై ప్రభుత్వం చర్యలు
- నివేదిక ఇవ్వాలని గుంటూరు కలెక్టర్‌కు ఆదేశం
- ఆరుగురితో విచారణ కమిటీని నియమించిన కలెక్టర్
- హుటాహుటిన యూనివర్సిటీకి చేరుకున్న కమిటీ



ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో తనిఖీలు చేస్తున్న విచారణ కమిటీ

మంగళగిరి/గుంటూరు(విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీ తనిఖీలు నిర్వహించింది. నాలుగు రోజుల కిందట హాస్టల్‌లో నాసిరకం ఆహారాన్ని భుజించి 300 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా మారడంతో వారిని మంగళగిరిలోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి గోప్యంగా చికిత్స చేయిస్తున్నారు. దీంతో విద్యార్థులు బుధవారం నుంచి వర్సిటీలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఎస్‌ఆర్‌ఎంలో పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నట్టు వార్తలు వెలువడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం వర్సిటీకి చేరుకున్నారు. మరోవైపు ఆందోళనకు దిగిన విద్యార్థులను వర్సిటీ పీఆర్వో వేణుగోపాల్ పలురకాలుగా బెదిరిస్తున్నట్టు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గతంలోనూ రెండుసార్లు ఎస్‌ఆర్‌ఎంలో ఈ తరహా ఘటనలు చోటుచేసుకున్నాయి. అయితే విషయం బయటకు పొక్కకుండా విద్యార్థులను యాజమాన్యం అదిలించి, బెదిరించి తమ దారికి తెచ్చుకుందనే ఆరోపణలున్నాయి. ఎస్‌ఆర్‌ఎంలో ఉద్రిక్త పరిస్థితుల సమాచారాన్ని అందుకున్న ప్రభుత్వం వెంటనే స్పందించింది. వర్సిటీలో అసలు ఏం జరుగుతుందో సవివరంగా నివేదికను ఇవ్వాలని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆదేశించింది. దీంతో ఎస్‌ఆర్‌ఎంలో ఆందోళనలకు దారితీసిన అంశాలపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశిస్తూ తెనాలి సబ్ కలెక్టర్ అంజనా సిన్హా నేతృత్వంలో ఆరుగురు అధికారులతో అత్యవసరంగా కమిటీని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ గురువారం యుద్ధప్రాతిపదికన వర్సిటీకి చేరుకుని విచారణ చేపట్టింది.

300 మందికి అస్వస్థత వాస్తవమే: విచారణ కమిటీ

విచారణ కమిటీ ఎస్‌ఆర్‌ఎంలో పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టింది. మంగళగిరిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థులను కూడా పరామర్శించి వివరాలను సేకరించింది. విచారణాధికారి అంజనా సిన్హా మాట్లాడుతూ వర్సిటీలో ఫుడ్ పాయిజన్ అయిన మాట వాస్తవమేనని చెప్పారు. సుమారు 300 మందికిపైగా విద్యార్థులు డయేరియా లక్షణాలతో బాధపడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఫుడ్ శాంపిల్స్, వాటర్ శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించామని చెప్పారు. వర్సిటీకి వచ్చే నీటిని ఎలా శుద్ధి చేస్తున్నారనే అంశమై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతోనూ విచారణ చేయిస్తున్నామని తెలిపారు.

రెండు వారాలు సెలవులు

తాజా పరిణామాల నేపథ్యంలో ఎస్‌ఆర్‌ఎం వర్సిటీకి శుక్రవారం నుంచి ఈ నెల 23 వరకు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ గురువారం ప్రకటన జారీ చేశారు. వర్సిటీ అంతటా సమగ్రంగా శానిటైజేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే, విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వర్సిటీ యాజమాన్యం మరో ప్రకటనలో తెలిపింది. వాస్తవికతకు భిన్నంగా జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని పేర్కొంది. విద్యార్థులు ఆందోళన చెందనవసరం లేదంది.



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో ఏపీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

రాకెట్ ఎగిరేది ఇలా..!

ఏపీ విద్యార్థుల ఢిల్లీ పర్యటనలో తొలిరోజు రాకెట్ పనితీరును వివరించిన శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్ టు న్యూఢిల్లీ' కార్యక్రమం కింద దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లిన ఏపీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాకెట్ సైన్స్‌పై అవగాహన పెంచుకున్నారు. ఏపీ సైన్స్ సిటీ, సమగ్రశిక్ష అభియాన్ ఏపీ సంయుక్త అధ్వర్యంలో మూడు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రం నుంచి వచ్చిన 52 మంది విద్యార్థులకు తొలిరోజైన గురువారం ఘజియాబాద్‌లోని కైట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఇస్రో గుర్తింపు పొందిన శాస్త్రవేత్తలు.. రాకెట్ అంటే ఏమిటి.. అది ఎలా పనిచేస్తుంది.. దాన్ని ఎలా తయారు చేస్తారు.. ఎలా ప్రయోగిస్తారు..? ఇలా ప్రతి అంశంపైనా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. పర్యటనలో భాగంగా విద్యార్థులు శుక్రవారం రష్యన్ కల్చర్ సెంటర్‌ను సందర్శించనున్నారు.

చంద్రబాబు నాయకత్వంలో కొత్త తరం: రామ్మోహన్‌నాయుడు

సైన్స్ అండ్ టెక్నాలజీ, ఏఐ, ఏరోస్పేస్ వంటి రంగాల్లో అంతర్జాతీయంగా తెలుగుజాతి ఖ్యాతి ఇనుమడించేలా సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో కొత్త తరం రూపుదిద్దుకుంటోందని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. సైన్స్ టూర్‌లో భాగంగా ఢిల్లీలో పర్యటిస్తున్న 52 మంది ఏపీ విద్యార్థులతో గురువారం సాయంత్రం ఆయన తన నివాసంలో ముచ్చటించారు.

శ్రీచైతన్య ఉద్యోగుల రక్తదానం



హైదరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదిన వేడుకల సందర్భంగా సంస్థ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ వేడుకలు గురువారం దేశవ్యాప్తంగా అన్ని శ్రీచైతన్య కాలేజీల్లో జరిగాయి. మొత్తం 3,127 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. మియాపూర్‌లోని క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పాల్గొని చైర్‌పర్సన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా ఉద్యోగులు రక్తదానం చేయడంపై అభినందించారు. దేశవ్యాప్తంగా రక్తం కొరత తీవ్రంగా ఉందని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా లక్షలాది మంది విద్యార్థులను ఐఐటీయన్లు, ఇంజనీర్లు, డాక్టర్లు, సివిల్ సర్వెంట్లుగా తీర్చిదిద్దడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. సామాజిక సేవలోనూ తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. విజయవాడలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని శ్రీచైతన్య డైరెక్టర్ టి.నాగేంద్రకుమార్ ప్రారంభించారు.

ఆలయ దర్శనం

నంది లేని శివాలయం



ప్రమథ గణాలలో అత్యంత ముఖ్యుడు, పరమేశ్వరునికి ఎంతో విధేయుడు నంది. అందుకే శివుని వాహనంగా నందీశ్వరుడు ప్రతి శివాలయంలో... గర్భాలయం బయట ఉంటాడు. కానీ నంది లేని అరుదైన క్షేత్రం... ఆంధ్రప్రదేశ్‌లోని అంబాజీపేట మండలం నందంపూడిలో ఉన్న శ్రీ ఉమారామలింగేశ్వర ఆలయం.

సంతాన పార్వతి

స్థలపురాణం, క్షేత్ర విశేషాల ప్రకారం... ఈ ఆలయంలోని లింగాన్ని త్రేతాయుగంలో పరశురాముడు ప్రతిష్ఠించాడు. క్రీస్తుశకం పదకొండో శతాబ్దంలో అప్పటి పాలకులు ఆ ప్రాంతంలో ఒక ఆలయాన్ని నిర్మించారు. అందులో రామలింగేశ్వర స్వామి మాత్రమే కొలువై ఉండేవాడు.



బ్రహ్మచారి అయిన పరశురాముడు... రామలింగేశ్వరుణ్ణి మాత్రమే ప్రతిష్ఠించడంతో... నందంపూడి గ్రామంలోని దంపతులెవరికీ ఆ రోజుల్లో సంతానం కలిగేది కాదట. బంధువులు, స్నేహితుల పిల్లలను దత్తత తీసుకొనేవారట. ఈ నేపథ్యంలో ఆ గ్రామ జమీందారు వడ్లమాని కామేశ్వర రావు పూర్వీకుల ఇంటికి ఒక స్వామీజీ వచ్చారు. ఆయనకు గ్రామస్తులు తమ సంతానలేమి సమస్యను వివరించగా... ఆయన దివ్యదృష్టితో పరిస్థితిని తెలుసుకొని... పార్వతీ దేవిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి గ్రామ ప్రజలకు సంతాన భాగ్యం కలుగుతోందని, ఇక్కడి అమ్మవారు 'సంతాన పార్వతి'గా ప్రఖ్యాతి పొందారని, ఈ సంగతి తెలుసుకున్న ఇతర ప్రాంతాల వారు కూడా అమ్మవారిని దర్శించుకొని సంతానవంతులయ్యారని ఆలయ అర్చకుడు యలమంచిలి సుబ్రహ్మణ్య శర్మ వివరించారు.

నందీశ్వరుడి కోరిక

నందంపూడి గ్రామాన్ని రాజరాజనరేంద్రుడు... నన్నయభట్టుకు అగ్రహారంగా దానం చేసినట్టు ప్రతీతి. ఆలయంలోని రాతి శాసనం మీద ఈ ఊరి పేరు 'ఆనందపురి'గా నమోదై ఉంది. కాలక్రమేణా నందంపూడిగా మారింది. ఇక్కడి శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామికి మరెన్నో విశిష్టతలు ఉన్నాయి. ఇక్కడ శివుడు పశ్చిమాభిముఖంగా ఉంటాడు. గర్భాలయంలో పానవట్టం ఉండదు. అమ్మవారు గర్భాలయంలో ఉండరు. అంతరాలయంలో... ఉత్తరాభిముఖంగా కొలువుతీరి ఉంటారు. సాధారణంగా ప్రతి ఆలయంలో.. అక్కడ కొలువైన దేవుడి వాహనం ఉంటుంది. పరమేశ్వరుడి వాహనమైన నంది... విగ్రహ రూపంలో, శివుడికి అభిముఖంగా అంతరాలయంలో లేదా ముఖమండపంలో ఉంటుంది. ఆ ఆలయాలలోని దేవుణ్ణి దర్శించుకోవడానికి భక్తులు వెళ్ళినప్పుడు... వాహనం అనుమతి తీసుకోవడం ఆనవాయితీ. అయితే తన అనుమతి అవసరం లేకుండా భక్తులకు నేరుగా దర్శనం ఇవ్వాలని నందీశ్వరుడు కోరాడట. అందుకే ఈ ఆలయంలో నంది ఉండదు. ఈ ఆలయంలో శివుణ్ణి దర్శించుకొని, భక్తిశ్రద్ధలతో సేవిస్తే... అనంతమైన ఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

• **సి.ఎన్.మూర్తి**, 8328143489



కాళిదాస మహాకవి తన 'రఘువంశ' కావ్యంలో పార్వతీ పరమేశ్వరులను 'మాట-అర్థం'తో పోల్చాడు. (వాగర్థా వి సంపృక్తౌ... పార్వతీ పరమేశ్వరౌ). ఏదో కొంత భావాన్ని మనసులో పెట్టుకొని... ఆ అర్థం వచ్చేలా మాటను మాట్లాడుతాం. ఏదైనా ఒక మాట మాట్లాడామంటే... దానికి ఒక అర్థం రానే వస్తుంది. అర్థం లేని మాట ఉండదు. మాట లేకుండా అర్థం పుట్టదు. అలా 'వాక్-అర్థం' అనే విడదీయరాని, విడదీయలేని జంటగా పార్వతీ పరమేశ్వరులు ఉంటారని ఆ శ్లోకం అర్థం. ఇంతకుమించి వారి అన్యోన్యతను చెప్పగల మరొక పోలిక ఉందా, ఉంటుందా? ఇది నిజం అనడానికి... ఆ ఇద్దరిలోనూ భౌతికంగా కనిపించే 'అర్ధ+నారీ+ఈశ్వర' రూపం మరొక తిరుగులేని సాక్ష్యం.

వాగర్థాలు... అన్యోన్యతా చిహ్నాలు

ఒకే మాట...

సృష్టిని నిర్వహించే బ్రహ్మ... తన భార్య సరస్వతికి కేవలం తన ముఖం (నోరు) భాగాన్నే ఇచ్చాడు. స్థితి (రక్షణ) బాధ్యతను చేపట్టిన శ్రీహరి... తన భార్యకు తన వక్షస్థలాన్ని ఇచ్చాడు. ఏ వ్యక్తి శరీరంలోనైనా ఉండే ప్రధాన అవయవాల సంఖ్య 42 కాగా... వాటిలో ఒక్కొక్కటి చొప్పున బ్రహ్మ, విష్ణువు తమ భార్యలకు ఇస్తే... శంకరుడు మాత్రమే 21 భాగాలను.. అంటే తన శరీరంలో తన అర్ధ భాగాన్ని భార్యకు ఇచ్చాడు. ఇక్కడ మరొక విశేషం కూడా ఉంది. బ్రహ్మ భార్య అయిన సరస్వతి... ఆయన మీద తాత్కాలికంగా అలిగి, ఒక నదిగా మారి, ప్రవహించడానికి వెళ్ళిపోయింది. అదే తీరుగా... శ్రీహరి భార్య అయిన లక్ష్మీదేవి కూడా... తాత్కాలికంగా అలిగి, తన తల్లిదండ్రులతో కలిసి సుఖంగా ఉండిపోవడానికి... తన పుట్టిల్లయిన కొల్హాపురానికి వెళ్ళిపోయింది. ఈ రెండు సంఘటనల్లోనూ తత్త్వపరమైన అర్థాలు, సాంకేతిక రహస్యాలు ఉన్నాయనేది వేరే విషయం. అభిప్రాయ భేదాలు రావడానికి కారణం ఒకరు చెప్పినదాన్ని మరొకరు వినకపోవడమే కదా! కానీ శివ పార్వతుల విషయంలో మరొక మాటంటూ లేదు, ఉండదు. పాల సముద్రాన్ని చిలికే వేళ... చెప్పలేనంత వేడిమితో, విషపు వాసనతో గొప్ప ధూమం బయటకు రాసాగింది. శ్రీహరితో సహా అందరూ వెళ్ళిపోతూ ఉంటే... 'మ్రింగుమనె సర్వమంగళ... మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో'... అలా చోద్యం చూడడమేమిటి? ఈ లోకాలన్నిటినీ భస్మం చెయ్యగల శక్తితో వస్తున్న ఆ విషాగ్నిని మింగాలని శివుణ్ణి ఆజ్ఞాపించింది. అంతే... ఆమె చెప్పడం, ఆయన ముందూ వెనుకా చూడకుండా ఆ విషాన్ని స్వీకరించడం జరిగిపోయింది.

> **పార్వతీ పరమేశ్వరులు ప్రకటించిన సత్యం ఒక్కటే! నిజమైన ఆభరణం అంటే విలువైన బంగారు హారాలు, వడ్డాణాలు... ఇవికావు. స్త్రీకి ఆభరణం భర్త. భర్తకు ఆభరణం భార్య అని. ఆ అన్యోన్యతే లేనప్పుడు... ఆభరణాలు బంగారానివే అయినా అవి విలువలేనివి. శరీరానికి బరువు పెంచే రాళ్ళతో సమానం.**

దాంపత్యం అంటే...

అలాగే మరొక సంఘటన. పార్వతి... సతీదేవిగా ఉన్న కాలంలో.. ఆమెను, అల్లుడైన శివుణ్ణి పిలువకుండానే దక్షుడు యాగాన్ని ప్రారంభించాడు. మొదట్లో సతీదేవి కూడా వెళ్ళకూడదని అనుకుంది. కానీ ఆకాశంలో ప్రయాణిస్తున్న అందరి విమానాలు తన పుట్టింటివైపు వెళ్తూ ఉంటే... తనకూ వెళ్ళాలని అనిపిస్తోందని శంకరుడికి చెప్పింది. "వెళ్ళాలని ఉంది గనుక నువ్వు వెళ్ళు. పిలుపు లేకుండా నేను రాకూడదు. ఇది అర్థం చేసుకో. అయితే అక్కడ నీ మనసుకు బాధ కలిగే సంఘటన ఏదైనా జరిగినా, జరగబోతోందని అనిపించినా... నన్ను మనసులో తలచుకో" అని చెప్పాడు. అనుకున్నట్టుగానే ఆమె వెళ్ళింది. తండ్రి ఇంటి ప్రధాన ద్వారం దగ్గర నిలబడింది. ఆమెను చూసిన ఋత్విక్కులు, సోదరులు, ఇతర ముఖ్యులు 'ఏం జరుగుతుందో' అనే భయంతో ముఖం తిప్పుకున్నారు. దక్షుడు కూడా ఆమెను చూసి పక్కకు వెళ్ళిపోయాడు. అప్పుడు ఆమె తీవ్ర మనోవేదనతో శివుణ్ణి స్మరించుకున్న తక్షణమే ఆయన వీరభద్రుణ్ణి పంపాడు. వీరభద్రుడు యాగాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, దక్షుడి తలను తెంచి, యాగాగ్నిలో పడేసి, తల పూర్తిగా దగ్ధమయ్యేదాకా ఉండి, తిరిగి వచ్చేశాడు. సాధారణంగా లోకంలో ఇలాంటి సందర్భం ఎక్కడైనా ఎదురైతే ఏ భర్త అయినా "వద్దంటే వెళ్తున్నావుగా! జరగరానిది ఏది జరిగినా అనుభవించు" అనే అంటాడు. దాంపత్యం అంటే... శివ పార్వతుల మాదిరిగా అన్యోన్యత కలిగి ఉండడమే!

• **డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు**
9866700425

సందేశం

గుర్తుంచుకోవాల్సిన సత్యం

ధనవంతులమనే అహంకారం కలిగినవారికి, వస్తు ప్రపంచానికి మాత్రమే ప్రాధాన్యాన్ని ఇచ్చి, దైవాన్ని నిర్లక్ష్యం చేసేవారికి గుణపాఠం తప్పదని దివ్య గ్రంథమైన ఖుర్‌ఆన్ స్పష్టం చేస్తోంది. ఎన్నో ఘన విజయాలను సాధించిన అలెగ్జాండర్ అంతిమ ఘడియల్లో తన సేనానులను పిలిచి... "నా చేతులు బయటకు కనిపించేలా నా అంతిమ యాత్రను నిర్వహించండి. ఎందుకంటే అలెగ్జాండర్ చక్రవర్తి ఈ లోకం నుంచి ఉత్త చేతులతో వెళుతున్నాడు. తనతో పాటు ఏదీ తీసుకు వెళ్ళడం లేదని లోకానికి తెలియాలి" అని చెప్పాడు. మానవులలో ప్రతి ఒక్కరి పరిస్థితీ ఇంతే.

అందుకే "నీరు చేరినప్పుడు ఇనుము తుప్పుపట్టినట్టు... (దేవుడి మార్గాన్ని తప్పిన) హృదయాలకు కూడా తుప్పు పడుతుంది. దాన్ని వదిలించుకోవడం కోసం... మృత్యువును సదా గుర్తు చేసుకుంటూ ఉండండి" అని మహా ప్రవక్త మహమ్మద్ సూచించారు. మనిషి వాస్తవాల నుంచి తప్పించుకొని తిరగగలడు. కానీ అలా తప్పించుకోవడం వల్ల కలిగే పరిణామాల నుంచి తప్పించుకోలేడు. గడిచే ప్రతి క్షణం మనల్ని మృత్యువుకు మరింత దగ్గరగా తీసుకుపోతోంది. కాబట్టి పుట్టిన రోజులను వేడుక చేసుకోవడమే కాదు... మృత్యువును కూడా గుర్తు చేసుకోవాలి. ఊరేగింపుగా జరిగే అంతిమ యాత్రల్లోని అంతరార్థం... 'ఎప్పుడో ఒక రోజు నా గతీ ఇంతే' అని తెలుసుకోవడానికే. "చివరకు మీరందరూ అల్లాహ్ వద్దకు మరలిపోవాల్సిందే" అని ఖుర్‌ఆన్ హెచ్చరిస్తోంది.



ఈ సత్యాన్ని మనుషులు మరచిపోవడం వల్లే మానవత్వాన్ని వదులుకుంటున్నారు. విలువల పట్ల విశ్వాసం కోల్పోతున్నారు. ధర్మాన్ని నిర్దేశించిన దైవాన్ని విస్మరిస్తున్నారు. స్వార్థాన్ని పెంచి పోషిస్తున్నారు. బలహీనులను హింసిస్తున్నారు, దోచుకుంటున్నారు. ఒకరికన్నా మరొకరు ఎక్కువ సంపద కూడబెట్టుకోవాలనే పోటీలో పరుగులు పెడుతున్నారు. అలాంటి వారిని ఉద్దేశిస్తూ "మీ హృదయాలు బండరాళ్ళకన్నా కఠినమైపోయాయి. మీ కార్యకలాపాలపట్ల అల్లాహ్ అజాగ్రత్తగా ఉంటాడని అనుకోవద్దు" అని అని ఖుర్‌ఆన్ స్పష్టం చేసింది. మృత్యువును ఎంత తిరస్కరించాలనుకున్నా ప్రతి ఒక్కరికీ అది రాకమానదు. అలాగే దేవుడి శక్తిని, ధర్మాన్ని నిర్లక్ష్యం చేసేవారు... దానివల్ల కలిగే పరిణామాలను అనుభవించక తప్పదు. ఈ సత్యాన్ని గుర్తుంచుకొని మానవతతో, దైవ చింతనతో మెలిగే వారికే అల్లాహ్ అనుగ్రహం లభిస్తుంది.

• **మహమ్మద్ వహీదుద్దీన్**

యోగం

భారతీయ యోగ, తంత్ర సంప్రదాయాలు మానవ జీవితంలోని పరమార్థాన్ని అన్వేషించే లోతైన మార్గాలను సూచిస్తాయి. వీటిలో ప్రాణాయామం, ముద్రలు, బంధాలు, ధ్యానం, కుండలినీ శక్తిని మేలుకొలపడం లాంటి ప్రక్రియలు.. కేవలం శారీరక ఆరోగ్యానికే కాదు, పరమాత్మ సాక్షాత్కారం కోసం కూడా రూపుదిద్దుకున్నాయి.

ద్వాదశాంతం... చైతన్య వికాసం



ఆధునిక జీవితం వేగం, ఒత్తిడి, మానసికమైన కలతలతో నిండిపోయింది. మనిషి జీవనశైలి వేగంగా మారిపోతోంది. ఒత్తిడి, పనిభారం, కుటుంబ సమస్యలు, భవిష్యత్ భయం, అస్థిర సంబంధాలు, భద్రతా లోపం, 'నేను' అనే పరిమితి... ఇవన్నీ కలిసి డిప్రెషన్‌కు, అసహనానికి, శారీరక వ్యాధులకు దారి తీస్తున్నాయి. సోషల్ మీడియా, వార్తలు లాంటివి మెదడులో అనవసరమైన కల్లోలాన్ని సృష్టిస్తున్నాయి దీనివల్ల అశాంతి, ఆందోళన పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మానసిక సమతుల్యతను కోల్పోవడం సహజం. ఈ సమయంలో ధ్యానం అనేది మానవుని ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక వికాసానికి, మానసిక ప్రశాంతతకు ఒక శక్తిమంతమైన పరిష్కారం. ధ్యానం క్రమంగా క్రియ నుంచి స్థితిగా మారుతుంది. అనంతంతో ఏకమయ్యే స్థితికి తీసుకువెళుతుంది. యోగ, తంత్ర సంప్రదాయాల్లో ధ్యానాన్ని కేవలం మనిషి మానసిక ఒత్తిడిని, శారీరక అలసటను తగ్గించి, లోతైన విశ్రాంతిని ప్రసాదించే సాధనంగా కాకుండా. చైతన్య వికాసంగా చూశారు. పూర్వకాలంలో ఋషులు 'ఓం'కారాన్ని కానీ, 'సోహం' మంత్రాన్ని కాని అంతర్గతంగా జపించేవారు. ఆ మంత్రజపం కొన్ని రోజులకు, నెలలకు శ్వాసతో అనుసంధానమై, జపంకాని జపంగా మారి... సమాధి స్థితికి తీసుకువెళ్ళేది. సమాధిస్థితికి చేరుకున్న సాధకుడు 'ద్వాదశాంతం'లో లయమవుతాడు. 'ద్వాదశాంతం' అనేది శూన్య బిందు ధ్యాన కేంద్రం. అది మానవ చైతన్యం నుంచి దైవ చైతన్యానికి దారి చూపే ద్వారం. ప్రాణం, మనస్సు, నాదం, బిందువులం లయమయ్యే స్థానం.

ఎన్నో సంప్రదాయాల్లో, గ్రంథాల్లో...

శైవ, తాంత్రిక, నాథ సంప్రదాయాల ప్రకారం... 'ద్వాదశాంతం' అంటే నాసికాగ్రం నుంచి పన్నెండు అంగుళాల దూరంలో ఉన్న శూన్యస్థలం. కొందరు సిద్ధ గురువులు "ద్వాదశాంతం అనేది సహస్రారం నుంచి పన్నెండు అంగుళాల దూరంలో ఉన్న శివశక్తుల లయస్థానం" అని సూచించారు. 'ద్వాదశ' అంటే పన్నెండు, 'అంతం' అంటే అంతిమ స్థానం. "ద్వాదశాంతం... అమృతధార ఉద్భవించే స్థానం" అని పేర్కొంది సిద్ధ సంప్రదాయం. ఉపనిషత్తులలో కూడా ద్వాదశాంతం ప్రస్తావన ఉంది. యోగి నాసికాగ్రం నుంచి పన్నెండు అంగుళాల దూరంలో చిత్తాన్ని నిలిపినప్పుడు... అక్కడ ప్రాణం... అంటే కుండలినీశక్తి లయమై, అమృతరసం ఉద్భవిస్తుందని 'అమృత నాదోపనిషత్తు' చెబుతోంది. "నాసికాగ్రం నుంచి పన్నెండు అంగుళాల దూరంలో శూన్య బిందువు ప్రకాశిస్తుంది. అది శివశక్తి స్థానం. అంతేకాదు, శూన్య, నాద బిందువులకు కేంద్ర స్థానం" అంటోంది 'ధ్యానబిందూపనిషత్'. "ద్వాదశాంతం... ప్రాణం, మనస్సుల లయక్షేత్రం" అని పేర్కొంది 'యోగవాశిష్ఠం'. "నాసాగ్ర దృష్టి, బ్రహ్మరంధ్రం, ద్వాదశాంత ధారణలు... ప్రాణసమాధి సాధనతో అనుసంధానమై ఉంటాయి" అని స్వాత్మారామ యోగి తన 'హఠయోగ ప్రదీపిక'లో చెప్పారు. తంత్రాగమ గ్రంథాల విషయానికి వస్తే... ద్వాదశాంతం అనేది శూన్యస్థానం అనీ, అది శివశక్తుల లయక్షేత్రం అనీ 'మాలినీ విజయోత్తర తంత్రం' వివరించింది. "మంత్రోపాసనలో మంత్ర జపం అక్షర లక్షలు అయినప్పుడు... మంత్రం శ్వాసతో అనుసంధానమై, కుండలినీశక్తి మేల్కొని ద్వాదశాంతం వైపు పయనిస్తుంది. ద్వాదశాంతం అనేది శక్తి లయ బిందువు. నాదకుడు నాద, బిందు, శూన్య స్థితుల ద్వారా ఈ స్థితిలోకి ప్రవేశిస్తాడు. సహస్రారానికి పైన... పన్నెండు అంగుళాల దూరంలో ఉన్న శూన్యాన్ని దీర్ఘకాలంగా ధ్యానిస్తూ, ప్రణవాన్ని పరిపూర్ణంగా ఉచ్ఛరించేవారికి ఇంద్రియాతీతమైన శక్తి లభిస్తుంది" అని అభినవగుప్తుడి 'లోకతంత్రం' గ్రంథం చెబుతోంది. అలాగే కాశ్మీరీ శైవతంత్రం, స్కంద కారికలు, పరాత్రిశికా గ్రంథాలు, వసుగుప్తుడు రాసిన శివసూత్రాలు, సిద్ధ గురువు బోగర్ రాసిన 'బోగర్ 7000', తిరుమూలర్ రాసిన 'తిరుమంతిరం' లాంటి అనేక గ్రంథాలు ద్వాదశాంతం గురించి ఎన్నో అంశాలను వివరించాయి. బౌద్ధంలో దీన్ని 'శూన్య ధ్యానం'గా, సూఫీ మతంలో 'నూర్ అనుభవం'గా, క్రైస్తవ సంప్రదాయంలో 'దివ్యకాంతి దర్శనం'గా పేర్కొన్నారు.

• **యోగి భరద్వాజ బొడ్డు**

అక్రమాలపై తిరుగుబాటు



ఏసు క్రీస్తులో స్పష్టంగా కనిపించే రెండు కోణాలు ఉన్నాయి. వాటిలో ఒకటి... ఆయనలో ఉన్న దైవికమైన స్వభావం. రెండోది... స్వచ్ఛమైన మానవ స్వభావం. సముద్రం అలజడిని, కల్లోలాలను ఆపినప్పుడు, నీటిని ద్రాక్షరసంగా మార్చినప్పుడు మొదటి స్వభావం కనిపిస్తుంది. ఆయన పడిన బాధల్లో, మరణ యాతనలో మానవ స్వభావం దర్శనమిస్తుంది. ఆయన బోధలు కూడా మానవ స్వభావానికి అనుగుణంగా సాగాయి. మనిషి పరిపూర్ణంగా ఎలా జీవించాలో ఆయన నేర్పాడు. మామూలు మనిషిని మహోన్నత స్థాయికి తీసుకుపోవడం కోసం బోధలు చేశాడు. వాటిని స్వయంగా ఆచరించాడు.

ఏసు క్రీస్తు మీద ఆ రోజుల్లో 'తిరుగుబాటుదారు' అనే ముద్ర ఉంది. దీనికి కారణం ఏమిటంటే... నాటి రాచరిక వ్యవస్థ సామాన్య ప్రజల అజ్ఞానాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని పాలన సాగించేది. ఏసు ఉంటే తాము బోధించే మూఢాచారాలకు భంగం వాటిల్లుతుందని, తమ భావాలు చెల్లవనీ భయపడేది యూదా మత వ్యవస్థ భావించింది. ఈ రెండు వ్యవస్థలూ కలిసి ఆయనను ఒక ద్రోహిగా చిత్రీకరించాయి. దానికితోడు "నేను ఈ లోకంతో సమాధానపడి రాజీ కుదుర్చుకోవడానికి రాలేదు, నిప్పు రగిలించడానికి వచ్చాను" అని ఏసు చేసిన ప్రకటనతో ఈ వ్యతిరేకత మరింత బలపడింది. కానీ స్వార్థపరులైన, సంకుచిత మనస్తత్వం కలిగిన ప్రత్యర్థులతో తాను రాజీ పడేది లేదని, ప్రజల్లో చైతన్యాన్ని రగిలించడానికి వచ్చాననీ ఆయన భావం. అన్యాయాన్ని చూస్తూ ప్రశాంతంగా ఉండడం కాదనీ, దాన్ని ఖండించాలని, శాశ్వత నిద్రలోకి జారుకున్న సమాధుల్లా ఉండవద్దని ఉద్బోధించాడు. లోకం తీరు తెలిసినవాడు కనుకనే... సత్యాన్ని బోధించడం కోసం తన శిష్యులను సంఘంలోకి పంపినప్పుడు "జాగ్రత్త! తోడేళ్ళ మధ్యకు గొర్రె పిల్లలను పంపినట్టు మిమ్మల్ని పంపుతున్నాను" అని చెప్పాడు. ఆయన మొదటిసారిగా ఒక ప్రార్థనా మందిరంలోకి అడుగు పెట్టినప్పుడు... అక్కడ అక్రమాలు సాగిస్తున్న వ్యాపారులను తరిమి కొట్టి, తన తిరుగుబాటును ప్రకటించాడు. అప్పటి నుంచి మూఢనమ్మకాలను, స్వార్థ శక్తులను ఎదిరించడమే ధ్యేయంగా ఆయన ప్రయాణం కొనసాగింది.


• **డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్**, 9866755024

తెలుసుకుందాం

అర్చాస్వరూపుడైన భగవంతుని విగ్రహ రూపాన్ని మూడు విధాలుగా అభివర్ణిస్తారు. అవి... రూపం, అరూపం, రూపారూపం. వీటినే శిల్ప, ఆగమ గ్రంథాలు... 'వ్యక్తం, అవ్యక్తం, వ్యక్తావ్యక్తం' అనీ, 'సకళం, నిష్కళం, సకళనిష్కళం' అని పేర్కొంటున్నాయి. పదాలు వేరైనా భావం ఒక్కటే. స్పష్టంగా కనిపించేది రూపం. అస్పష్టంగా కనిపించేది అరూపం. స్పష్టాస్పష్టంగా కనిపించేది (కనిపించీ కనిపించనిది) రూపారూపం.

భగవంతుని రూపాలు

రూపం/ వ్యక్తం/ సకళం:



'సకళం' అంటే రూపంతో కూడినది. అంటే తాళమాన (దైవికమైన కొలతల) ప్రమాణాలను అనుసరించి, శిల్ప, ఆగమ నియమాలకు అనుగుణంగా... తల, శరీరం, కాళ్ళు, చేతులు, సకల ఆభరణాలు, ఆయుధాలు, వస్త్రాలంకరణతో కూడిన ప్రతిమలను 'సకళములు' అనీ, 'వ్యక్తములు' అనీ పిలుస్తారు. సామాన్య భక్తులు కూడా ఈ విగ్రహరూపంలోని భగవంతుణ్ణి దర్శించగలరు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు తదితర విష్ణురూపాలు, చంద్రశేఖర మూర్తి, ఆనందతాండవమూర్తి లాంటి శివరూపాలు, ఇంకా వివిధ దేవతా ప్రతిమలు దీనికి ఉదాహరణలు.

అరూపం/ అవ్యక్తం/ నిష్కళం:



'నిష్కళం' అంటే రూపరహితం. కానీ ఇది అఖండమైన చైతన్య స్వరూపం. ప్రత్యేకించి ఎటువంటి లక్షణాలు, అంగ విన్యాసం, ఆభరణ విన్యాసం, ఆయుధ విన్యాసం భౌతికమైన కళ్ళకు కనిపించకపోయినా... అఖండమైన భగవత్ శక్తిని తమలో నింపుకొని, ఆశ్రయించిన భక్తులను అనుగ్రహించే స్వరూపాలను 'అరూప బింబాలు' అనీ, 'అవ్యక్త బింబాలు' అనీ పిలుస్తారు. ఈ నిష్కళ రూపాలలోని భగవంతుణ్ణి యోగులు, సిద్ధులు, తపస్సంపన్నులు, ఆచార్యులు మాత్రమే గమనించి, ఈ లోకానికి ప్రకటించగలరు. సామాన్యులకు నేరుగా అంతుపట్టనిది ఈ అరూప బింబం. శివలింగం, నర్మదానదిలో సహజసిద్ధంగా దొరికే బాణ లింగాలు, గండకీ నదిలో దొరికే విష్ణు స్వరూపాలైన సాలగ్రామాలు ఈ నిష్కళ మూర్తికి ఉదాహరణలు. సాలగ్రామం సదా విష్ణు సాన్నిధ్యంలో ఉంటుంది. సాలగ్రామారాధనలో ప్రత్యేకించి ఆవాహన ఉండదు. అవి సాక్షాత్తూ సుకుమారమైన భగవంతుడి దివ్య స్వరూపం కాబట్టి... అభిషేకం అయ్యాక 'ప్లోత వస్త్రం' (మెత్తటి వస్త్రం)తో తుడవడం కూడా చెయ్యరు. అభిషేకం అనంతరం తిరుమణి (నామం)తోపాటు చందనం, తులసి తప్పకుండా సమర్పిస్తారు.



రూపారూపం/ వ్యక్తావ్యక్తం/ సకళనిష్కళం:

కనిపించీ కనిపించక, ఉందా, లేదా? అన్నట్టు ఉండే రూపమే... 'రూపారూపం లేదా 'వ్యక్తావ్యక్త' బింబాలు. అరూపమైన శివ లింగానికి నలువైపులా సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష రూపాల ముఖాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ఊర్ధ్వ ముఖంగా ఈశాన రూపమూ చెక్కి ఉంటుంది. దీనినే 'ముఖలింగం' అంటారు. ఇవి వ్యక్తావ్యక్త బింబానికి ఉదాహరణ. రేణిగుంట సమీపంలోని గుడిమల్లంలో ఉన్న అతి ప్రాచీన శివలింగంపై ఒక మూర్తి చెక్కి ఉంటుంది. రూపానికి ప్రతీక అయిన ప్రతిమ, అరూపానికి ప్రతీక అయిన శివలింగం కలిసిన ఈ రూపాన్ని 'రూపారూపం' అని పేర్కొనవచ్చు. ఇక విష్ణు రూపానికి వస్తే... గోచరించీ గోచరించని పూరీ శ్రీ జగన్నాథ స్వామి విగ్రహాలు వైష్ణవ సంప్రదాయంలో 'వ్యక్తావ్యక్త' లేదా 'సకళనిష్కల' బింబానికి ఉదాహరణ.

• **దగ్గుపాటి నాగవరప్రసాద్**, స్థపతి, 9440525788

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

త్వరలోనే కొత్త షెడ్యూల్



ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై నందమూరి కల్యాణ్ రామ్, హరికృష్ణ కొసరాజు, నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా గురించి నిర్మాణ సంస్థ ఓ కొత్త అప్డేట్ ఇచ్చింది. 'బీస్ట్ మోడ్ మళ్లీ మొదలు కానుంది. త్వరలోనే కొత్త షెడ్యూల్ షురూ' అని ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ ఉన్న ఓ పిక్ పోస్ట్ చేసింది.

వినోదాల విందు



విశ్వక్‌సేన్ హీరోగా హాస్య చిత్రాలు రూపొందించడంలో తన కంటూ ప్రత్యేక గుర్తింపు కలిగిన దర్శకుడు కేవీ అనుదీప్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'ఫంకీ' చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. వినోదాల విందుకు హామీ ఇస్తూ వచ్చే ఏడాది ఏప్రిల్ 3న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రకటించారు.

సంతాన ప్రాప్తిరస్తు.. విజయోస్తు!

- దిల్ రాజు



'కల్యాణ ప్రాప్తిరస్తు అని వినేవాళ్లం. ఇప్పుడు సంతాన ప్రాప్తిరస్తు అని వింటున్నాం. లివ్ ఇన్ రిలేషన్, పెళ్లి సులువు అయ్యింది. కానీ, పిల్లలు పుట్టడమే సమస్యగా మారుతోంది. అందుకే ఈ సినిమాకు ఈ టైటిల్ పెట్టారు. 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా ప్రేక్షకులకు, మీడియాకు నచ్చి మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు నిర్మాత దిల్ రాజు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రమిది. మధుర ఎంటర్‌టైన్‌మెంట్స్, నిర్వి ఆర్ట్స్ బేనర్లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ విడుదల వేడుకకు నిర్మాత దిల్ రాజు, కథానాయకుడు ఆనంద్ దేవరకొండ అతిథులుగా హాజరయ్యారు. 'ఈ సినిమా ట్రైలర్ చాలా ప్రామిసింగ్‌గా ఉంది. వినోదంతో ఆకట్టుకుంటోంది. మూవీ బ్లాక్‌బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నా' అని ఆనంద్ దేవరకొండ ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ కథకు కుటుంబ భావోద్వేగాలు, వినోదంతోపాటు ఒక చిన్న సామాజిక సమస్యను కూడా జత చేశాను' అని చెప్పారు. నిర్మాత మధుర శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 'కంటెంట్ ఉన్న చిత్రాలనే ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. మా 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమాను కూడా ఆదరిస్తారని నమ్ముతున్నాం' అని అన్నారు. కార్యక్రమంలో హీరో, హీరోయిన్లు విక్రాంత్, చాందినీ చౌదరి, నిర్మాత నిర్వి హరిప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చూడాల్సిన చిత్రం

- హేషమ్ అబ్దుల్ వహాబ్



'ది గర్ల్‌ఫ్రెండ్' ప్రతి ఒక్కరూ చూడాల్సిన చిత్రం. కేవలం ప్రేమకథ మాత్రమే కాకుండా మంచి సందేశం ఉన్న సినిమా ఇది. ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరిలోనూ ఓ అంతర్మథనం మొదలవుతుంది' అని సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించగా, రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రమిది. నేడు విడుదలవుతోన్న సందర్భంగా హేషమ్ మీడియాతో ముచ్చటించారు. 'తెలుగులో నేను సంగీతం అందించేందుకు అంగీకరించిన తొలి చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. ఈ సినిమా చిత్రీకరణలో జాప్యం వల్ల నేను వేరే ప్రాజెక్ట్‌లతో బిజీగా మారడంతో నేపథ్య సంగీతం కోసం ప్రశాంత్ విహారిని తీసుకున్నారు. అతను చాలా మంచి బీజీఎం ఇచ్చారు. ఈ చిత్రంలో మొత్తం నాలుగు పాటలు ఉంటాయి. ఇటీవలే విడుదల చేసిన 'నీదే నీదే కథ' అనే పాట కంపోజింగ్ కోసం ఎక్కువగా కష్టపడ్డాను. హీరో హీరోయిన్ల పాత్రల మధ్య ఉండే సంఘర్షణే ఈ సినిమాకు మంచి పాటలు చేసే స్ఫూర్తినిచ్చింది. రాహుల్ కోరిక మేరకు మన స్వరాలు, వెస్ట్రన్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఉపయోగించాం. తమిళ, మలయాళ చిత్రాల కన్నా తెలుగులో ఎక్కువ సినిమాలు చేస్తున్నాను' అని చెప్పారు.

దుల్కర్‌ను నట చక్రవర్తి అని పిలుస్తారు

- రానా



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడికల్ డ్రామా 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా దగ్గుబాటి తన స్పిరిట్ మీడియా పతాకంపై నిర్మిస్తున్నారు. నవంబర్ 14న విడుదల కానుంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభాస్ చేతుల మీదుగా ట్రైలర్‌ను విడుదల చేశారు. 1950-60ల నాటి మద్రాస్ సినీ పరిశ్రమ నేపథ్యంలో కథ సాగుతుంది. దుల్కర్ టీకే మహదేవన్ అనే సూపర్‌స్టార్ పాత్రను పోషిస్తున్నారు. అతనికీ, దర్శక నిర్మాత అయిన అయ్యా(సముద్రఖని)కు మధ్య ఉన్న సంఘర్షణ నేపథ్యంలో కథ సాగుతుంది అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ 'ఈ సినిమాను అందరూ థియేటర్లలో చూడండి. ఇదొక గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. నా స్నేహితుడు రానాతో కలసి నిర్మించడం ఆనందాన్నిచ్చింది' అని చెప్పారు. రానా దగ్గుబాటి మాట్లాడుతూ 'కథ విన్న వెంటనే తప్పకుండా ఈ సినిమా చేయాలనిపించింది. ఇలాంటి పీరియాడిక్ చిత్రానికి దుల్కర్ లాంటి రెట్రోకింగ్ పర్ఫెక్ట్. నవంబర్ 14 తర్వాత మీరందరూ దుల్కర్‌ను నట చక్రవర్తి అని పిలుస్తారు' అని చెప్పారు. కాంత నాకు చాలా స్పెషల్ చిత్రం అని భాగ్యశ్రీ బోర్సే తెలిపారు. కాంత లాంటి గొప్ప చిత్రంలో నటించినందుకు గర్వంగా ఉందని సముద్రఖని తెలిపారు. దుల్కర్ సల్మాన్ నటన ప్రతి ఒక్కరినీ మెప్పిస్తుందని సెల్వమణి సెల్వరాజ్ చెప్పారు.

రైనా, ధవన్‌ల రూ.11.14 కోట్ల ఆస్తుల జప్తు

» అక్రమ బెట్టింగ్ సైట్ ప్రమోషన్ కేసులో ఈడీ చర్య

న్యూఢిల్లీ, నవంబరు 6: అక్రమ బెట్టింగ్ సైట్ కేసుకు సంబంధించి మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధవన్‌కు చెందిన రూ.11.14 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. 1x బ్యాట్ సైట్, ఇతర అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌తో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో రైనాకు చెందిన మ్యుచువల్ ఫండ్స్ పెట్టుబడులు రూ.6.64 కోట్లను, ధవన్‌కు చెందిన రూ.4.5 కోట్ల స్థిరాస్థులను ఈడీ సీజ్ చేసింది. ఈ కేసుకు సంబంధించి రైనా, ధవన్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. అక్రమ బెట్టింగ్ కుంభకోణంలో రూ.1000కోట్ల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. "అన్నీ తెలిసీ" 1x బ్యాట్ బెట్టింగ్ సైట్, దాని సరోగేట్ యాప్‌లను ప్రమోట్ చేసేందుకు విదేశీ సంస్థలతో రైనా, ధవన్ ఒప్పందం కుదుర్చుకున్నారని, ఈ మేరకు ఇద్దరికీ విదేశాల నుంచి అక్రమపద్ధతిలో చెల్లింపులు జరిగాయని ఈడీ పేర్కొంది. సదరు విదేశీ సంస్థలు భారత్‌లోని వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని 1x బ్యాట్, 1x బ్యాట్ స్పోర్టింగ్ లైన్స్ తదితర సైట్లను నిర్వహిస్తున్నారంటూ పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. దీంతో ఈ కేసు ఈడీ చేతుల్లోకి వెళ్లింది. భారత్‌లోని దాదాపు 6వేల మ్యూల్ అకౌంట్ల ద్వారా 1x బ్యాట్ సైట్ కార్యకలాపాలను సాగిస్తున్నట్లు దర్యాప్తులో ఈడీ గుర్తించింది. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా మరో మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, నటుడు సోనూసూద్, టీఎంసీ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి, బెంగాల్ నటుడు అంకుశ్ హజ్రాను ఇప్పటికే ఈడీ ప్రశ్నించింది.

ఇదేం పిచ్చి?

» ఓటర్ ఐడీల్లో తన ఫొటో వాడడంపై బ్రెజిల్ మోడల్ స్పందన

న్యూఢిల్లీ, నవంబరు 6: హరియాణా ఎన్నికల్లో బీజేపీ ఓట్ చోరీపై 'హైడ్రోజన్ బాంబు' పేల్చే క్రమంలో.. రాహుల్ గాంధీ ప్రస్తావించిన మోడల్ ఎవరో తెలిసిపోయింది. ఆమె బ్రెజిలియనే. కానీ మోడల్ కాదు. పేరు లారిస్సా నెరీ. తన స్నేహితుడైన ఫొటోగ్రాఫర్ మాథ్యూస్ ఫెర్రెరో ఫొటోలకు 2017లో అలా పోజులిచ్చిందంతే! అది తప్ప ఆమె మోడలింగ్ చేసిన ఫొటోలు మరేవీ లేవు. రాహుల్ తన మీడియా సమావేశంలో ఆమె ఫొటోను ప్రదర్శించి.. 'ఈమె ఎవరు?' అని ప్రశ్నించడంతో నెటిజన్లంతా ఆమె ఆచూకీ కోసం గూగుల్‌లో, ఇన్‌స్టా, ఎక్స్ ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో తెగ గాలించారు. రాహుల్ ప్రదర్శించిన ఫొటో ఆధారంగా ఇమేజ్ సెర్చ్ కూడా చేశారు. కానీ ఎక్కడా ఆమె ఆచూకీ తెలియరాలేదు. అయితే.. తన ఫొటో ఇంటర్‌నెట్‌లో సెన్సేషన్‌గా మారడంతో లారిస్సా నెరీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా స్పందించింది. అది తన పాత ఫొటో అని.. ఆ ఫొటో తీసే సమయానికి తన వయసు 18-20 ఏళ్లని తెలిపింది. "గైస్.. అది పాత ఫొటో.. ఇండియాలో ఎన్నికల కోసమో.. ఓటింగ్‌కు సంబంధించో.. నా ఫొటోను వాడుకుంటున్నారు. ప్రజలను మోసం చేయడానికి నన్ను భారతీయురాలిగా చిత్రీకరిస్తున్నారు. ఇదేం పిచ్చి? ఇదేం వెర్రి? దేవుడా.. మనం ఎలాంటి ప్రపంచంలో బతుకుతున్నాం" అని నవ్వుతూ ఆశ్చర్యం వెలిబుచ్చింది. తాను ప్రస్తుతం ఒక సెలూన్‌లో పనిచేస్తున్నానని.. తన ఫొటో వైరల్ కావడంతో ఒక పాత్రికేయుడు తాను పనిచేస్తున్న సెలూన్‌కు ఫన్ చేసి ఇంటర్వ్యూ కోసం కూడా అడిగాడని తెలిపింది.

లోకం తీరు



చెరువులో వేలాది ఆధార్‌కార్డులు..

» 'సర్' కొనసాగుతున్న వేళ బెంగాల్‌లో వివాదం

కోల్‌కతా, నవంబరు 6: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సాగుతున్న సమయంలో పశ్చిమ బెంగాల్‌లోని ఓ చెరువులో వేలాది ఆధార్‌కార్డులు లభించడం రాజకీయ దుమారం రేపింది. పూర్బస్థలీ ఉత్తర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఈ ఘటన జరిగింది. సీఎం మమతా బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్ దేశ అంతర్గత భద్రతను తాకట్టు పెట్టాయన్ని బీజేపీ ఆరోపించింది. ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిలిప్పీన్స్‌ను కుదిపేసిన తుఫాను.. 241 మంది మృతి

మనీలా, నవంబర్ 6: ఫిలిప్పీన్స్‌పై విరుచుకుపడిన కల్మేగీ తుఫాను 241మంది ప్రాణాలను హరించింది. మరో 127మంది గల్లంతయ్యారు. సెబూ ప్రావిన్స్ విపరీతమైన నష్టాన్ని చవిచూసింది. ఇక్కడ ఒకేరోజులో దాదాపు ఒకటిన్నర నెలల వర్షపాతం నమోదైంది. ఫలితంగా వరదలు నివాస ప్రాంతాలను ముంచెత్తాయి. వేలాది ఇళ్లు కొట్టుకుపోగా, వీధులన్నీ మునిగిపోయాయి. ఐదు లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

కంచి ఆలయంలో 'బంగారు బల్లి' మాయం?

చెన్నై, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం వరదరాజపెరుమాళ్ ఆలయంలో 'బంగారు బల్లి' మాయమైనట్లు వార్తలు రావడంతో స్థానికంగా కలకలం రేగింది. బంగారు బల్లి మాయమైనట్లు శ్రీరంగం ప్రాంతానికి చెందిన భక్తుడు రంగరాజ నరసింహన్ విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఆ విభాగం డీఎస్పీ సంపత్ నాయకత్వంలో ఆరుగురు సభ్యులున్న దర్యాప్తు బృందం ఆ ఆలయానికి వెళ్లి అక్కడున్న విగ్రహాలను పరిశీలించింది. ఆలయంలోని భట్టాచార్యులు, స్థానికర్లు, మణియకార్లు, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులను విచారించింది. బంగారు బల్లి మాయమైందా? లేదా? అనే విషయంపై దర్యాప్తు బృందం సభ్యులు ఎలాంటి ప్రకటన చేయలేదు.

జేఎన్‌యూ ఎన్నికల్లో లెఫ్ట్ యూనిటీ విజయం

న్యూఢిల్లీ, నవంబరు 6: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థి సంఘం ఎన్నికల్లో లెఫ్ట్ యూనిటీ విజయం సాధించింది. ఏబీవీపీని ఓడించి సెంట్రల్ ప్యానల్‌లోని కీలకమైన నాలుగు స్థానాలను దక్కించుకొంది. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ), డెమొక్రాటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (డీఎస్ఎఫ్)లు కలిసి లెఫ్ట్ యూనిటీ పేరుతో పోటీ చేశాయి. ఆదితి మిశ్ర 449 ఓట్ల ఆధిక్యంతో అధ్యక్షురాలిగా గెలిచారు.

అనిల్ అంబానీకి మళ్లీ ఈడీ పిలుపు

న్యూఢిల్లీ, నవంబరు 6: బ్యాంకు మోసానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ (66)కి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా మరోసారి సమన్లు జారీ చేసింది. నవంబరు 14న తమ ముందు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

మధుమేహం పరీక్ష మరింత సులువు!

» కొత్త పరికరానికి పేటెంట్ పొందిన ఐఐటీ మద్రాస్ శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, నవంబరు 6: రక్తంలో చక్కెర స్థాయిలను గుర్తించేందుకు ఐఐటీ మద్రాస్ శాస్త్రవేత్తలు సరికొత్త పరికరాన్ని ఆవిష్కరించారు. తక్కువ ఖర్చుతో కూడిన, వినియోగించేందుకు సౌలభ్యంగా ఉండే, తక్కువ నొప్పితో కూడిన గ్లూకోజ్ మానిటరింగ్ పరికరాన్ని అభివృద్ధి చేశారు. ఈ డివైజ్‌పై ఐఐటీ మద్రాస్ శాస్త్రవేత్తలు పేటెంట్ పొందినట్లు అధికారులు వెల్లడించారు. మధుమేహ పరీక్షను మరింత సమర్థవంతంగా, తక్కువ ఖర్చుతో, అధిక కచ్చితత్వ, విశ్వసనీయత ప్రమాణాలతో అందుబాటులోకి తీసుకురావడం దీని తయారీ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ పరసురామన్ స్వామినాథన్ నేతృత్వంలో ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ అండ్ థిన్ ఫిల్మ్స్ ల్యాబ్ శాస్త్రవేత్తలు డిస్పోజబుల్ మైక్రోనీడిల్ సెన్సార్ ప్యాచ్‌లతో ఈ పరికరాన్ని అభివృద్ధి చేసినట్లు ప్రొఫెసర్ స్వామినాథన్ పేర్కొన్నారు.

సింధ్ కొండల్లో రహస్య సొరంగాలు

» అణ్వాయుధ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పాక్

ఇస్లామాబాద్, నవంబరు 6: పాకిస్థాన్ అణ్వాయుధాలను పరీక్షిస్తోందన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలను దాయాది దేశం నిజం చేస్తున్నట్టే కనిపిస్తోంది. అణు పరీక్షల కోసం సింధ్ ప్రాంత కొండలను ఆ దేశం సిద్ధం చేస్తున్నదన్న వార్తలు వస్తున్నాయి. దీనికోసం పాక్ సైన్యం అక్కడి కొండలను తొలచి రహస్య సొరంగాలను, భూగర్భ గదులను నిర్మిస్తున్నదంటూ సింధూదేశ్ అనే వేర్పాటువాద సంస్థ, అక్కడి పౌర సమాజ గ్రూపులు వాదిస్తున్నాయి. ఈ ప్రయత్నం నుంచి పాక్‌ను అడ్డుకోవాలంటూ ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ ఆంటోనియో గుటెరస్‌తోపాటు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ, ఐరాస అనుబంధ మానవ హక్కులు, అణు నిరాయుధీకరణ విభాగాల ప్రతినిధులకు అవి లేఖలు రాశాయి. అతి గోప్యంగా అణుపరీక్షలు నిర్వహించడం, అణ్వాయుధ నిల్వలను తరలించడం అనేది ఈ సన్నాహాల ఉద్దేశం అయి ఉండవచ్చునని తెలిపాయి. దీనివల్ల సింధ్ ప్రాంత భద్రత ప్రమాదంలో పడనున్నదని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశాయి. సింధ్ ముత్తహిద మహజ్ అనే పౌర సమాజ గ్రూపు చైర్మన్ షఫీ బుర్ఫాత్ పేరిట మీడియాకు విడుదల చేసిన ఈ లేఖలో సింధ్‌లో ఎక్కడెక్కడ సొరంగాలను తవ్వుతున్నారనే వివరాలను పొందుపరిచారు.

తొలి దశలో 64.66% ఓటింగ్

» బిహార్‌లో తొలిసారి భారీ పోలింగ్

న్యూఢిల్లీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బిహార్ చరిత్రలోనే మొదటిసారిగా 64.66% మంది గురువారం జరిగిన తొలి విడత ఎన్నికల్లో ఓటు వేశారు. 18 జిల్లాల్లోని 121 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాల్గొన్న 3.75 కోట్ల మంది ప్రజలు ఉత్సాహంతో పోలింగ్‌లో పాల్గొన్నారు. 1,314 మంది అభ్యర్థులు తొలి దశలో తమ భవిష్యత్తును పరీక్షించుకున్నారు. వీరిలో 122 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. గత మూడు దశాబ్దాల్లో అత్యధిక పోలింగ్ జరిగిందంటే అర్థం నవంబరు 14న ప్రజలు కొత్త ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తున్నట్లే స్పష్టమవుతోందని జన సురాజ్ సంస్థాపకుడు, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. 1998లో మొదటిసారి లోక్‌సభ ఎన్నికల్లో 64.66% పోలింగ్ జరిగినపుడు బీజేపీ, సమతా పార్టీ కలిసి 30 సీట్లు గెలుచుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 2000లో పశుగ్రాసం కుంభకోణంతో లాలూ ప్రసాద్ యాదవ్ రాజీనామా అనంతరం జరిగిన ఎన్నికల్లో 62.57% ఓటర్లు పోలింగ్‌లో పాల్గొని రబ్డీ దేవి సారథ్యంలో ఆర్‌జేడీని అత్యధిక మెజారిటీతో గెలిపించారు. ఈసారి మొదటిసారి అత్యధిక శాతం మంది ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనడంతో మార్పు ఖాయమంటున్నారు. తొలిదశ పోటీలో రాఘోపూర్ నుంచి ఆర్‌జేడీ నేత, సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్, బీజేపీ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధురి, మహువా నుంచి తేజస్వి సోదరుడు తేజ్ ప్రతాప్, అలీనగర్ నుంచి బీజేపీ సీనియర్ నేత మైథిలీ ఠాకూర్, మొకామా నుంచి జేడీ(యూ) నేత, హత్యానేరంపై జైలు పాలైన అనంత్ సింగ్ తదితర ప్రముఖులు ఉన్నారు.

త్రికోణపు పోటీ..

అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి పూర్తి స్థాయిలో జన సురాజ్ పార్టీ నేత ప్రశాంత్ కిశోర్ ఎన్నికల ప్రచారంలో తిరగడంతో చాలా చోట్ల త్రికోణపు పోటీ ఏర్పడింది. ఈ పార్టీ అన్ని స్థానాల్లో పోటీకి దిగింది.



ఓటు వేసిన లాలూ ప్రసాద్ యాదవ్, రబ్డీదేవి, తేజస్వీ యాదవ్

డిప్యూటీ సీఎంకు నిరసన సెగ

బిహార్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత విజయ్ కుమార్ సిన్హాకు నిరసన సెగ తగిలింది. లఖీసరాయ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆయన పోలింగ్ నేపథ్యంలో తన నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం సందర్శించారు. ఓ గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్తుండగా పెద్ద సంఖ్యలో ప్రజలు ఆయన కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. సిన్హాకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆయన కాన్వాయ్‌పై రాళ్లు, చెప్పులు, ఆవు పేడ విసిరారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

తేజస్వి యాదవ్ గతంలో తన తల్లి రబ్డీ దేవీని ఓడించిన బీజేపీ నేత సతీష్ కుమార్‌ను ఎదుర్కొంటున్నారు. సతీష్ ఈసారి జేడీ(యూ) గుర్తుపై పోటీ చేస్తున్నారు. మొత్తం 45,341 పోలింగ్ స్టేషన్లలో అత్యధిక పోలింగ్ స్టేషన్లు (36,733) గ్రామీణ ప్రాంతాల్లోనే ఉండడం గమనార్హం. ఈ ఎన్నికల్లో దాదాపు 10.72 లక్షల మంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారు. ఎన్డీఏకు మహాగఠ్‌బంధన్‌కు మధ్య ప్రధాన పోటీ జరుగుతున్నప్పటికీ ఎన్డీఏలో ఐదు పార్టీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. వీటిలో జనతాదళ్ (యునైటెడ్), బీజేపీ, చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ, జితన్ రాం మాంఝీకి చెందిన హిందుస్థాన్ అవామీ మోర్చా, ఉపేంద్ర కుశ్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా ఉన్నాయి. మహాగఠ్‌బంధన్‌లోనూ ఆరు పార్టీలు రంగంలో ఉన్నాయి. వీటిలో ఆర్‌జేడీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్), వికాస్‌శీల్ ఇన్సాఫ్ పార్టీ (ముఖేష్ సహానీ) ఉన్నాయి. ఇక ఎన్నికలకు రెండు నెలల ముందు ఎన్నికల కమిషన్ నిర్వహించిన వివాదాస్పద ప్రత్యేక ఓటర్ల జాబితా విస్తృత సవరణ (ఎస్ఐఆర్) వివాదాస్పదంగా మారింది. బీజేపీని గెలిపించేందుకే ఈ సవరణ చేపట్టారని, లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించనున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. సుప్రీంకోర్టు ఆధార్‌ను కూడా గుర్తింపు కార్డుగా అంగీకరించాలని కమిషన్‌ను ఆదేశించడంతో ఈ ఆరోపణలు సద్దుమణిగాయి. అయితే అదే సమయంలో కర్ణాటక, హరియాణా, మహారాష్ట్ర తదితర స్థానాల్లో ఎన్నికల కమిషన్ భారీ అక్రమాలకు తావిచ్చిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. పోలింగ్‌కు ఒకరోజు ముందు రాహుల్ గాంధీ ఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఓ బ్రెజిలియన్ మోడల్ లరిస్సా పేరుతో 22సార్లు బోగస్ ఓటింగ్ జరిగిందని ఆధారాలతో బయటపెట్టారు. దాదాపు 25 లక్షల ఓట్లను హరియాణాలో చోరీ చేశారని ఆరోపించారు. ఈ ప్రభావం పోలింగ్‌పై పడే అవకాశాలున్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కాగా బిహార్ అసెంబ్లీ తొలి దశ ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదు కావడం ప్రజాస్వామ్య విజయమని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ గురువారం పేర్కొన్నారు.

ఈ చీమలతో

బతకడం నా వల్ల కాదు

» లేఖ రాసి పెట్టి వివాహిత బలవన్మరణం



అమీన్‌పూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆమెకు చీమ అంటే జుగుప్స, భయం! చీమల గుంపే కాదు.. ఒక్క చీమ కనిపించినా కెవ్వున కేక పెట్టి బిగుసుకుపోయేది. చివరికి.. ఆ చీమలతో బతకడం తనవల్ల కాదని.. తమ మూడేళ్ల పాపను జాగ్రత్తగా చూసుకోవాలంటూ భర్తను ఉద్దేశించి ఓ లేఖ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకుంది. తెలంగాణలో సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ నరేశ్, మృతురాలి భర్త, ఆమె తల్లిదండ్రులు, స్థానికుల కథనం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన శ్రీకాంత్‌కు, ద్యావణపెల్లి మనీషా (25)కు నాలుగేళ్ల క్రితం పెళ్లయింది. ఈ దంపతులకు మూడేళ్ల పాప అన్విక ఉంది. ఈ కుటుంబం రెండున్నరేళ్లుగా అమీన్‌పూర్‌లోని నవ్య హోమ్స్ కాలనీలోని ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. చీమలంటే జుగుప్స, భయంతో వణికిపోయే 'మింకాఫోబియా'తో మనీషా బాధపడుతోంది. దీన్నుంచి బయటపడేసేందుకు ఆమెకు వైద్యులతో కౌన్సెలింగ్ కూడా ఇప్పిస్తున్నారు. అయినా నయం కాలేదు. చీమలంటే భయమూ పోలేదు. మంగళవారం సాయంత్రం చిన్నారి అన్వికను కాలనీలో తెలిసిన వారి ఇంట్లో దిగబెట్టి.. ఇంటిని శుభ్రం చేయాల్సి ఉందంటూ మనీషా వెళ్లింది. బయటి నుంచి వచ్చిన భర్త.. ఇంటి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. ఇరుగుపొరుగు సాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా.. గదిలో మనీషా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. ఆ పక్కనే... 'అయామ్ సారీ శ్రీ (భర్త).. ఈ చీమలతో బతకడం నావల్ల కాదు. అన్వి (కుమార్తె) జాగ్రత్త. అన్నవరం, తిరుపతి హుండీల్లో రూ. 1116 చొప్పున వేయాలి. ఎల్లమ్మకు ఒడిబియ్యం పోయడం మర్చిపోవొద్దు' అంటూ మనీషా రాసిన లేఖ లభ్యమైంది.

న్యూయార్క్ ప్రజలు ఫ్లోరిడాకు పారిపోవాల్సిందే!

డెమొక్రాట్లు ఓ కమ్యూనిస్టును కూర్చోబెట్టారు.. అమెరికాను క్యూబా, వెనెజువెలాలా మార్చాలని యత్నం

» న్యూయార్క్‌లో ఆర్థిక, సామాజిక విపత్తు తప్పదు

» కమ్యూనిజమా, కామన్‌సెన్సా? ఏదికావాలో తేల్చుకోవాలి

» మమ్దానీ చాలా ఆగ్రహంగా ప్రసంగించారు

» నా పట్ల మర్యాదగా ఉంటే మంచిది: ట్రంప్ హెచ్చరిక



మియామి, నవంబరు 6: న్యూయార్క్ కొత్త మేయర్‌గా ఎన్నికైన డెమొక్రాట్ పార్టీ నేత జోహ్రాన్ మమ్దానీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విరుచుకుపడ్డారు. విజయోత్సవంలో జోహ్రాన్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. బుధవారం ఫ్లోరిడాలోని మియామిలో జరిగిన అమెరికా బిజినెస్ ఫోరం సదస్సులో ట్రంప్ మాట్లాడారు. ఏడాది క్రితం నవంబరు5న (ట్రంప్ గెలిచిన రోజు) అమెరికన్లు తమ సార్వభౌమత్వాన్ని తిరిగి నిలుపుకొన్నారని.. ఇప్పుడు న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో అందులో కొంత పోగొట్టుకున్నారని వ్యాఖ్యానించారు. అమెరికన్లకు ఇప్పుడు కమ్యూనిజమా, కామన్ సెన్సా ఏది కావాలో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. "మమ్దానీయా.. న్యూయార్క్‌లో అతడి పేరు ఏదైతే ఏంటి? మహిళల క్రీడల్లో మగవాళ్ల ఆడటం ఆయనకు అద్భుతంగా అనిపిస్తుంది"అని ఎద్దేవా చేశారు. డెమొక్రాట్లు దేశంలోని పెద్ద నగరంలో కమ్యూనిస్టును తీసుకొచ్చి కూర్చోబెట్టారని విమర్శించారు. "డెమొక్రాట్లు అమెరికాను ఏం చేయాలని కోరుకుంటున్నారో తెలుసా? న్యూయార్క్ ఎన్నికల ఫలితాన్ని చూస్తే తెలుస్తుంది. వాళ్లు అమెరికాను క్యూబా, వెనెజువెలాలా మార్చాలని చూస్తున్నారు. అక్కడేం జరిగిందో మీకు తెలుసు. ఇలా జరగకూడదని నేను భావించాను. న్యూయార్క్‌కు ఆర్థిక, సామాజిక విపత్తు తప్పదు. ప్రజలు న్యూయార్క్‌ను వదిలేసి ఫ్లోరిడాకు పారిపోవాల్సి వస్తుంది. వారికి మియామి 'శరణార్థి' క్యాంపులా మారిపోతుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నంత వరకు అమెరికాలో ఏరకంగానూ కమ్యూనిజాన్ని అనుమతించబోనని, దానిని ఇక్కడే ఆపుతానన్నారు. కమ్యూనిస్టు పాలనలో తాను ఉండలేనని, న్యూయార్క్ నగరాన్ని వీడుతానని చెప్పారు. మేయర్ ఎన్నికల్లో గెలిచిన అనంతరం మమ్దానీ చాలా ఆగ్రహంగా ప్రసంగించారని, కానీ తన విషయంలో మర్యాదగా ఉంటే మంచిదని ట్రంప్ పేర్కొన్నారు. న్యూయార్క్ మేయర్‌గా ఆయనకు రావాల్సిన అన్నింటినీ ఆమోదించాల్సింది తానేనని చెప్పారు. ప్రసంగం చివరిలో ట్రంప్ తనదైన శైలిలో నృత్యం చేశారు. కాగా.. జోహ్రాన్ మమ్దానీ గెలిస్తే తాము న్యూయార్క్ వదిలి వెళ్లిపోతామని 9శాతం మంది ప్రజలు చెప్పారని ఎన్నికల ముందు సర్వే చేసిన జేఎల్ పార్టనర్స్ వెల్లడించింది.

భారత్-పాక్ యుద్ధంలో 8 ఫైటర్లు కూలాయి

భారత్-పాక్ యుద్ధంలో 8 యుద్ధ విమానాలు కూలిపోయాయని ట్రంప్ పేర్కొన్నారు. ఆ యుద్ధాన్ని ఆపింది తానేనని మరోసారి చెప్పారు. "భారత్-పాక్ యుద్ధంలో 7 విమానాలు కూలిపోయాయి. మరొకటి తీవ్రంగా దెబ్బతింది. మొత్తం 8 ఫైటర్లు కూలిపోయాయి. వాణిజ్య ఒప్పందం చేసుకోబోనని హెచ్చరించి ఆ యుద్ధం ఆపాను" అని మియామి సదస్సులో పేర్కొన్నారు. కాగా, ట్రంప్ ఇలా ప్రకటన చేయడం 58వసారని, కానీ ప్రధాని మోదీ ఏమీ మాట్లాడరేంటని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

ర్యాప్ సింగర్ నుంచి న్యూయార్క్ మేయర్‌గా..

» హిందీ, బెంగాలీ, స్పానిష్ భాషల్లోనూ అనర్గళంగా మాట్లాడగల జోహ్రాన్ మమ్దానీ

» పేదలకు ఇళ్లు, ఉచిత ప్రజా రవాణా హామీలు

» మోదీ యుద్ధ నేరస్తుడు అంటూ గతంలో విమర్శలు



న్యూయార్క్, నవంబరు 6: న్యూయార్క్ నగర మేయర్‌గా విజయం సాధించి సంచలనం సృష్టించిన జోహ్రాన్ మమ్దానీ.. మొదట్లో హౌజింగ్ కౌన్సెలర్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే పేదలు సొంతింటి కోసం ఎంతగా తపిస్తారో చూశారు. ఆ సమయంలోనే ర్యాప్ సింగర్‌గా మారారు. 'యంగ్ కార్డమామ్, మిస్టర్ కార్డమామ్' పేరుతో కొన్నిపాటల వీడియోలూ చేశారు. న్యూయార్క్ ఆధునిక హిప్-హాప్ సంగీతాన్ని, దక్షిణాసియా బాణీలను కలగలిపి ప్రయత్నించారు. రాజకీయాల్లోకి వచ్చాక మంచి ప్రజాదరణ పొందారు. 2020లో డెమొక్రాట్ పార్టీ తరఫున న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. పేదలకు ఇళ్లు, ఉచిత ప్రజా రవాణా, ఉచితంగా పిల్లల సంక్షేమం, అద్దెల నియంత్రణ కోసం గట్టిగా డిమాండ్ చేశారు. ధనికులపై పన్నులు పెంచి వీటిని అమలు చేస్తానని న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో వాగ్దానం చేశారు. అమెరికాకు మిత్రదేశమైన ఇజ్రాయెల్ గాజాపై చేసిన దాడులను తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఒకవేళ న్యూయార్క్ వస్తే అరెస్ట్ చేస్తామనీ ప్రకటించారు. ప్రధాని మోదీని 'యుద్ధ నేరస్తుడు (వార్ క్రిమినల్)' అంటూ విమర్శించి కలకలం రేపారు. వలసలకు వ్యతిరేకంగా ట్రంప్ చేపట్టిన చర్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. హిందీ, బెంగాలీ, స్పానిష్ భాషల్లో కూడా అనర్గళంగా మాట్లాడగలిగిన మమ్దానీ.. న్యూయార్క్‌లో స్థిరపడిన భారతీయులు, ఇతర విదేశీయులనూ ఆకట్టుకున్నారు. సోషల్ మీడియాలోనూ ఆయనకు బలమైన మద్దతు లభించింది. మమ్దానీ తాను ముస్లిం అన్న విషయాన్ని ఎక్కడా దాచుకోలేదు. మసీదులకు కూడా వెళ్లారు. జాతి, మతం అనే వివక్ష ఏదీ ఉండదని.. న్యూయార్క్‌లో ఉండే అందరి సంక్షేమమే తన లక్ష్యమని ప్రకటించారు. చివరికి విజయం సాధించారు.

చౌరబాటుదారులంటే వారికి అభిమానం

» కాంగ్రెస్, ఆర్‌జేడీలపై మోదీ ఫైర్

» ఆర్‌జేడీకి మద్దతివ్వడం రాహుల్‌కు ఇష్టం లేదని వ్యాఖ్య



భాగల్పూర్/అరారియా, నవంబరు 6: విదేశీ చొరబాటుదారుల పట్ల కాంగ్రెస్, ఆర్‌జేడీ అమిత అభిమానం చూపుతున్నాయని ప్రధాని మోదీ ఆక్షేపించారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం శ్రీరాముడిని, ఛఠ్ మాతను అసహ్యించుకుంటున్నాయని విమర్శించారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం భాగల్పూర్, అరారియా జిల్లాల్లో జరిగిన సభల్లో ఆయన ప్రసంగించారు. అయోధ్యలో రామాలయంతో పాటు నిషాదరాజ్ (గుహుడు), శబరి మాత, వాల్మీకి మహర్షి కోసం నిర్మించిన ఆలయాలను సందర్శించడానికి ప్రతిపక్ష నేతలు విముఖత చూపుతున్నారని.. దళితులు, వెనుకబడిన తరగతులంటే వారికున్న ద్వేషానికి ఇదే రుజువని చెప్పారు. ఆర్‌జేడీ, కాంగ్రెస్ మధ్య అంతర్యుద్ధం నడుస్తోందన్నారు. ఈ రెండు పార్టీలకు దేశంలోనే అత్యంత అవినీతి కుటుంబం, బిహార్లోని అత్యంత అవినీతి కుటుంబం సారథ్యం వహిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ 'నామ్‌దార్' (రాహుల్ గాంధీ) కొద్దిరోజులుగా ప్రచారంలో కనిపించడం లేదని.. ఆర్జేడీకి మద్దతివ్వడం ఆయనకు ఇష్టమే లేదని, బలవంతంగా వస్తున్నారని తెలిపారు. 15 ఏళ్ల ఆర్‌జేడీ ఆటవిక పాలనలో రాష్ట్రంలో అభివృద్ధే లేదని.. సీఎం నితీశ్ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్ నుంచి బయటకు తెచ్చేందుకు ఎంతో కష్టపడిందని చెప్పారు.

ఆర్మీ జవాన్ల కులం అడుగుతారా?: అమిత్ షా

బెతియా/మోతిహారి/మధుబని: ఆర్మీ జవాన్ల కులం, మతం గురించి అడుగుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. అందుకు సిగ్గుపడాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మండిపడ్డారు. గురువారం బిహార్‌లోని మధుబని, పశ్చిమ చంపారన్, మోతిహారి జిల్లాల్లో వరుస సభల్లో ఆయన పాల్గొన్నారు. కులం, వర్గాల ఆధారంగా సైనిక సిబ్బందిపై వివక్ష చూపడం తగదన్నారు.

బిహార్లో ఓట్ల చోరీకి బీజేపీ యత్నాలు: రాహుల్

పూర్ణియా: బీజేపీ పూర్తి శక్తియుక్తులతో బిహార్లో ఓట్ల చోరీకి ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిని అడ్డుకునే బాధ్యత యువతపైనే ఉందని చెప్పారు. గురువారం పూర్ణియా, అరారియాల్లో జరిగిన సభల్లో ఆయన ప్రసంగించారు. ఓట్ల దొంగతనంతో ప్రతి ఎన్నికల్లో బీజేపీ గెలుస్తోందని ఆరోపించారు. 'హరియాణా ఎన్నికలను బీజేపీ, ఎన్నికల కమిషన్ తస్కరించాయని యావత్ ప్రపంచానికి మేం చూపించాం. బిహార్లో యువత కూడా అప్రమత్తంగా ఉండాలి' అని ఆయన అన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా కూడా సీతామఢీ, తూర్పు చంపారన్ జిల్లాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక హక్కులను బలహీనపరిచేందుకు ఈసీ మోదీ ప్రభుత్వంతో కుమ్మక్కైందని ఆరోపించారు.

కేంద్రంపై మళ్లీ సీజేఐ ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన విచారణ సందర్భంగా కూడా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కేసు తుది వాదనలు వినడానికి సిద్ధమైన తర్వాత అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి.. ఈ పిటిషన్లపై ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం విచారణ జరపాలని కోరారు. దీనిపై సీజేఐ అభ్యంతరం వ్యక్తం చేశారు. పిటిషనర్ వాదనలు విన్న తర్వాత విస్తృత ధర్మాసనం విచారణ జరపాలని కోరడమంటే ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తప్పించుకొనే ఎత్తుగడేనని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని తాము ఊహించలేదన్నారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం వాదనలు విని, విచారణను ముగిస్తామని, ఆ తర్వాతే విస్తృత ధర్మాసనానికి ఇవ్వాలా?వద్దా? అన్న నిర్ణయం తీసుకుంటామని స్పష్టంచేస్తూ తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. అయితే, అటార్నీ జనరల్(ఏజీ)కు శుక్రవారం అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేసుల విచారణ ఉందని.. ట్రైబ్యునళ్ల కేసు విచారణను వాయిదా వేయాలని గురువారం అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి సీజేఐ ధర్మాసనాన్ని కోరారు. ఇది అసమంజసమని జస్టిస్ గవాయ్ అన్నారు. "ఆయనకు ఇప్పటికే మేం చాలా సమయం ఇచ్చాం. రెండుసార్లు వాదనలు వినిపించేందుకు అవకాశం ఇచ్చాం. ఒకవేళ ఈ అంశం ఈ నెల 24 తర్వాత విచారణకు రావాలని మీరు కోరుకుంటున్నారా? అలాంటి ఉద్దేశం ఉంటే నిజాయితీగా చెప్పండి" అని ఈ నెల 23న పదవీ విరమణ చేయనున్న సీజేఐ పేర్కొన్నారు. ఈ కేసు విచారణను సోమవారం చేపట్టాలని ఐశ్వర్య కోరగా.. సీజేఐ చిరాకుపడ్డారు. "అలాగైతే మేం తీర్పు ఎప్పుడు రాయాలి? ఆయన మధ్యవర్తిత్వంతో బిజీగా ఉన్నారని ప్రతిరోజూ మాకు చెబుతారు. చివరి దశలో వచ్చి విస్తృత ధర్మాసనానికి కేసును బదిలీ చేయమని కోరతారు"అని వ్యాఖ్యానించారు. ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం తరఫున మరో న్యాయనిపుణుడు ఎందుకు హాజరవకూడదని ప్రశ్నించారు. శుక్రవారం తుది వాదనలు వింటామని స్పష్టం చేశారు. అలాగే అటార్నీ జనరల్‌కు సోమవారం వాదనలు వినిపించేందుకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపింది. "ఆ రోజు ఆయన రాకపోతే, కేసును ముగించేస్తాం" అని సీజేఐ స్పష్టం చేశారు.

వందేమాతరానికి 150 ఏళ్లు

» నేడు 10 గంటలకు గేయాన్ని ఆలపిద్దాం: పవన్



అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ రణనినాదంగా నిలిచిన గేయం 'వందేమాతరం' అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొనియాడారు. ఈ గేయం శుక్రవారం నాటికి 150 ఏళ్లు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. బంకిమ్ చంద్ర చటర్జీ రాసిన ఈ గేయం యావత్ దేశాన్ని ఉద్యమ స్ఫూర్తితో నడిపించిందని, స్వతంత్ర సమరయోధులకు మనోబలాన్ని ఇచ్చిందని అన్నారు. వందేమాతరం గురించి భావితరాలకు మనంగా తెలియజేయాలని, దేశవ్యాప్తంగా నిర్దేశిత సమయంలో ప్రజలందరూ ఈ గేయాన్ని ఆలపించాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. 'శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రతి ఒక్కరూ ఈ గేయాన్ని ఆలపిద్దాం. దీని స్ఫూర్తిని భావితరాలకు అందించే బాధ్యత మనందరిదీ' అని పిలుపునిచ్చారు.

డ్రగ్స్ తీసుకో బ్రో.. ఇదే జగన్ పార్టీ నినాదం!

» యువతను నాశనం చేస్తున్న వైసీపీ.. హోం మంత్రి అనిత మండిపాటు



అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేటి యువతే రేపటి భవిత అని నమ్మిన నేత సీఎం చంద్రబాబు అని, ఆయన నిర్దేశకత్వంలో రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి లేకుండా చేయాలని ప్రజాప్రతినిధులంతా కష్టపడుతుంటే వైసీపీ మాత్రం డ్రగ్స్‌ను ప్రోత్సహించేలా వ్యవహరిస్తోందని హోం మంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. డ్రగ్స్ వద్దు బ్రో నినాదాన్ని పాఠశాల స్థాయికి తీసుకెళ్లామని, కానీ వైసీపీ మాత్రం డ్రగ్స్ తీసుకో బ్రో అంటూ యువతను నాశనం చేస్తోందని అన్నారు. తాజాగా వైసీపీ విద్యార్థి విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడు పులగం కొండారెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ దందా నడిపిస్తున్నారని, ఇది జగనకు తెలియకుండా జరుగుతుందా? అని ప్రశ్నించారు. కొండారెడ్డిని సస్పెండ్ చేయాల్సింది పోయి అతనితో మీటింగ్‌లు ఏమిటని నిలదీశారు.

పీపీపీతో మెరుగైన విద్య, వైద్యం: మంత్రి కొండపల్లి

» శవ రాజకీయాలు మానుకోండి: మంత్రి సంధ్యారాణి

విజయనగరం నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలపై వైసీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పీపీపీ విధానంతో మెడికల్ సీట్లు పెరుగుతాయని, పేదలకు ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యం అందుతుందని అన్నారు. గురువారం విజయనగరంలో జరిగిన జడ్పీపీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క విజయనగరం వైద్య కళాశాలలో పూర్తి స్థాయిలో వసతులు కల్పించి, పూర్తి చేయాలంటే ఇంకా రూ.600 కోట్లు అవసరమని గుర్తు చేశారు. వైద్య కళాశాలల పీపీపీ విధానంపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారం మానుకోవాలన్నారు. మరో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ.. 'పార్వతీపురం మన్యం జిల్లాలో వైద్య కళాశాలకు స్థల 'సేకరణే జరగలేదు. దీనిపై కూడా రాద్ధాంతం చేయడం తగదు' అని అన్నారు.

హరియాణాలో బీజేపీ ఓట్ల చోరీ: షర్మిల

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): హరియాణాలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్పడిన ఓట్ల చోరీపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హైడ్రోజెన్ బాంబు పేల్చారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. గురువారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో పీసీసీ సీనియర్ నేతలు జేడీ శీలం, మస్తాన్ వలి, నరహరిశెట్టి నరసింహారావు తదితరులతో కలసి ఆమె మీడియాతో మాట్లాడారు. 'హరియాణాలో 25 లక్షల దొంగ ఓట్లను సృష్టించి బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడింది. దీనిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 17.65 లక్షల సంతకాలను సేకరించి ఢిల్లీకి పంపుతున్నాం' అని తెలిపారు.

ఇవేమి వ్యాఖ్యలు షర్మిలా: బీజేపీ

షర్మిల 'దొంగ ఓట్ల' వ్యాఖ్యలు దేశ ప్రజాస్వామ్యాన్ని అవమాన పరిచేలా ఉన్నాయని బీజేపీ మండిపడింది. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు భారత ఎన్నికల సంఘం మూల స్తంభం. దానిపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న చెత్త ఆరోపణలు, అబద్ధాలు ప్రజాస్వామ్యానికే ప్రమాదమని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యానించారు.

ఎస్పీఎఫ్‌లో ఎస్ఐ, పీసీ నియామకాలు

» 26 ఎస్ఐ, 291 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి పచ్చజెండా

అమరావతి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్)లో ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర సచివాలయంతో పాటు పలు కీలక ప్రాంతాలకు రక్షణ కల్పించే ఎస్పీఎఫ్‌లో 26 సబ్ ఇన్స్‌పెక్టర్, 291 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అయితే ఈ పోస్టుల భర్తీ 2026-27లో పది మంది ఎస్ఐలు, 125 మంది కానిస్టేబుళ్లు.. ఆ తర్వాత 2027-28లో 9 మంది ఎస్ఐలు, 120మంది కానిస్టేబుళ్ల నియామకానికి హోం శాఖ అనుమతి లభించింది.

మెడికల్ కౌన్సెలింగ్‌లో క్రీడల కోటాపై వివాదం

» ఇతర రాష్ట్రాల వారికి సీట్లు కేటాయించారని ఆరోపణలు

» న్యాయ సలహా, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారమే జాబితా: శాప్

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మెడికల్ కౌన్సెలింగ్‌లో క్రీడల కోటా సీట్ల కేటాయింపుపై తీవ్ర దుమారం రేగింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఐపీఎస్ అధికారి వి.ఎస్.ఆర్. అనంతనాగ్ కుమార్తెకు శాప్ అధికారులు సీటు కేటాయించారని, ఏపీ క్రీడాకారులకు దక్కాల్సిన సీట్లను ఇతర రాష్ట్రాల వారికి ధారాదత్తం చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై శాప్ పరిపాలనాధికారి గురువారం వివరణ ఇచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే 2025-26 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ ప్రవేశాలకు సంబంధించి క్రీడల కోటా కింద అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ లిస్ట్‌ను అక్టోబరు 9న ప్రచురించామని తెలిపారు. దీనిపై అభ్యంతరాలు స్వీకరించేందుకు ఏడు రోజుల గడువు ఇచ్చామన్నారు. ఈ కోటా కింద తన కుమార్తె పద్మావతి పేరును పరిగణించాలని కోరుతూ శాప్‌ను ఐపీఎస్ అధికారి వి.ఎస్.ఆర్. అనంతనాగ్ అర్జీ పెట్టుకున్నారని వివరించారు. దీనిపై న్యాయ సలహా కోసం హైకోర్టుకు శాప్ లేఖ రాసిందన్నారు. ఇదే సమయంలో నవంబరు 5న అనంతనాగ్ హైకోర్టులో శాప్ దీనిని సవాలు చేశారని చెప్పారు. లీగల్ ఒపీనియన్‌తో పాటు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని పద్మావతి పేరును తుది జాబితాలో జోడించి హెల్త్ యూనివర్సిటీకి సమర్పించామని వెల్లడించారు.

సత్యసాయి శతాబ్ది ఉత్సవాలకు రండి

» మంత్రి సత్యకుమార్‌ను ఆహ్వానించిన నిర్వాహకులు

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న శతాబ్ది వేడుకలకు హాజరు కావాలని ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌కు ఆహ్వానం అందింది. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఏపీ అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు గురువారం వెలగపూడి సచివాలయంలో మంత్రిని కలిసి ఆహ్వానపత్రం అందించారు. కచ్చితంగా హాజరవుతానని ఆయన చెప్పారు.

చేపల వేటపై కేంద్రం తాజా మార్గదర్శకాలు

అమరావతి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తీర ప్రాంత సముద్ర జలాల(22 కిలో మీటర్లు) సరిహద్దు అవతల 370 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్న భారత జలాల పరిధిలో కేవలం 320 కిలోమీటర్ల వరకు మత్స్యకార కార్యకలాపాల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసిందని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ సురేష్ తెలిపారు. దీని వల్ల మత్స్యకారులకు, మత్స్యకార సంఘాలకు కలిగే లాభాలను ఆయన ఓ ప్రకటనలో వివరించారు. కేంద్రప్రభుత్వ ప్రత్యేక ఆర్థిక మండలిలో చేపల వేటకు సంబంధించి ఏమైనా రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదాలు తలెత్తితే కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరిస్తారు. మత్స్యకారులకు ఆర్థిక భద్రత కూడా లభిస్తుంది. రికార్డులో నమోదు కాని చేపలు నియంత్రించవచ్చు. జీవవైవిధ్య పరిరక్షణకు అవకాశం ఉంటుంది. ప్రాంతీయ మత్స్య నిర్వహణ సంస్థలు, అంతర్జాతీయ ఒప్పందాలకు అనుగుణంగా చేపల వేట కార్యకలాపాలు చేయాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే.. చట్టపరమైన చర్యలుంటాయి' అని ఆయన వివరించారు.

మీకు అండగా ఉంటా

» రాజకీయంగా ముందుకు తీసుకెళ్తా

» సుబ్బానాయుడి కుటుంబానికి లోకేశ్ భరోసా

» కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, అనుయాయుల వేధింపులపై కుటుంబ సభ్యుల లేఖ

» నేడు, రేపు కల్యాణదుర్గంలో పర్యటన

కావలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్, ఇటీవల ఆకస్మికంగా మరణించిన టీడీపీ సీనియర్ నేత మాలేపాటి సుబ్బానాయుడి కుటుంబాన్ని మంత్రి లోకేశ్ పరామర్శించారు. ఆయన కుటుంబానికి అండగా ఉండటమే కాక రాజకీయంగా ముందుకు తీసుకెళ్లే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. నెల్లూరు జిల్లా దగదర్తిలో సుబ్బానాయుడు, ఆయన సోదరుడి కుమారుడు భానుచందర్ ఇటీవల మృతిచెందిన సంగతి తెలిసిందే. కుటుంబసభ్యులను ఓదార్చేందుకు గురువారం లోకేశ్, మంత్రి ఫరూక్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి దగదర్తికి వచ్చారు. సుబ్బానాయుడి సతీమణి భవాని, ఇతర కుటుంబసభ్యులతో లోకేశ్ ఏకాంతంగా మాట్లాడారు. మాలేపాటి కుటుంబం టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉందని, కావలి ఇన్‌చార్జిగా సుబ్బానాయుడు చేసిన సేవలు, పార్టీ కోసం చేసిన కృషిని వారు వివరించారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక కావలి టీడీపీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆయన అనుచరులు పెట్టిన కష్టాలు, వేధింపులపై ఓ లేఖ అందజేశారు. కొన్ని ఆధారాలు కూడా ఇచ్చారు. వీటిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఇచ్చి.. తగిన నిర్ణయం తీసుకోవాలని మంత్రి చెప్పినట్లు తెలిసింది. అలాగే కుటుంబ సభ్యులను ఈ నెల 19వ తేదీన అమరావతికి వచ్చి కలవాలని సూచించినట్లు కూడా సమాచారం.



మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న లోకేశ్

రెండ్రోజులు కల్యాణదుర్గంలో..

అనంతపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ శుక్ర, శనివారాల్లో అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో పర్యటించనున్నారు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు కల్యాణదుర్గం టీడీపీ కార్యాలయానికి వెళ్తారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని, రాత్రికి అక్కడే బసచేస్తారు. శనివారం ఉదయం కల్యాణదుర్గంలో నిర్వహించే భక్త కనకదాస జయంతి వేడుకల్లో ఆయన పాల్గొంటారు.

లోకేశ్‌కు స్వాగతం పలికి వెళ్తూ..

దగదర్తికి వస్తున్న లోకేశ్‌కు గుడ్లూరు మండలం మోచర్ల హైవే వద్ద కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు ఓ ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో ఒంగోలు వైపు వెళ్లే కారు వేగంగా వచ్చి దానిని ఢీకొనడంతో బోల్తాపడింది. డ్రైవర్‌తోపాటు ఆటోలోని 10 మంది మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కారులో ఉన్న ఆరుగురిలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.



కారు ఢీ కొట్టడంతో నుజ్జునుజ్జయిన ఆటో

2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు

రెండేళ్లలో పూర్తి చేసి జాతికి అంకితం

» 1.24 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి

» 2.48 లక్షల ఎకరాలు స్థిరీకరణ

» ఈ నెలలో ఉత్తరాంధ్రకు చంద్రబాబు

» ఐదేళ్లూ జగన్ ప్రాజెక్టులను గాలికి వదిలేశారు: నిమ్మల



అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇంకా తేదీ ఖరారు కాలేదని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు రెండేళ్లలో రూ.2000 కోట్లు ఖర్చు చేసి ఉత్తరాంధ్రలోని కీలక ప్రాజెక్టులను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. వంశధార, తోటపల్లి, వంశధార-నాగావళి అనుసంధానం, జంఝావతి, హిరమండలం, నాగావళి-చంపావతి, మహేంద్ర తనయ, తారకరామ తీర్థసాగర్, మడ్డువలస రిజర్వాయర్ వంటి కీలక ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని తెలిపారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై జలవనరుల శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఉత్తరాంధ్రలో కీలకమైన తొమ్మిది ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా 1.24 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రావడంతో పాటు 2.48 లక్షల ఎకరాలు స్థిరీకరణ జరుగుతుందని నిమ్మల వెల్లడించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తీసుకురావడంతో పాటు కరవు ప్రాంతాలకు ప్రయోజనం కలిగించే ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. 2019-24 మధ్యకాలంలో ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులను మాజీ సీఎం జగన్ గాలికి వదిలేశారని, ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం నీటిపారుదల రంగాన్ని విధ్వంసం చేస్తే, కూటమి ప్రభుత్వం చిట్టచివరి ఎకరా దాకా సాగునీరు అందించేందుకు కృషి చేస్తోందని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ గాడిలో పెడుతున్నామన్నారు.

పోలవరంపై నేడు, రేపు పీపీఏ సమీక్ష

» నేడు హైదరాబాద్‌లో.. రేపు ప్రాజెక్టు సందర్శన

అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనులపై ఆ ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) రెండు రోజుల పాటు సమీక్ష నిర్వహించనుంది. శుక్రవారం హైదరాబాద్ పీపీఏ కార్యాలయంలో ప్రాజెక్టుపై సీఈవో అతుల్ జైన్ సమగ్ర సమీక్ష చేయనున్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి రాజమండ్రికి జైన్ బృందం చేరుకుంటుంది. శనివారం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తుంది. కీలకమైన డయాఫ్రమ్‌వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణ పనుల తీరును పరిశీలిస్తుంది. ఈ నెలాఖరున అతుల్‌జైన్ రిటైరవుతున్నారు. ఈ నేపథ్యంలో చివరిసారిగా పోలవరం ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు.

ప్రాణం తీసిన అతివేగం

» బాపట్లలో ఇద్దరు యువకుల దుర్మరణం

» బైక్‌పై వెళ్తూ కూడలిలో లారీకి ఢీ



చింతల యశ్వంత్



షేక్ రిజ్వాన్

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అది.. బాపట్లలోని గడియారస్తంభం నాలుగురోడ్ల కూడలి. తెల్లవారుజాము కావడంతో రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. అటుగా వెళ్తున్న ఓ లారీ సరిగ్గా కూడలి మధ్యలోకి వచ్చింది. ఇంతలో మరో రోడ్డులో కూడలి వైపు బైక్‌పై అతివేగంగా వచ్చిన ఇద్దరు యువకులు నేరుగా లారీని ఢీకొట్టారు. వారిద్దరు బైక్‌పై నుంచి ఎగిరిపడి అక్కడికక్కడే మరణించారు. గుంటూరు కొరిటెపాడుకు చెందిన షేక్ రిజ్వాన్ (18), చింతల యశ్వంత్ (21) బుధవారం రాత్రి సూర్యలంక సముద్రతీరానికి వెళ్లారు. అక్కడ అనుమతి లేకపోవటంతో వెనక్కి బయల్దేరారు. గురువారం తెల్లవారుజామున బాపట్లలో ప్రమాదానికి గురయ్యారు. గడియారస్తంభం కూడలిలో చీరాల నుంచి వస్తున్న లారీని వీరి బైక్ బలంగా ఢీకొట్టింది. యశ్వంత్ గుంటూరులోని వస్త్రదుకాణంలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. రిజ్వాన్ గుంటూరులో ఐటీఐ విద్యార్థి. మృతదేహాలను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. బాపట్ల పట్టణ సీఐ ఆర్ రాంబాబు పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. విహారయాత్రకు వచ్చిన ఇద్దరు యువకుల మరణవార్తతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

చెరువులు నిండాయ్!

రాష్ట్రంలోని 38,628 చెరువుల్లో 132.64 టీఎంసీల నీరు

» 19,685 చెరువుల్లో నూరు శాతం నిల్వలు.. 7,048 చెరువుల్లో 75 శాతం నీళ్లు

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎగువ నుంచి భారీగా వస్తోన్న వరద, అల్పపీడనాలతో కురుస్తోన్న భారీ వానలతో చెరువులన్నీ నీళ్ల నిండి కళకళలాడుతున్నాయి. గత పదేళ్లలో లేనంతగా చెరువులన్నీ దాదాపు గరిష్ఠ స్థాయి నీటి నిల్వలతో కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో 38,628 చిన్న, మధ్య, పెద్ద చెరువులు ఉన్నాయి. వీటి సామర్థ్యం 206.21 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 132.64 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. కోస్తాంధ్రలో 26,487 చెరువుల్లో 113.43 టీఎంసీలకుగాను 85.85 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రాయలసీమలోని 12,141 చెరువుల్లో 92.78 టీఎంసీలకు 46.79 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 19,685 చెరువులు నూరుశాతం నిండి 51,48 టీఎంసీల నీటి నిల్వలు కలిగి ఉన్నాయి. 7,048 చెరువులు 75 శాతం మేర నిండి 18.43 టీఎంసీల నీటి నిల్వలతో ఉన్నాయి. నైరుతీ రుతుపవనాలు ప్రారంభం నుంచి నేటిదాకా రాష్ట్రంలో 849.70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక రిజర్వాయర్లలో 1004.48 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ప్రధాన జలాశయాలన్నింటిలోనూ నీటి నిల్వలు భారీగానే కనిపిస్తున్నాయి. శ్రీశైలం గరిష్ఠ నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలకు గురువారం 97.32 శాతం నిల్వ ఉంది. నాగార్జునసాగర్ గరిష్ఠ నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకుగాను 99.81 శాతం నిండి 311.45 టీఎంసీల జలాలు ఉన్నాయి. ఎగువ నుంచి 46,305 క్యూసెక్కుల వరద వస్తుండగా, 33,236 క్యూసెక్కులను దిగువనున్న పులిచింతలకు వదిలేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు గరిష్ఠసామర్థ్యం 45.77 టీఎంసీలకుగాను 97.42 శాతం నిండి 44.59 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీలో నీటి నిల్వ గరిష్ఠ స్థాయి(3.07 టీఎంసీలు)కు చేరింది. ఎగువ నుంచి వస్తున్న 48,699 క్యూసెక్కుల వరదను దిగువకు వదిలేస్తున్నారు.

ఓ ఊరినే దత్తత తీసుకునేంత..!

» చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భారీగా అక్రమాలు

» ఏసీబీ సోదాల్లో బట్టబయలు



చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఏసీబీ అధికారులు

హిందూపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ తనిఖీల్లో పెద్దగా నగదు పట్టుబడకపోయినా.. భారీగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. 'ఇక్కడ చేతులు మారిన సొమ్ముతో ఓ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయొచ్చు..' అంటూ ఏసీబీ అధికారి ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం. ఏసీబీ సోదాలు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలై.. గురువారం ఉదయం 9 గంటలకు వరకూ కొనసాగాయి. సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ అధికారులు కొంత మంది తమ అవినీతి బయటకు రాకుండా ఉండేందుకు కార్యాలయంలో అన్నీ తానై వ్యవహరించే ఓ ప్రైవేట్ వ్యక్తి ద్వారా కొందరికి నెలవారీ మామూళ్లను ఫోన్‌పే ద్వారా పంపినట్లు గుర్తించారు. రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారుల డ్రైవర్లకు సైతం నెలవారీ పంపకాలు జరిగినట్లు గుర్తించారు. చిలమత్తూరు మండలంలోని కొందరు ప్రజాసంఘాల నాయకులకు కూడా క్రమం తప్పకుండా మామూళ్లు చెల్లిస్తున్నట్లు గుర్తించారు. ఈ వివరాలను అనధికారికంగా వెల్లడించిన ఏసీబీ అధికారులు, ఆ చిట్టాను మాత్రం బహిర్గతం చేయలేదు. మామూళ్లను ఫోన్‌పే ద్వారా చెల్లించిన ఆ ప్రైవేట్ వ్యక్తి.. ఆ జాబితాను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారికి పంపించారు. ఎవరెవరికి ఎంత మొత్తం చెల్లించిందనే జాబితా ఏసీబీ అధికారుల చేతికి చిక్కింది. చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే అధికారులు తమ దందా కోసం ఓ ప్రైవేట్ వ్యక్తిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నట్లు విచారణలో తేలింది. కొంత మంది డాక్యుమెంట్ రైటర్లు ఆ వ్యక్తికి నగదు, ఫోన్‌పే రూపంలో సొమ్ము పంపినట్లు తెలుస్తోంది. చిన్న మొత్తాలు మాత్రమే ఫోన్‌పేలో వెళ్లాయని, పెద్ద మొత్తం ఉన్నప్పుడు అధికారులే నేరుగా డీల్ చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. 20 గంటలు జరిగిన సోదాల్లో రికార్డులను పరిశీలించారు.

ఓ ఊరినే దత్తత తీసుకోవచ్చు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన దందాలో కొంతే బహిర్గతమైందని, అక్కడ భారీగా అవినీతి జరిగిందనే విషయం ఓ అధికారి వ్యాఖ్యలను బట్టి అర్థమౌతోంది. ఏసీబీ అధికారులు బుధవారం మధ్యాహ్నం కార్యాలయంలోకి ప్రవేశించగానే అందరి ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆన్‌లైన్ ముడుపుల వ్యవహారం బయటపడింది. ప్రైవేట్ వ్యక్తి ఫోన్‌పే లావాదేవీలను అధికారులు పరిశీలిస్తున్నారు.

విశాఖలో కొనసాగిన ఏసీబీ తనిఖీలు

విశాఖపట్నం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో ఏసీబీ అధికారులు రెండో రోజు గురువారం కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాలు కొనసాగించారు. సూపర్‌బజార్, మధురవాడ, పెదగంట్యాడ కార్యాలయాల్లో బుధవారం తనిఖీలు చేసిన సంగతి తెలిసిందే. అవే కార్యాలయాల్లో గురువారం రికార్డులు పరిశీలించారు. మధురవాడలో రికార్డ్ రూమ్‌కు ఏసీబీ అధికారులు బుధవారం రాత్రి సీల్ వేశారు. గురువారం దానిని తీసి డాక్యుమెంట్లు పరిశీలించారు.

సచివాలయ వ్యవస్థకు కొత్త పేరు..!

» ప్రజలందరూ ఆమోదించేలా నిర్ణయం: మంత్రి డోలా



అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోరిక మేరకు గ్రామ సచివాలయాల పేరు మార్చుతున్నామని, సచివాలయ వ్యవస్థకు ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన పేరు పెట్టబోతున్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి గురువారం తెలిపారు. సచివాలయ వ్యవస్థలో జిల్లా, మండల, గ్రామ స్థాయిలో మూడు అంచెల వ్యవస్థను తీసుకొస్తున్నామన్నారు. ప్రజల వద్దకే పాలనను పరిచయం చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్న విషయం 'నీలి మీడియా' గుర్తించుకోవాలన్నారు. దీన్ని క్రెడిట్ చోరీ అనడం సిగ్గుచేటన్నారు.

'విజన్ యూనిట్ కాదు..' సీఎం కార్యాలయం వివరణ

గ్రామ, వార్డు సచివాలయాల పేరును విజన్ యూనిట్లుగా మార్చారని వస్తున్న వార్తలు అవాస్తవమని ముఖ్యమంత్రి కార్యాలయం వివరణ ఇచ్చింది. 2047 స్వర్ణాంధ్ర విజన్ లక్ష్య సాధన కోసం విజన్ యూనిట్లుగా గ్రామ, వార్డు సచివాలయాలు పనిచేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారని, అంతే తప్ప వాటి పేరను విజన్ యూనిట్లుగా మార్చలేదని పేర్కొంది.

గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో అగ్రస్థానం లక్ష్యం

» రాష్ట్రంలో హబ్ ఏర్పాటు దిశగా ముమ్మర చర్యలు: సీఎస్

అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీని 2030 నాటికి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిని చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఏపీ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అడ్వయిజరీ బోర్డు కో-చైర్మన్ కె.విజయానంద్ చెప్పారు. బోర్డు తొలి సమావేశం గురువారం సచివాలయంలో జరిగింది. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ద్వారా విశాఖపట్నం సమీపంలోని పూడిమడక వద్ద హైడ్రోజన్ హబ్ రూపొందిస్తున్నామని సీఎస్ తెలిపారు. రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడితో 20 గిగావాట్ రెన్యువబుల్ ఎనర్జీ సామర్థ్యంతో రోజుకు సుమారు 1500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి కృషి జరుగుతోందని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సభ్యుడు, అడ్వయిజరీ బోర్డు చైర్మన్ డాక్టర్ వీకే సారస్వత్ మాట్లాడుతూ.. గ్రీన్ హైడ్రోజన్‌ను స్థానికంగా ఉన్న స్టీల్ ప్లాంట్లు, ఎరువుల తయారీ పరిశ్రమలు, ఓడరేవులు పెద్ద ఎత్తున వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే సీఐఐ సదస్సులో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి సంబంధించిన కొన్ని ఎంవోయూలు జరగనున్నట్లు ఏపీ గ్రీన్‌కో ఏజీఎం డాక్టర్ రామ్‌కుమార్ తెలిపారు.

రెవెన్యూ వసూళ్లు నూరుశాతం సాధించాలి

అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ వసూళ్లు నూరుశాతం సాధించాలని సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి కోరారు. విజయవాడలోని సర్కిల్ కార్యాలయంలో గురువారం అన్ని జిల్లాల ఎస్ఈలు, ఈఈలతో పీఎం సూర్యఘర్, రెవెన్యూ కలెక్షన్లు, సైక్లోన్ డ్యామేజెస్, ఆర్డీఎస్ఎస్(రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం)పై ఆయన సమీక్ష నిర్వహించారు.

ట్రాన్స్‌కో కార్యకలాపాలపై ఫొటోగ్రఫీ పోటీలు

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు, ప్రజలు తమ ప్రతిభను, సృజనాత్మకతను కనబరిచే విధంగా అవకాశం ఇస్తూ ఏపీ ట్రాన్స్‌కో కార్యకలాపాలపై ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. సాంకేతికత, మౌలిక సదుపాయాలతో పాటు ప్రజల జీవితాలను వెలిగించే లక్షలాది మంది ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, సిబ్బంది అంకితభావం, నూతన ఆలోచనలను ప్రతిబింబించేలా ఈ ఫొటోలు ఉండాలని, వాటిని photocontest@aptransco.gov.in మెయిల్‌కు ఈనెల 15వ తేదీలోగా పంపాలని కోరారు.

పాలకుల ప్రోత్సాహంతోనే అవినీతి: ఈశ్వరయ్య

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పాలకుల ప్రోత్సాహంతోనే రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి పెరిగిపోయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి ప్రభుత్వానికి తెలియనిది కాదన్నారు. ప్రభుత్వ నేతలు, కొందరు ఎమ్మెల్యేలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా అవినీతిని ప్రోత్సహిస్తున్నట్లు ఇటీవల కొన్ని ఘటనల ద్వారా అర్థమవుతోందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నీ నేనే చేశా!

» నా క్రెడిట్.. బాబు చోరీ.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది నేనే: జగన్



అమరావతి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి అంతా తానే చేశానని.. ఆ క్రెడిట్‌ను సీఎం చంద్రబాబు చోరీ చేస్తున్నాడని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో తన పార్టీ విద్యార్థి విభాగంతో ఆయన సమావేశమయ్యారు. తాను చేసిన అభివృద్ధి ఇప్పుడు రివర్స్ అయిందని చెప్పారు. 2019 దాకా రాష్ట్రంలో 12 ప్రభుత్వ మెడికల్ కాలేజీలే ఉండేవన్నారు. చంద్రబాబు ఒక్కటీ కట్టలేదన్నారు. కరోనా ఉన్నప్పటికీ 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తెచ్చానని.. వాటిలో ఐదింటిని రూ.300 కోట్లతో పూర్తి చేశానని చెప్పారు. మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రైవేటుపరం చేస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా 12న అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలకు పిలుపిచ్చారు. డిసెంబరులో ఫీజు పోరు చేద్దామని చెప్పారు. వ్యవసాయాన్ని చంద్రబాబు దండగ మారిదని అంటారని.. తన హయాంలో పండుగ చేశానని తెలిపారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రావడానికి తన చొరవే కారణమన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు తన వల్లే వస్తోందని.. ఈ క్రెడిట్‌ను చంద్రబాబు చోరీ చేస్తున్నారని మళ్లీ అన్నారు. 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు కూడా చేపట్టానని చెప్పారు. భారీ పరిశ్రమలతో పెట్టుబడి ఎక్కువ.. ఉద్యోగాలు తక్కువగా ఉంటాయన్నారు. ఎంఎస్ఎంఈలలో పెట్టుబడులు తక్కువ.. ఉద్యోగాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు.

నీచ పోస్టుల భాస్కర్‌రెడ్డికి సంకెళ్లు



అమరావతి, పెనమలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలంటే కనీస గౌరవం లేకుండా, వ్యక్తిత్వ హననానికి పాల్పడే వైసీపీ సోషల్ మీడియాకు చెందిన ఎన్ఆర్ఐని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం చోడవరానికి చెందిన మాలపాటి భాస్కర్‌రెడ్డి లండన్‌లో ఉంటున్నారు. వైసీపీ హయాంలో అత్యంత హేయమైన పోస్టులు సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి.. పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, మాజీ సీజే జస్టిస్ ఎన్వీ రమణ... ఇలా ఎవరినీ వదిలపెట్టకుండా సామాజిక మాధ్యమాల్లో అసభ్య భాషను ఉపయోగిస్తూ మెసేజ్‌లు చేశాడు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడ టీడీపీ కార్యకర్తలు భాస్కర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న భాస్కర్‌రెడ్డి స్వదేశానికి రాకుండా లండన్‌లోనే ఉండిపోయాడు. అయితే ఐదు రోజుల క్రితం ఆయన తండ్రి మరణించారు. అంత్యక్రియల నిమిత్తం చోడవరం వస్తే పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతో తండ్రి మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన నెల్లూరు జిల్లా వెంగంపల్లికి రప్పించాడు. అక్కడే దహన కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిసింది. బుధవారం రాత్రి చోడవరం చేరుకున్న భాస్కర్‌రెడ్డి గురువారం తెల్లవారుజామున ఆరోగ్య పరీక్షల కోసం కానూరు వంద అడుగుల రోడ్డులోని కామినేని ఆసుపత్రికి తన సోదరునితో కలిసి వెళ్లాడు. పోలీసులు వెంటనే భాస్కరరెడ్డిని అదుపులోకి తీసుకొని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. భాస్కరరెడ్డి తల్లిదండ్రులది నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం అనాసాగరం మండలంలోని వెంగంపల్లి అనే కుగ్రామం. నలభై ఏళ్ల క్రితమే చోడవరం వలస వచ్చి ముఠా పనులు చేసుకుని పొట్టపోసుకునేవారు. భాస్కరరెడ్డి ఇక్కడే జన్మించాడు. బీటెక్ పూర్తి చేసిన ఆయన లండన్‌లో ఉద్యోగం సంపాదించాడు.



పెట్టుబడుల సదస్సుకు విశాఖ ముస్తాబు

ఈ నెల 14, 15 తేదీల్లో పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు జరగనున్నందున నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అతిథులు వచ్చే మార్గాలన్నింటికి మరమ్మతులు చేయించి, డివైడర్లకు రంగులు వేస్తున్నారు. నగరంలోని పలు కూడళ్లలో ఆకట్టుకునే కళాకృతులు ఏర్పాటు చేస్తున్నారు. ఆశీల్‌మెట్ట జంక్షన్ నుంచి సంపత్ వినాయకుడి ఆలయం, దత్త ఐలాండ్, సిరిపురం జంక్షన్ మీదుగా వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనా వరకూ ఉన్న ప్రధాన కూడళ్లలో ఈ కొత్త కళారూపాలను పెట్టారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



జూదరులతో 'సామాజిక సేవ'

వీరంతా జూదం ఆడుతూ దొరికిపోయారు. ఇప్పుడు జూదం వద్దంటూ ప్లకార్డులు పట్టుకుని రోడ్డుపై నిలబడ్డారు. జూదం ఆడటం నేరమంటూ ప్రచారం చేస్తున్నారు. "జూదం ఆడటం చట్టరీత్యా నేరం, బహిరంగ ప్రదేశాలలో మద్యపానం నిషేదం అంటూ ప్లకార్డులు పట్టుకుని శ్రీకాకుళంలోని ప్రదాన జంక్షన్ల వద్ద ప్రచారం చేస్తున్న ఈ వ్యక్తులు కొన్ని రోజుల క్రితం జూదం ఆడుతూ పట్టుబడ్డారు. వారిని పోలీసులు బుధవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా, పదిరోజులు సామాజిక సేవ చేయాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు. ఆ మేరకు శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లపై ఈ ఐదుగురు జూదానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ కనిపించారు.

- శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి

రాగిపిండి కప్పుల్లో టీ.. మట్టి బాటిళ్లతో నీరు

- సీఐఐ సదస్సులో 'జీరో వేస్ట్' విధానం
- టీ, టిఫిన్, భోజనం,స్నాక్స్ సరఫరాకు బయోడీగ్రేడబుల్ వస్తువుల వాడకం
- దేశంలోనే ఇది మొదటిసారి: పట్టాభిరామ్



విశాఖపట్నం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల సదస్సు (సీఐఐ)లో జీరో వేస్ట్ విధానాలను అనుసరించనున్నట్టు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. సదస్సులో ప్రతినిధులకు వంద శాతం రీసైక్లింగ్ అనుకూల బయోడీగ్రేడబుల్ వస్తువులను ఉపయోగించాలని నిర్ణయించామని, ఇది దేశంలోనే మొదటి 'జీరో వేస్ట్' మోడల్ కార్యక్రమంగా నిలిచిపోతోందని తెలిపారు. విశాఖలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. "సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు ఇచ్చే టీకప్పులను రాగి పిండితో తయారుచేయిస్తున్నాం. మట్టితో తయారుచేసిన బాటిళ్లతో తాగునీరు అందిస్తాం. సదస్సు జరుగుతున్నప్పుడే తడి, పొడి చెత్తను వేరుచేసి తడిచెత్తను అక్కడే డీకంపోజ్ చేసే ఏర్పాట్లు చేస్తున్నాం. సదస్సు జరిగే ప్రాంగణంలో ఫ్లెక్సీలకు బదులు ఎల్ఈడీ స్క్రీన్‌లు, డిజిటల్ స్క్రీన్‌లు, సమాచారం కోసం క్యూఆర్ కోడ్ పద్ధతిని అందుబాటులో ఉంచుతాం" అని తెలిపారు. అంతకుముందు ఆయన ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో సీఐఐ సదస్సు కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, తరలింపు వంటి అంశాలపై జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

20 మందికి గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్లుగా పదోన్నతి

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్లలోని కేటగిరి-2 మేనేజర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, మున్సిపాలిటీల్లోని శానిటరీ ఇన్స్పెక్టర్లను గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్లుగా నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2025-26 ప్యానల్‌లో మొత్తం 20 మందికి పదోన్నతులు కల్పించి ఆయా మున్సిపాలిటీల్లో కమిషనర్లుగా నియమించింది.

వన్ విజన్.. వన్ డైరెక్షన్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నా పౌరులకు సంతృప్తి కల్పించేలా అందరం పని చేయాలన్నారు. దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని, పౌరులకు సుపరిపాలన అందించాలని.. ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంచేశారు. ఇందుకు అనుగుణంగా విజన్ ప్రణాళికలు రూపొందించామన్నారు. నెల, త్రైమాసికాల వారీ లక్ష్యాలు పెట్టుకుని ఫలితాలు సాధించాలని సూచించారు. ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ డేటా ఆధారిత పాలనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

విజన్ ప్లాన్ అమలుకు టాస్క్‌ఫోర్స్

2047 స్వర్ణాంధ్ర విజన్ లక్ష్య సాధన కోసం గ్రామ/వార్డు సచివాలయాలు విజన్ యూనిట్లుగా పని చేయాలి. ఈ విభాగాన్ని సమర్థంగా వినియోగించుకోవాలి. ప్రతి నియోజకవర్గానికి ఒక సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, విజన్ ప్లాన్ అమలు చేస్తాం. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, ఆయా శాఖలకు అప్పగిస్తున్నాం. దానికి అనుగుణంగా నిర్ణయాలు వేగంగా తీసుకోవాలి. ప్రస్తుతం రియల్ టైమ్ గవర్నెన్స్ కాలం నడుస్తోంది. పౌరుల డేటా అంతా క్రోడీకరించాం. అంగన్వాడీల స్థాయి నుంచే విద్యార్థుల డేటా అనుసంధానం కావాలి. అవేర్ వ్యవస్థ ద్వారా విస్తృతమైన డేటాను సమన్వయం చేసుకుని, వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి. డేటా లేక్ వ్యవస్థ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖల సమాచారాన్నీ ఒక్కచోటే క్రోడీకరించి, నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కల్పిస్తున్నాం. డేటా ఆధారిత పాలన ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. సంక్షేమానికి, సుపరిపాలనకు భారీ స్థాయిలో ఖర్చు చేస్తున్నాం. నిధుల వినియోగం సమర్థంగా జరగాలి.

ఆఫీసుల చుట్టూ తిరగకుండా..

గతంలో కులం, స్థానికత, ఆదాయం.. ఇలా వేర్వేరు సర్టిఫికెట్ల కోసం పది రోజులు ఆఫీసుల చుట్టూ తిరిగి తీసుకోవలసి వచ్చేది. ఇక ఈ పరిస్థితి మారాలి. ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తున్నప్పుడు ప్రజలను మళ్లీ ఆఫీసులకు రప్పించడం ఎందుకు? కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన డిజి లాకర్ వ్యవస్థను సమర్థంగా వినియోగించాలి.

తప్పిదాలు జరక్కుండా చూసుకోవాలి

ఇటీవల కర్నూలులో ప్రమాదం జరిగిన బస్సు యజమానిది ఒక రాష్ట్రం. బస్సును రిజిస్ట్రేషన్ చేసింది మరో రాష్ట్రం.. నడిపేది ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి. ఈ విషయంలో ఎవరు బాధ్యత తీసుకోవాలనే ప్రశ్న వస్తోంది. శ్రీకాకుళంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి 9 మంది చనిపోయారు. ఒక సంఘటన జరిగిన తర్వాత తప్పులు దిద్దుకోవాల్సి వస్తోంది. ఇలాంటి ఘటనల విషయంలో నిర్దిష్ట ప్రామాణికాలు (ఎస్‌వోపీ) రూపొందించుకుని, మళ్లీ అలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలి. గత పాలకులు అన్ని శాఖల పనితీరునూ దెబ్బతీశారు. ఎక్సైజ్ విభాగంలో తీవ్రమైన అవకతవకలు జరిగితే.. వాటిని సరిచేస్తుంటే.. మళ్లీ మనపై నిందలేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి అపోహలు, ఆరోపణలు గుప్పించే ప్రయత్నాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. భూ సంబంధ వ్యవహారాల్లో లిటిగేషన్లు పెరుగుతున్నాయి. ఉన్నతాధికారులు సైతం కోర్టుకు వెళ్లే పరిస్థితులు వస్తున్నాయి. ఏఐ వాడితే జీవోల ద్వారా లిటిగేషన్లు రాకుండా నివారించవచ్చు. టెక్నాలజీతో ఖర్చులు కూడా తగ్గించవచ్చు.

తుఫాన్ నష్టాలను తగ్గించాం..

గడచిన 16 నెలల్లో టెక్నాలజీని అనుసంధానం చేసుకుని, ఒక సమర్థ విధానం తయారు చేసుకున్నాం. ఇటీవల మొంథా తుఫాన్ సందర్భంగా టెక్నాలజీతో రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి, ప్రాణ నష్టాన్ని బాగా తగ్గించగలిగాం. ఆస్తి నష్టాన్ని నివారించగలిగాం.

మీ పనితీరు బాగోలేదు!

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర పూర్తవుతోంది. కొన్ని శాఖల పనితీరు బాగానే ఉన్నా.. మిగిలిన శాఖల పనితీరు మెరుగుపరచుకోవాలి. ప్రతిరోజూ పనిపై దృష్టి పెట్టాలి. అందరూ క్షేత్రస్థాయికి వెళ్లాలి. ప్రతి సమావేశంలోనూ మంత్రులు, కార్యదర్శులు క్షేత్రస్థాయికి వెళ్లాలని నేను చెబుతున్నా, చాలా మంది నుంచి స్పందన లేదు. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక కూడా మన పనితీరు మెరుగుపడకపోతే అది మన తప్పే అవుతుంది. కొందరు మంత్రుల వద్ద ఫైళ్ల జీరో పెండెన్సీ ఉంటే మరికొందరి వద్ద ఐదారు రోజుల వరకు పెండెన్సీ చూపిస్తోంది. ఇది సరికాదు. ప్రజల్లో సంతృప్త స్థాయి పెరిగేందుకు కొన్ని విభాగాలు అత్యంత ప్రభావవంతంగా పని చేస్తున్నాయి. శానిటేషన్ విషయంలో ఆర్టీసీ కొంత వెనుకబడిఉంది. రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖలు మరింత మెరుగవ్వాలి. రిజిస్ట్రేషన్ విభాగం సేవల్లో సంతృప్తి స్థాయి 62-70 శాతానికి చేరింది.



చంద్రబాబుకు 'మన్‌కీ బాత్' పుస్తకాన్ని అందిస్తున్న మాధవ్, మధుకర్

బాబుతో మాధవ్ భేటీ

- 'స్వదేశీ' స్టిక్కర్, 'మన్ కీ బాత్' పుస్తకం బహూకరణ

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పార్టీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'స్వదేశీ' స్టిక్కర్‌తోపాటు, ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' ప్రసారాల ఆధారంగా రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని సీఎంకు బహూకరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మోదీ.. దేశ ప్రజలకు ప్రేరణనిచ్చే అనేక అంశాలను 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రస్తావిస్తూ, సామాజిక చైతన్యం కల్పిస్తున్నారని అభిప్రాయపడ్డారు.

కూల్చివేతకు మిగతా ఖర్చు చెల్లించండి!

- అక్రమ గోడ మిగిలిన భాగాన్ని తొలగించేందుకు జీవీఎంసీకి మరో 31.97 లక్షలు జమ చేయాలి
- నేహారెడ్డి, అవ్యాన్ రియల్టర్స్‌కు హైకోర్టు ఆదేశం



అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా సముద్రానికి అతి సమీపంలో నిర్మించిన కాంక్రీట్ గోడ మిగిలిన భాగాన్ని తొలగించేందుకయ్యే ఖర్చును కూడా చెల్లించాలని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి, ఆమె కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీని హైకోర్టు గురువారం ఆదేశించింది. జీవీఎంసీ కోరిన విధంగా రూ.31.97 లక్షలు చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మొత్తాన్ని రెండు వారాల్లో జీవీఎంసీకి జమ చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావు ధర్మాసనం పేర్కొంది. అలాగే అక్రమ కాంక్రీట్ నిర్మాణాలతో ప్రకృతికి రూ.17.46 కోట్ల నష్టం జరిగిందంటూ కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ కమిటీ ఇచ్చిన నివేదికపై నాలుగు వారాల్లోగా అభ్యంతరాలు తెలిపేందుకు నేహారెడ్డి, అవ్యాన్ రియల్టర్స్‌లకు వెసులుబాటు ఇచ్చింది. కాగా, నేహారెడ్డి, ఆమె కంపెనీ తరఫున న్యాయవాది సత్యప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది, రెస్టోబార్ యజమానుల తరఫు న్యాయవాది సార్వభౌమారావు వాదనలు వినిపించారు.

కసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై అభ్యంతరాలను మా ముందుంచండి

- సిట్ అధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై అభ్యంతరాలతో కౌంటర్ వేయాలని సిట్ అధికారులను హైకోర్టు ఆదేశించింది. గురువారం ఆ పిటిషన్ విచారణకు రాగా సిట్ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు స్పందించారు. వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని, వివరాలు సమర్పించేందుకు సమయమివ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి తదుపరి విచారణను 14వ తేదీకి వాయిదా వేశారు. కసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

విచారణార్హతపై వాదనలు వినిపించండి

- రోహిత్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డిలకు హైకోర్టు ఆదేశం

మద్యం కుంభకోణంకేసు దర్యాప్తులో భాగంగా సీఆర్పీసీ సెక్షన్ 161 కింద నమోదుచేసిన తమ వాంగ్మూలాలను దర్యాప్తు రికార్డుల నుంచి తొలగించాలని కోరుతూ పెనక రోహిత్‌రెడ్డి, పెనక శరత్‌చంద్రారెడ్డి దాఖలు చేసిన పిటిషన్లకు విచారణార్హత లేదని సిట్ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు హైకోర్టుకు నివేదించారు. ముందుగా విచారణార్హతపై వాదనలు వినాలని అభ్యర్థించారు. వ్యాజ్యాల విచారణార్హతపై ప్రాసిక్యూషన్ అభ్యంతరం లేవనెత్తుతున్న నేపథ్యంలో ముందుగా ఈ వ్యవహారంపై తదుపరి విచారణలో వాదనలు వినిపించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది మయాంక్‌జైన్‌కు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సూచించారు.

ఐపీఎస్ విశాల్‌గున్నికేసు విచారణ 11కు వాయిదా

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి విశాల్ గున్ని సస్పెన్షన్‌ను ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు తక్షణం విధుల్లోకి తీసుకొని ఆయనకు పోస్టింగ్ ఇవ్వాలని క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. విచారణ ప్రారంభమైన వెంటనే ప్రభుత్వ న్యాయవాది జీవీఎల్ మూర్తి స్పందిస్తూ... 'ప్రస్తుత కేసులో అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారు. విచారణను వాయిదా వేయాలి' అని కోరారు. అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ తుహిన్ కుమార్‌తో కూడిన ధర్మాసనం పిటిషన్‌పై విచారణను నవంబరు 11కి వాయిదా వేసింది.

సంజయ్ బెయిల్‌పై విచారణ 10కి వాయిదా

విజయవాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపకశాఖ నిధుల దుర్వినియోగం కేసులో ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈనెల పదో తేదీకి వాయిదా పడింది. ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన కొద్దిరోజుల క్రితం ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం విచారణ జరిపిన న్యాయస్థానం తదుపరి విచారణను పదో తేదీకి వాయిదా వేసింది.

నకిలీ మద్యం నిందితులకు రిమాండ్ పొడిగింపు

- బెయిల్ పిటిషన్లపై విచారణ 11కు వాయిదా

విజయవాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో 11 మంది నిందితులకు విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. న్యాయాధికారి జి.లెనిన్‌బాబు గురువారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. నెల్లూరు కేంద్ర కారాగారంలో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరెడ్డి, అంగులూరి వెంకట కల్యాణ్, నకిరికంటి రవి, తాండ్ర రమేష్‌బాబు, షేక్ అల్లాబక్షు, చెక్కా సతీష్‌కుమార్, విజయవాడ జిల్లా జైల్లో అద్దేపల్లి జగన్మోహనరావు, బాదల్ దాస్, ప్రదీప్ దాస్ ఉన్నారు. వారిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయాధికారి ముందు హాజరుపరిచారు. వారికి 13వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగించారు. మరోవైపు ఈ కేసులో తొమ్మిది మంది నిందితులతోపాటు జోగిబ్రదర్స్ వేసిన బెయిల్ పిటిషన్లపై విచారణను ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 11వ తేదీకి వాయిదా వేసింది. అద్దేపల్లి బ్రదర్స్, నకిరికంటి రవి, బాదల్ దాస్, ప్రదీప్ దాస్, డి.శ్రీనివాసరెడ్డి, అంగులూరు వెంకట కల్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, చెక్కా సతీష్‌కుమార్, జోగి సోదరుల బెయిల్ పిటిషన్లపై ఎక్సైజ్ అధికారులు గురువారం కౌంటర్ దాఖలు చేశారు.

'ఆంధ్రా కురియన్' మండవ కన్నుమూత

- కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్‌గా 27ఏళ్ల పాటు సేవలు



గన్నవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య (94) కన్నుమూశారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిన అవుటపల్లి ఋషి వాటికలోని ఆయన స్వగృహము నందు గురువారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో 1992లో రెండో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జానకిరామయ్య.. స్వల్పకాలంలోనే సంస్థను లాభాల బాట పట్టించారు. దేశంలోనే అత్యధిక పాల సేకరణ ధర ఇవ్వడంతో పాటు రైతులకు బోనస్‌లు పంపిణీ చేసింది జానకిరామయ్యే. ఉద్యోగులకు కూడా బోనస్‌లు ఇచ్చేవారు. ఆయన సేవలను గుర్తించిన ఇండియన్ డెయిరి అసోసియేషన్.. వర్గీస్ కురియన్ అవార్డుతో ఆయనను సత్కరించింది. అందుకే జానకిరామయ్యను ఆంధ్రా కురియన్‌గా పిలుస్తారు. ఆయన భౌతికకాయానికి అల్లాపురం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

'సర్' కోసం ముందస్తు ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్లతో సీఈఓ వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలోని ఓటర్ల జాబితాను కచ్చితంగా, పారదర్శకంగా చేయడమే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్) - 2026 లక్ష్యం. దీనికోసం ముందస్తు ఏర్పాట్లను ప్రారంభించాం' అని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈఓ) వివేక్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. "ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్‌కి (బీఎల్ఓ) ప్రత్యేక ఐడీ కార్డులు జారీ చేస్తున్నాం. వారంరోజుల్లో ఈ ఐడీ కార్డులు పంపిణీని పూర్తి చేయాలి" అని ఆదేశించారు.

మరో రెండు నెలలు ఫ్రీహోల్డ్‌పై నిషేధం

అమరావతి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ భూముల ప్రకటన, వాటి రిజిస్ట్రేషన్ లపై నిషేధాన్ని మరో రెండు నెలల పాటు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే ఏడాది జనవరి 5 వరకు ఈ నిషేధం కొనసాగనుంది.

నేడు కోస్తా, సీమల్లో వర్షాలు

విశాఖపట్నం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మధ్య బంగాళాఖాతం నుంచి తమిళనాడు, కర్ణాటక మీదుగా అరేబియా సముద్రం వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తాలో ఎక్కువచోట్ల పొడి వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

26 మంది పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

- స్వర్ణ పంచాయతీల డేటా సేకరణలో నిర్లక్ష్య ఫలితం

అమరావతి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీల డేటా సేకరణలో తీవ్ర నిర్లక్ష్యం వహించిన 26మంది పంచాయతీ కార్యదర్శులపై ఆ శాఖ కమిషనర్ వేటువేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణ పంచాయతీ పోర్టల్ తీసుకురాగా, కొందరు పంచాయతీ కార్యదర్శుల నిర్వాకంతో ఈప్రక్రియలో తప్పిదాలు జరిగాయి. దాదాపు మూడు వేల పంచాయతీల పరిధిలో వీటిని గుర్తించారు. ఒక్కో పంచాయతీలో ఒకే ఫోన్ నంబర్‌ను వందల అసెస్‌మెంట్‌లకు లింక్ చేసినట్టు అధికారులు గుర్తించారు. దీంతో తీవ్రనిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శులను...జిల్లాకు ఒకరి చొప్పున గుర్తించి వారందరిపైనా ప్రభుత్వం వేటు వేసింది.

మద్యం అమ్మకాలు డౌన్

(మొదటి పేజీ తరువాయి)

పాలసీ అమల్లోకి వచ్చింది. ఆ సమయంలో కొత్తగా షాపులు ఏర్పాటుచేసుకున్న మద్యం వ్యాపారులు భారీగా మద్యం దిగుమతి చేసుకున్నారు. దాంతో గతేడాది అక్టోబరులో అమ్మకాలు భారీగా నమోదయ్యాయనే వాదన వినిపిస్తోంది. అయితే మొత్తం 26 జిల్లాల్లో అమ్మకాల్లో నాలుగు జిల్లాల్లో మాత్రమే వృద్ధి నమోదైంది. 25 శాతానికి పైగా అమ్మకాలు తగ్గిన జిల్లాలపై అధికారులు దృష్టిపెట్టారు. అక్కడ నాటుసారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ఇతర మత్తు పదార్థాలు ఏవైనా ఉన్నాయా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఒకప్పుడు బెల్టులు వ్యవస్థీకృతంగా ఉండేవి. లైసెన్స్ షాపుల తరహాలోనే కనిపించేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటికి చెక్ పెట్టింది. అయితే రహస్యంగా బెల్టులు అక్కడక్కడా కొనసాగుతున్నాయి. చాలావరకు లైసెన్సీలే వారి పరిధిలో కొన్ని బెల్టు షాపులు ఏర్పాటుచేసుకుని వాటి ద్వారా ఆ షాపు మద్యం అమ్ముతున్నారు. ఇందులో నకిలీ మద్యం వ్యవహారం లేదు. అయితే నకిలీ మద్యం వెలుగులోకి వచ్చాక ముఖ్యమంత్రి ఆదేశాలతో బెల్టులపై ఎక్సైజ్ శాఖ మరింత నిఘా పెట్టింది. ఎక్కడైనా బెల్టులో నకిలీ మద్యం దొరికినా సమీపంలోని మద్యం షాపు బాధ్యత అన్నట్టుగా చర్యలకు దిగింది. దీంతో లైసెన్సీలు షాపులకే పరిమితమవుతున్నారు. అలాగే ఎక్సైజ్ నిఘా ఫలితంగా మద్యం అమ్మకాలు తగ్గిపోయాయి. ఇక కార్తీక మాసం, అయ్యప్ప దీక్షల సీజన్ కావడంతో రానున్న రెండు నెలలు మద్యం అమ్మకాలు ఇంకా తగ్గిపోతాయని అంచనా వేస్తున్నారు.

ఆ జిల్లాల్లో ఎందుకు తగ్గింది?

ఐదు జిల్లాల్లో ఒకేసారి 25 శాతానికి పైగా మద్యం అమ్మకాలు పడిపోవడంపై ఎక్సైజ్‌శాఖ దృష్టి పెట్టింది. అంత పెద్దమొత్తంలో అమ్మకాలు తగ్గాయంటే అక్కడ నాటుసారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ఇతర మత్తు పదార్థాలు ఏవైనా ఉన్నాయా? అనే కోణంలో ఆరా తీస్తోంది. బుధవారం మంగళగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి ఎక్సైజ్ సమీక్షలోనూ దీనిపై ప్రధానంగా చర్చ జరిగింది. ఆ జిల్లాల్లో స్టేషన్ల వారీగా అమ్మకాల వివరాలివ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆ జిల్లాల పనితీరు అస్సలు బాగాలేదని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. నాటుసారా నియంత్రణలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలు బాధ్యతారాహితంగా వ్యవహరిస్తున్నాయని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. దీంతో నాటుసారా, గంజాయి వల్లే మద్యం అమ్మకాలు తగ్గాయా? అనే అనుమానాలు వస్తున్నాయి.

నాటుసారాపై ఆందోళన

బెల్టులపై కఠిన వైఖరితో నాటుసారా ఆందోళన ఎక్సైజ్‌లో పెరుగుతోంది. మద్యం అందుబాటులో లేనప్పుడు నాటుసారా పెరుగుతుంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు మద్యం లేకపోతే నాటుసారాకు మొగ్గుతారు. ఇప్పుడు బెల్టుల కనుమరుగుతో మళ్లీ నాటుసారా పెరుగుతుందేమోనని ఎక్సైజ్‌వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

అమ్మకాలు ఇలా

లిక్కర్ కేసుల అమ్మకాలు 2024 అక్టోబరులో 34.13 లక్షలు జరిగితే, ఈ ఏడాది అక్టోబరులో 33 లక్షలే అమ్ముడయ్యాయి. గతేడాది అక్టోబరులో బీరు 11.34లక్షల కేసులు అమ్మితే, ఇప్పుడు 16.21లక్షల కేసులు విక్రయించారు. బీరు అమ్మకాలు పెరిగినా విలువ పరంగా తక్కువ కావడంతో మొత్తంగా అమ్మకాలు తగ్గినట్లైంది. గతేడాది అక్టోబరుతో పోలిస్తే 15 శాతం అమ్మకాలు తగ్గాయి. శ్రీసత్యసాయి, చిత్తూరు, కర్నూలు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మాత్రం అమ్మకాలు పెరిగాయి. పశ్చిమగోదావరిలో 34.4శాతం, విజయనగరంలో 33.1శాతం, పార్వతీపురం మన్యంలో 30.6శాతం, శ్రీకాకుళంలో 28.4 శాతం, నెల్లూరులో 25.7శాతం అమ్మకాలు పడిపోయాయి. వీటితో పాటు ప్రకాశంలో 23.1శాతం, కృష్ణాలో 21.5శాతం అమ్మకాలు తగ్గాయి. బాపట్లలో 18.2శాతం, కడపలో 17.5శాతం, విశాఖపట్నంలో 17.3శాతం, కోనసీమలో 17.3శాతం, నంద్యాలలో 16.5శాతం, అనకాపల్లిలో 15శాతం అమ్మకాలు తగ్గాయి.

చంద్రశేఖర్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం

ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంలో కడప జిల్లా ఎక్సైజ్ ఏసీ చంద్రశేఖర్‌రెడ్డిపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యం పట్టుబడితే ప్రొసీజర్ ఫాలో అవ్వకుండా ప్రెస్‌మీట్ పెట్టడం ఏంటని ఏసీని నిలదీశారు. 'నువ్వేమైనా హీరో అనుకుంటున్నావా?' అని ఓ ఉన్నతాధికారులు అన్నట్టు తెలిసింది.

అదానీకి బ్రేకులు!

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన సమావేశంలో అల్లూవియల్ హెవీ మినరల్స్‌కు, ఏపీఎండీసీకి మధ్య వాటాలపై ఒప్పందం కుదిరిందని ప్రభుత్వ సంస్థ నివేదిక ఇచ్చింది. నిజానికి వాటాల ఒప్పందం ఖరారు కాలేదన్న అంశంపైనే కోర్టు ప్రభుత్వానికి అఫిడవిట్ దాఖలుకు సమయం ఇచ్చింది. కానీ ప్రభుత్వ స్థాయిలో ఒప్పందం పూర్తయినట్లుగా ఏపీఎండీసీ సర్కారుకు నివేదించడం చర్చనీయాంశంగా మారింది.

నాడు జగన్ సర్కారు డిజైన్

గత జగన్ ప్రభుత్వ హయాంలో బీచ్‌శాండ్ మైనింగ్‌కు కేంద్రం అనుమతి ఇచ్చింది. లీజులు ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎండీసీ పేరిట మంజూరు చేసింది. 2019లో మారిన కేంద్ర గనుల చట్టం (ఎంఎండీఆర్ యాక్ట్) ప్రకారం కేవలం ప్రభుత్వ రంగ సంస్థలే బీచ్‌శాండ్ మినరల్స్ మైనింగ్ చేయాలని కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రైవేటు మైనింగ్‌ను నిషేధించింది. ఒకవేళ ప్రైవేటు సంస్థ భాగస్వామ్యం తప్పనిసరి అనుకుంటే, ప్రభుత్వ రంగ సంస్థకు 76 శాతం, ప్రైవేటు కంపెనీకి 24 శాతం వాటా చొప్పున ఎంఓయూ కుదుర్చుకొని ఉమ్మడి మైనింగ్ చేసుకోవచ్చని వెసులుబాటు ఇచ్చింది. అయితే అంతకుముందే బీచ్‌శాండ్‌పై అదానీ గ్రూప్ కన్నేసింది. దేశంలోనే అత్యంత విలువైన బీచ్‌శాండ్ నిక్షేపాలు, నిల్వలు ఒక్క ఏపీలోనే ఉన్నాయి. దీంతో ఏపీలో లబ్ధి పొందాలని ఆ సంస్థ అనుకుంది. 2023లో అప్పటి జగన్ సర్కారు టెండర్‌ను తెరమీదకు తీసుకొచ్చింది. శ్రీకాకుళం జిల్లా గార, విశాఖ జిల్లా భీమిలిలో కలిపి వెయ్యి హెక్టార్ల పరిధిలో బీచ్‌శాండ్ మైనింగ్ కోసం ప్రాజెక్టు డెవలపర్ అనే కొత్త విధానంతో టెండర్ రూపొందించారు. 2023లో టెండర్లు నిర్వహించగా అదానీ గ్రూప్‌నకు చెందిన కంపెనీ అల్లూవియల్ హెవీ మినరల్స్‌కే టెండర్ దక్కింది. దీనిపై 2024లో పిల్ హైకోర్టులో దాఖలైంది. టెండర్‌ను ఖరారు చేయవద్దని హైకోర్టు అప్పట్లోనే ఆదేశాలు ఇచ్చింది. కూటమి సర్కారు వచ్చాక పిల్ వేసిన వ్యక్తి దాన్ని ఉపసంహరించుకున్నారు. దీంతో టెండర్‌ను ఏపీఎండీసీ ఖరారు చేసింది.

మరోసారి పిల్: అదానీ గ్రూప్‌నకు టెండర్ కట్టబెడుతూ అధికారిక ఉత్తర్వులిచ్చే సమయంలో అక్టోబరు 6న హైకోర్టులో మరో పిల్ దాఖలైంది. దీన్ని హైకోర్టు విచారణకు స్వీకరించింది. బీచ్‌శాండ్ మినరల్స్ మైనింగ్‌లో కేంద్రం ప్రైవేటు సంస్థలను నిషేధించాక, ప్రైవేటు కంపెనీలను ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు? ఆ కంపెనీకి 90 శాతం వాటా ఏ ప్రాతిపదికన ఇచ్చారు? అని న్యాయస్థానం ప్రశ్నించింది. తాము ప్రాజెక్టు డెవలపర్‌ను ఎంపిక చేశామని, ఇందులో ఉల్లంఘనలు లేవని ప్రభుత్వం నివేదించింది. అయితే, దీన్ని కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. వాటాలపై టెండర్ అగ్రిమెంట్ చేసుకున్నారా? అని న్యాయస్థానం ప్రశ్నించినట్లు తెలిసింది. తాము వాటాలు ఎంతన్నది ఇంకా ఖరారు చేయలేదని సర్కారు కోర్టుకు నివేదించినట్లు సమాచారం. కేంద్ర చట్టం, మార్గదర్శకాల ప్రకారం ఏపీఎండీసీ వాటా ఎంతో తేల్చుకొని లిఖితపూర్వకంగా కోర్టుకు తెలియజేయాలని న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా, బీచ్‌శాండ్ మైనింగ్ ప్రాజెక్టులో లీజుదారు ఏపీఎండీసీ వాటా 10 శాతం, డెవలపర్‌గా అదానీ గ్రూప్‌నకు చెందిన అల్లూవియల్ హెవీ మినరల్స్ వాటా 90 శాతం. ఎండీసీ ఇటీవల ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో వాటాల విషయం ప్రముఖంగా ప్రస్తావించింది. ఎండీసీ, అల్లూవియల్ హెవీ మినరల్స్ మధ్య ఒప్పందం కుదిరిందని అందులో పేర్కొంది. అయితే, న్యాయస్థానానికి మాత్రం ఇంకా వాటాలు ఖరారు కాలేదని ఎండీసీ నివేదించినట్లు తెలిసింది. దీనిపై విమర్శలు వస్తున్నాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.